ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ లో
మీకు నిజం రాసే ధైర్యం ఉందా?
అందుకు
వార్త సంధ్య మీ వేదిక!
రండి — ప్రజల గళంగా,
నిజం కోసం మాతో కలవండి.
ఇప్పుడే రిపోర్టర్ గా చేరండి
vaarthasandhya@gmail.com

RNI TGTEL/25/A5065

vaartha sandhya
# వార్త సంధ్య
తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు



SEGGEM KIRAN KUMAR
EDITOR & MD
VAARTHA SANDHYA , CM NEWS TV

Published From : Rangareddy, Hyderabad e - paper.vaarthasandhya.com సంపుటి : 01 సంచిక : 95 శనివారం 21 - 03 - 2026 ఎడిటర్ : సెగ్గెం కిరణ్ కుమార్ పేజీలు : 08 వెల : 6/-

Published From : Rangareddy, Hyderabad e - paper.vaarthasandhya.com VOLUME : 01 Issue : 95 Saturday 21 - 03 - 2026 Editor : Seggem Kiran Kumar Pages : 08 Price : 6/-

# ఇక టెన్త్ పరీక్షలు ఉండవు

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- విద్యావిధానంలో మార్పులు
- రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు
- ఫోన్ ట్యాపింగ్, జీవన్ రెడ్డి వ్యవహారంపై కూడా స్పందించిన ముఖ్యమంత్రి
- ఫోన్ ట్యాపింగ్ కేసులో అరెస్టులు కొనసాగుతాయన్న ముఖ్యమంత్రి
- విద్యా విధానంలో మార్పులు తెస్తున్నామని వెల్లడి
- జీవన్ రెడ్డి వ్యవహారాన్ని టీపీసీసీ చీఫ్, ఇంఛార్జ్ చూసుకుంటారని స్పష్టీకరణ



**వార్త సంధ్య, హైదరాబాద్, మార్చి 20 :**
ఫోన్ ట్యాపింగ్ అరెస్టులు, సీనియర్ నాయకుడు జీవన్ రెడ్డి వ్యవహారం, విద్యా విధానం అంశాలపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. మీడియాతో పిచ్చాపాటిగా మాట్లాడిన ఆయన, విద్యా విధానంలో కీలక మార్పులు తెస్తున్నామని స్పష్టం చేశారు. ఇక టెన్త్ పరీక్షలు ఉండవని చెప్పారు. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు ఒకే విధానం ఉంటుందని, దీనిని ముమ్మందు అమలుచేస్తామని అన్నారు. మూసీ ప్రక్షాళన - మిగతా 2 లో

## ఆరు గ్యారంటీలకు
# రూ.50,713 కోట్లు



- రైతు భరోసాకే రూ.18వేల కోట్లు
- బడ్జెట్ కేటాయింపులో సంక్షేమానికి పెద్ద పీఠ వేసిన తెలంగాణ ప్రభుత్వం
- ఆరు గ్యారంటీలకు రూ.50,713 కోట్లు కేటాయింపు
- గత ఏడాది కంటే పెరిగిన పద్దు

**వార్త సంధ్య, హైదరాబాద్, మార్చి 20 :**
తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాష్ట్ర వార్షిక బడ్జెట్‌లో సంక్షేమానికి పెద్దపీట వేసింది. దీనిలో భాగంగా ఆరు గ్యారంటీలకు రూ. 50,713 కోట్లను కేటాయించింది. ఈసారి పద్దులో రైతుభరోసాకు రూ. 18 వేల కోట్లను కేటాయించింది. దీనికి సంబంధించిన - మిగతా 2 లో




2 లో

# బడ్జెట్ అంతా బోగస్

- తెలంగాణ బడ్జెట్‌పై స్పందించిన బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు
- బడ్జెట్ తీవ్రంగా నిరాశపరిచిందన్న హరీశ్ రావు
- సకల జనులకు దక్కింది గుండుసున్నా అని ఎద్దేవా
- అంకెల గారడీ, మాటల గారడీ తప్ప బడ్జెట్‌లో ఏమీలేదని విమర్శలు

## మరోసారి అధికారమే లక్ష్యంగా
# మమతా బెనర్జీ మేనిఫెస్టో

- ప్రజలను ఆకట్టుకునే దిశగా 10 హామీలు!
- ఏప్రిల్ 23, 29 తేదీల్లో రెండు విడతల్లో పశ్చిమ బెంగాల్ ఎన్నికలు
- బీజేపీని ఢీకొనేందుకు భారీ హామీలను ప్రకటించిన మమత
- బీజేపీకి ఈసీ లబ్ధి చేకూరుస్తోందని ఆరోపణ



**వార్త సంధ్య, బంగాల్ , మార్చి 20 :**
బంగాల్ అసెంబ్లీ ఎన్నికల కోసం తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) పార్టీ మేనిఫెస్టోను సీఎం మమతా బెనర్జీ శుక్రవారం విడుదల చేశారు. 'బంగాల్ ప్రజలకు దీదీ 10 హామీలు' శీర్షికన ఈ మేనిఫెస్టో బుక్‌లెట్‌ను రూపొందించారు. ప్రజా కేంద్రకంగా తమ మేనిఫెస్టో ఉంటుందని మమతా బెనర్జీ ప్రకటించారు. బంగాల్‌లోకి కేంద్ర ప్రభుత్వ జోక్యాన్ని అడ్డుకోవడం, బంగాల్ ఉనికిని కాపాడటం తమ పార్టీ లక్ష్యాలని వెల్లడించారు. బంగాల్ ఎన్నికల తర్వాత నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజెన్స్ (ఎన్ఆర్సీ), జన గణన పేర్లతో ప్రజల పౌరసత్వాలను లాక్కునే యత్నాన్ని కేంద్ర ప్రభుత్వం చేస్తుందని ఆమె ఆరోపించారు.

**దీదీ ప్రకటించిన 10 హామీలు:**
ఓటర్లను ఆకర్షించేందుకు మమత సంక్షేమ పథకాల వర్షం కురిపించారు.
లక్ష్మీ భండార్ పెంపు: జనరల్ కేటగిరీ మహిళలకు నెలకు రూ. 1,500, ఎస్సీ/ఎస్టీ మహిళలకు రూ. 1,700 ఆర్థిక సాయం.
యువతకు అండ: 'బంగ్లార్ యువశక్తి' కింద నిరుద్యోగ యువతకు నెలకు రూ. 1,500 భృతి.
వ్యవసాయ బడ్జెట్: రైతుల కోసం రూ. 30,000 కోట్లతో ప్రత్యేక అగ్రికల్చర్ బడ్జెట్.
ద్వారే చికిత్స: ప్రతి బ్లాక్‌లోనూ ఇంటి వద్దకే వైద్య సేవలు అందించేలా మెడికల్ క్యాంపులు.
ఆధునిక విద్య: 'బంగ్లార్ శిక్షాయతన్' కింద ప్రభుత్వ పాఠశాలల ఆధునికీకరణ. - మిగతా 2 లో




2 లో

# ఆన్‌లైన్ జూదానికి చెక్... మరో 300 యాప్‌లు

- వెబ్‌సైట్లపై కేంద్రం వేటు
- ఆన్‌లైన్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్‌పై కేంద్రం కఠిన చర్యలు
- మరిన్ని అక్రమ వెబ్‌సైట్లు, యాప్‌లపై తాజాగా వేటు
- కొత్త ఆన్‌లైన్ గేమింగ్ చట్టం కింద కొనసాగుతున్న చర్యలు
- ఆర్థిక నష్టాలు, ఆత్మహత్యల నేపథ్యంలో కఠిన నిబంధనలు
- ఈ-స్పోర్ట్స్, సురక్షిత గేమింగ్‌కు మాత్రం ప్రభుత్వ ప్రోత్సాహం

# ఇప్పుడు జరుగుతున్న యుద్ధాన్ని భారత్ ఆపగలదు



2 లో

- ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్
- నాగ్‌పూర్‌లో ఆర్ఎస్ఎస్ ప్రాంతీయ కార్యాలయ భవన నిర్మాణ భూమి పూజ
- హాజరైన ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్
- ప్రపంచ యుద్ధాలను ఆపగల సత్తా భారత్‌కు ఉందని వ్యాఖ్య
- శాంతి స్థాపన కోసం ప్రపంచం భారత్ వైపు చూస్తోందని వెల్లడి
- ప్రపంచంలో బలవంతుడిదే రాజ్యం అనే నీతి నడుస్తోందని విమర్శ



2 లో

# ఏపీకి వర్ష సూచన

- దక్షిణ కోస్తాలో వడగళ్ల వాన హెచ్చరిక!
- ఏపీ తీరంపై ఉపరితల ఆవర్తనం, కొనసాగుతున్న ద్రోణి
- రాష్ట్రంలో రాబోయే మూడు రోజులు విస్తారంగా వర్షాలు
- దక్షిణ కోస్తా, రాయలసీమకు భారీ వర్ష హెచ్చరిక
- దక్షిణ కోస్తాలో అక్కడక్కడా వడగళ్ల వాన కురిసే అవకాశం
- గంటకు 60 కి.మీ వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయని వెల్లడి

## ఇది నిరుద్యోగులను
# వంచించడమే




2 లో

- చంద్రబాబుది పచ్చి మోసం
- ఏపీ జాబ్ క్యాలెండర్‌పై షర్మిల ఫైర్
- ఉగాదికి 10,060 పోస్టులతో జాబ్ క్యాలెండర్ విడుదల చేసిన ఏపీ ప్రభుత్వం
- ఇది నిరుద్యోగులను మోసం చేయడమేనంటూ తీవ్రంగా విమర్శించిన షర్మిల
- రాష్ట్రంలో 1.80 లక్షల ఖాళీలుంటే పదివేల పోస్టులేంటని ప్రశ్న
- వివిధ శాఖల్లో ఖాళీల భర్తీ హామీ ఏమైందని ప్రభుత్వాన్ని నిలదీత
- ఉద్యోగాలకు వయోపరిమితిని 46 ఏళ్లకు పెంచాలని డిమాండ్

# సంక్షోభం ముదరకముందే అప్రమత్తంగా వ్యవహరించాలి

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు
- పెట్రోల్, డీజిల్ పై అధికారులను అప్రమత్తం చేసిన సీఎం చంద్రబాబు
- పెట్రోల్, డీజిల్ కొరత రాకుండా చూడాలని సీఎం ఆదేశం
- ఇండక్షన్ స్టవ్‌లు, పీఎన్‌జీ వంటి ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించాలని సూచన
- అకాల వర్షాలతో రాష్ట్రంలో రూ.62 కోట్ల మేర పంట నష్టం అంచనా
- మొక్కజొన్న వరితో పాటు ఉద్యాన పంటలకు తీవ్ర నష్టం



**వార్త సంధ్య, అమరావతి, మార్చి 20 :**
ఇరాన్, ఇజ్రాయిల్ మధ్య నెలకొన్న యుద్ధ వాతావరణం ప్రపంచ సరఫరా గొలుసుపై (గ్లోబల్ సప్లయ్ చైన్) తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉందని, ఈ నేపథ్యంలో రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్, ఎరువుల కొరత ఏర్పడకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. సంక్షోభం ముదరకముందే అప్రమత్తంగా వ్యవహరించాలని, అవసరమైన నిల్వల కోసం కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరపాలని స్పష్టం చేశారు.భవిష్యత్తులో ఇంధన సమస్యలు తలెత్తకుండా శాశ్వత పరిష్కార మార్గాలపై దృష్టి సారించాలని సూచించారు. ఇండక్షన్ స్టవ్‌లు, పైపుల ద్వారా గ్యాస్ సరఫరా (పీఎన్‌జీ), ఎలక్ట్రిక్ వాహనాలు (ఈవీ) వంటి ప్రత్యామ్నాయాలను ప్రోత్సహించడం ద్వారా - మిగతా 2 లో

# సంపాదకీయం

## ఇరాన్ ఊబిలో ట్రంప్!



ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దేశాల దురాక్రమణ యుద్ధం పద్దెనిమిదో రోజుకు చేరుకున్నా ఆ రెండు దేశాలకూ దారీతెన్నూ తోచడం లేదు. మంగళవారం కీలకమైన ఇద్దరు ఇరాన్ నేతలు అలీ లారిజానీ, సులేమానీలనూ, బుధవారం మరో అగ్రశ్రేణి నేత ఇస్మాయిల్ ఖతీబ్‌నూ హతమార్చామని అమెరికా, ఇజ్రాయెల్ ఘనంగా చెప్పుకున్నా ఈ పరిణామాల తక్షణ ప్రభావం పెద్దగా లేదని ఇరాన్ సాగిస్తున్న ప్రతిదాడులే నిరూపిస్తున్నాయి. యుద్ధకాలంలో ఎవరి ఆదేశాల కోసమూ ఎదురుచూడకుండా ఏయే దశల్లో ఎలా స్పందించాలో దేశం నలుమూలలా మోహరించి ఉన్న సైనిక దళాలకు ముందే నిర్దేశించి ఉండటం ఇందుకు కారణం. యుద్ధరంగంలో సాధిస్తున్న విజయాల గురించి అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఏం చెప్పుకుంటున్నా ఆయనకు ప్రతికూలతలే ఎదురవుతున్నాయని మంగళవారం నాటి రెండు పరిణామాలు చాటుతున్నాయి. హోర్ముజ్ జలసంధి విముక్తికి యుద్ధ నౌకలతో, విమానాలతో తరలి రావాలన్న ట్రంప్ పిలుపును నాటో దేశాలు తిరస్కరించాయి. 'మీ యుద్ధంతో మాకేమిటి సంబంధమ'ంటూ ఎదురు ప్రశ్నించాయి. దానికితోడు అమెరికా జాతీయ ఉగ్రవాద వ్యతిరేక కేంద్రం (ఎన్‌సీటీసీ) చీఫ్ జో కెంట్ తన పదవికి రాజీనామా చేశారు. అమెరికా భద్రతకు ఏమాత్రం ముప్పులేని ఇరాన్‌పై యుద్ధం ప్రకటించటం అనైతికమని ఆయన ప్రకటించారు. జో కెంట్ మొదటి నుంచీ ట్రంప్‌కు గట్టి మద్దతుదారు. 'మాగా' ఉద్యమ సూత్రధారుల్లో ఒకరు. ట్రంప్ చుట్టూ చేరిన పాలనా వ్యవస్థలోని ఇజ్రాయెల్ అనుకూలురు, ప్రధాన మీడియా ఆయన్ను పక్కదోవ పట్టించాయన్నది కెంట్ అభియోగం. ట్రంప్‌ది అమాయకత్వమా, మూర్ఖత్వమా అన్న సంగతలా ఉంచి అమెరికా అధ్యక్షులుగా ఎవరున్నా ఇజ్రాయెల్ మాటే చెల్లుబాటవుతున్నదని చరిత్ర చూస్తే తెలుస్తుంది. అయితే ప్రస్తుత యుద్ధం ఇజ్రాయెల్ కోసమే అయినా రెండు దేశాలూ సమాన స్థాయిలో ఇరాన్‌పై విరుచుకుపడుతున్నాయి. అమెరికా ఇంతవరకూ 7,000 లక్ష్యాలపై విరుచుకుపడగా, ఇజ్రాయెల్ 7,600 దాడులు చేసిందని సోమవారం అమెరికా సెంట్రల్ కమాండ్ లెక్కలు చెబుతున్నాయి. సైనికంగా ఇరాన్‌ను బలహీనపరచటం శక్తిమంతమైన అమెరికాకు పెద్ద కష్టం కాకపోవచ్చు. ఇరాన్ దగ్గరున్న డ్రోన్‌లూ, క్షిపణులూ కాలం గడుస్తున్నకొద్దీ తగ్గిపోవచ్చు. అదే పరిస్థితి కాస్త వెనకో ముందో ఇజ్రాయెల్, అమెరికాలకు కూడా ఎదురవుతుంది. కానీ దీర్ఘకాలం ఈ యుద్ధాన్ని సాగదీయటం ద్వారా అమెరికా ఆర్థిక వ్యవస్థనూ, ఆ తర్వాత ప్రపంచ ఆర్థిక వ్యవస్థనూ కోలుకోలేని విధంగా దెబ్బతీసే శక్తి ఇరాన్‌కుంది. గత నెల 24న జాతినుద్దేశించి ట్రంప్ ప్రసంగించినప్పుడు అందులో ఎక్కడా ఇరాన్ ప్రస్తావన లేదు. ఆకాశాన్నంటుతున్న గ్యాస్ ధరలు, ద్రవ్యోల్బణం గురించే ఆయన ఏకరువు పెట్టారు. ఇప్పుడు హోర్ముజ్ జలసంధిని ఇరాన్ దిగ్బంధించటంతో అవి పట్టపగ్గాల్లేకుండా విజృంభిస్తున్నాయి. మున్ముందు మరింత ఉగ్రరూపం దాలుస్తాయి. అందుకే ట్రంప్ విజయాలేవీ అమెరికన్లను రంజింప జేయలేక పోతున్నాయి. కనుకనే అందరిపైనా ట్రంప్ ఆగ్రహావేశాలతో రగిలిపోతున్నారు. మాట వినని నాటో మాత్రమే కాదు... నిలదీస్తున్న రిపబ్లికన్లు, యుద్ధాన్ని వ్యతిరేకిస్తున్న 'మాగా' ఉద్యమ కారులు ఆయన్ను కుదురుగా ఉండనీయటం లేదు. ఆయన చేస్తున్న పరస్పర విరుద్ధ ప్రకటనలే అందుకు రుజువు. తొలుత బ్రిటన్ సాయాన్ని అర్థించి, ఆ తర్వాత హోర్ముజ్ విముక్తికి సహకరించమని నాటోతోపాటు చైనాను కూడా వేడుకుని, వారంతా నిరాకరించాక ఇరాన్‌ను ఒంటరిగానే ఎదుర్కొంటామంటూ ఆర్భాటంగా ప్రకటించడం ఆయన మానసిక స్థితిని వెల్లడిస్తోంది. నాటోను కోరడంలో వింతేమీ లేదు. కానీ ఆర్థిక రంగంలో సవాలుగా మారిన చైనాను అర్థించటం ట్రంప్ బలహీనతను బయటపెడుతోంది. 2003 నాటి ఇరాక్ దురాక్రమణ అమెరికాను ఆర్థికంగా దెబ్బతీస్తే, ఆ మేరకు చైనా లాభపడింది. ఇప్పుడు సైతం చైనా అలాంటి అవకాశం కోసమే ఎదురుచూస్తుండగా, అది సాయ పడుతుందని ట్రంప్ ఎలా అనుకున్నారో అనూహ్యం. మొత్తానికి ఆయన ఇరాన్ అనే ఊబిలో దిగబడ్డారు. దాన్నుంచి బయటపడటం సులభమేం కాదు.

## సంక్షోభం ముదరకముందే అప్రమత్తంగా వ్యవహరించాలి

**మొదటిపేజీ తరువాయి** – ఇంధన భద్రతను పటిష్ఠం చేయాలని స్పష్టం చేశారు. ఎల్పీజీ సరఫరా వ్యవస్థను సమీక్షిస్తూ... గ్రామీణ, గిరిజన ప్రాంతాలతో పాటు విద్యా సంస్థలు, ఆలయాలకు సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రాధాన్యత ఇవ్వాలని సీఎం దిశానిర్దేశం చేశారు. అమరావతిలోని తన క్యాంప్ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్లు, ఉన్నతాధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఈ కీలక ఆదేశాలు జారీ చేశారు. ఇదే సమావేశంలో, రాష్ట్రంలో అకాల వర్షాల వల్ల జరిగిన పంట నష్టంపై కూడా ఆయన వరుసగా రెండో రోజూ సమీక్ష నిర్వహించారు. భారీ గాలులు, వడగళ్లతో కూడిన వర్షాల కారణంగా రాష్ట్రవ్యాప్తంగా జరిగిన నష్టం వివరాలను అధికారులు సీఎంకు వివరించారు. రాష్ట్రంలోని 12 జిల్లాల్లోని 42 మండలాల్లో 4,840 హెక్టార్లలో మొక్కజొన్న, 1,534 హెక్టార్లలో వరి, 310 హెక్టార్లలో మినుము పంటలు దెబ్బతిన్నాయని, దీని విలువ సుమారు రూ.40 కోట్లుగా ఉంటుందని తెలిపారు. అలాగే, 9 జిల్లాల్లోని 48 మండలాల్లో 1,301 హెక్టార్లలో అరటి, బొప్పాయి, మిరప, మామిడి, నిమ్మ, నారింజ వంటి ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లినట్టు పేర్కొన్నారు. ఈ నష్టం విలువ రూ.22.68 కోట్లుగా అంచనా వేశారు. మొత్తం మీద రాష్ట్రవ్యాప్తంగా రూ.62 కోట్లకు పైగా పంట నష్టం వాటిల్లినట్టు అధికారులు నివేదించారు.



## ఇది నిరుద్యోగులను వంచించడమే

**మొదటిపేజీ తరువాయి** – ఉగాది పర్వదినం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విడుదల చేసిన జాబ్ క్యాలెండర్‌పై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కేవలం 10,060 పోస్టులతో క్యాలెండర్ విడుదల చేసి, నిరుద్యోగ యువతను నమ్మించి నయవంచన చేశారని ఆమె ఆరోపించారు. రాష్ట్రంలో లక్షల సంఖ్యలో ఖాళీలుంటే, ప్రభుత్వం ప్రకటించిన పోస్టుల సంఖ్య "ఖాళీలు బారెడు.. నోటిఫికేషన్లు చారెడు" అన్నట్లుగా ఉందని ఎద్దేవా చేశారు. ఉగాది రోజున సీఎం చంద్రబాబు 10,060 పోస్టుల భర్తీకి జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేశారు. మే 15 నుంచి అక్టోబరు వరకు ఈ నియామకాలు పూర్తి చేస్తామని, ఇకపై ప్రతి ఏటా ఉగాదికి క్యాలెండర్ ఇస్తామని ప్రకటించారు. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు సృష్టిస్తామన్న హామీని నెరవేరుస్తామని స్పష్టం చేశారు. అయితే, ప్రభుత్వ ప్రకటనపై షర్మిల ఘాటుగా స్పందించారు. "కొండంత రాగం తీసి కూసంత పాట పాడినట్లు" కూటమి ప్రభుత్వ తీరు ఉందని విమర్శించారు. జాబ్ క్యాలెండర్ పేరుతో చంద్రబాబు



చేసింది పచ్చి మోసమని, ముష్టి 10 వేల పోస్టులకు షెడ్యూల్ ఇచ్చి గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. రెండేళ్లుగా నిరుద్యోగులను ఊరించి చివరకు ఉసూరుమనిపించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వివిధ శాఖల్లోని ఖాళీలపై ఆమె ప్రభుత్వాన్ని నిలదీశారు. "విద్యాశాఖలో 30 వేలు, పోలీస్ శాఖలో 19,999, ఇంజనీరింగ్ విభాగంలో 20 వేలు, పంచాయతీ రాజ్‌లో 26 వేలు, మున్సిపల్ శాఖలో 27 వేలు, రెవెన్యూలో 13 వేలు, వైద్యశాఖలో 26 వేల ఖాళీలను వెంటనే నింపుతామని ఇచ్చిన హామీలు ఏమయ్యాయి?" అని షర్మిల ప్రశ్నల వర్షం కురిపించారు. రాష్ట్రంలోని 153 విభాగాల్లో కలిపి 1.80 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, రెండేళ్లకు కలిపి కనీసం 50 వేల ఉద్యోగాలనైనా భర్తీ చేయాల్సి ఉందని ఆమె అన్నారు. 50 లక్షల మంది నిరుద్యోగులున్న రాష్ట్రంలో ఇలాంటి క్యాలెండర్లు కాకుండా భారీ స్థాయిలో ఖాళీలను భర్తీ చేయాలని కాంగ్రెస్ పార్టీ పక్షాన డిమాండ్ చేశారు. అలాగే, ప్రతిపక్షంలో ఉండగా ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగాల దరఖాస్తుకు వయోపరిమితిని 42 నుంచి 46 ఏళ్లకు పెంచాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు. కోచింగ్ సెంటర్లలో లక్షలు ఖర్చు చేసి ఎదురుచూస్తున్న యువతకు న్యాయం చేయాలని షర్మిల డిమాండ్ చేశారు.

## ఏపీకి వర్ష సూచన



**మొదటిపేజీ తరువాయి** – ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రానున్న మూడు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురుస్తాయని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఏపీ తీరం, దాని పరిసర ప్రాంతాల్లో సముద్ర మట్టానికి 3.1 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని, దీని ప్రభావంతో వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయని తెలిపింది. ముఖ్యంగా శుక్రవారం (మార్చి 20) దక్షిణ కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లోని పలుచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. దక్షిణ కోస్తాలో అక్కడక్కడా వడగళ్ల వాన పడే సూచనలు ఉన్నాయని పేర్కొంది. ఈ ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయని, కొన్ని సమయాల్లో గాలి వేగం గంటకు 60 కిలోమీటర్లకు చేరవచ్చని అప్రమత్తం చేసింది. ఇక ఉత్తర కోస్తాంధ్ర, యానాంలోనూ శుక్రవారం చాలాచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు పడతాయని తెలిపింది. ఈ ప్రాంతంలో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని వివరించింది. ఉపరితల ఆవర్తనంతో పాటు గల్ఫ్ ఆఫ్ మన్నార్ నుంచి తమిళనాడు మీదుగా కర్ణాటక వరకు సముద్ర మట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో మరో ద్రోణి విస్తరించి ఉండటం కూడా ఈ వర్షాలకు కారణంగా అధికారులు పేర్కొన్నారు. రాబోయే రెండు, మూడు రోజుల పాటు రాష్ట్రంలో ఇదే తరహా వాతావరణం కొనసాగుతుందని, ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉష్ణోగ్రతల్లో మొదటి మూడు రోజులు పెద్దగా మార్పులు ఉండవని, ఆ తర్వాత స్వల్పంగా పెరిగే అవకాశం ఉందని తెలిపారు.

## ఇప్పుడు జరుగుతున్న యుద్ధాన్ని భారత్ ఆపగలదు

**మొదటిపేజీ తరువాయి** –
ప్రస్తుతం జరుగుతున్న యుద్ధాన్ని ఆపగల సత్తా ఒక్క భారత్‌కే ఉందని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) చీఫ్ మోహన్ భగవత్ అన్నారు. నాగ్‌పూర్‌లో శుక్రవారం జరిగిన విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) విదర్భ ప్రాంత కార్యాలయ భవన నిర్మాణ భూమి పూజ కార్యక్రమంలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రపంచంలో పెరుగుతున్న అస్థిరత, ఘర్షణల నేపథ్యంలో శాంతి కోసం ప్రపంచ దేశాలు భారత్ వైపు చూస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం అంతర్జాతీయ వ్యవహారాల్లో 'బలవంతుడిదే రాజ్యం' అనే నీతి నడుస్తోందని, ఇది భారతీయ విలువలైన మానవతా ధర్మానికి పూర్తి విరుద్ధమని భగవత్ విమర్శించారు. ధర్మ పునాదులతో ప్రపంచంలో సమతుల్యతను పునరుద్ధరించే బాధ్యత భారత్‌పై ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా మధ్యప్రాచ్యంలో శాంతిని నెలకొల్పే సామర్థ్యం భారత్‌కు మాత్రమే ఉందని ఇప్పుడు ప్రపంచం గుర్తిస్తోందని తెలిపారు. గత 2,000 ఏళ్లుగా అనేక సిద్ధాంతాలు ప్రపంచానికి శాశ్వత శాంతిని అందించడంలో విఫలమయ్యాయని, ఎందుకంటే వాటిలో ఐక్యతా భావన లోపించిందని భగవత్ విశ్లేషించారు. స్వార్థ ప్రయోజనాలు, ఆధిపత్య కాంక్షే ఆధునిక ఘర్షణలకు ప్రధాన కారణాలని ఆయన పేర్కొన్నారు. అంతర్జాతీయ పాత్ర పోషించడానికి ముందు దేశం అంతర్గతంగా బలంగా మారాలని భగవత్ పిలుపునిచ్చారు. "సత్యం మన వైపు ఉన్నా, మనం బలహీనంగా ఉంటే ప్రపంచం మనల్ని గౌరవించదు" అని ఆయన స్పష్టం చేశారు. దేశంలోని అంతర్గత విభేదాలను తొలగించుకుని, సమాజం ఐక్యంగా మారాలన్నారు. ప్రపంచంలో సామరస్యాన్ని వ్యాప్తి చేసే తన కర్తవ్యాన్ని నెరవేర్చడానికి భారత్ సిద్ధమైనప్పుడు, దేశ ఆర్థిక, భౌతిక పురోగతి దానంతట అదే సాధ్యమవుతుందని భగవత్ ఉద్ఘాటించారు.

## ఆన్‌లైన్ జూదానికి చెక్... మరో 300 యాప్‌లు

**మొదటిపేజీ తరువాయి** – ఆన్‌లైన్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్ యాప్‌లపై కేంద్ర ప్రభుత్వం తన ఉక్కుపాదాన్ని కొనసాగిస్తోంది. దేశవ్యాప్తంగా అక్రమంగా కార్యకలాపాలు సాగిస్తున్న మరో 300 గ్యాంబ్లింగ్, బెట్టింగ్ వెబ్‌సైట్లు, యాప్‌లను తాజాగా బ్లాక్ చేసింది. దీంతో ఇప్పటివరకు బ్లాక్ చేసిన వాటి సంఖ్య 8,400కు చేరిందని ప్రభుత్వ వర్గాలు శుక్రవారం వెల్లడించాయి. బ్లాక్ చేసిన వాటిలో ఆన్‌లైన్ స్పోర్ట్స్ బెట్టింగ్ ప్లాట్‌ఫామ్‌లు, రౌలెట్, స్లాట్స్ వంటివి అందించే ఆన్‌లైన్ క్యాసినోలు, బెట్టింగ్ ఎక్స్ఛేంజ్‌లు ఉన్నాయి. వీటితో పాటు సట్టా/మట్కా నెట్‌వర్క్‌లు, నిజమైన డబ్బుతో ఆడే కార్డ్ గేమ్ యాప్‌లు కూడా ఈ జాబితాలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. గతేడాది ఆగస్టులో పార్లమెంట్ ఆమోదించిన 'ఆన్‌లైన్ గేమింగ్ ప్రమోషన్ అండ్ రెగ్యులేషన్ యాక్ట్, 2025' కింద ఈ చర్యలు తీసుకుంటున్నారు. 2025 అక్టోబర్ 1 నుంచి అమల్లోకి వచ్చిన ఈ కొత్త చట్టం తర్వాతే సుమారు 4,900 వెబ్‌సైట్లను బ్లాక్ చేయడం గమనార్హం. ఈ చట్టం ప్రకారం... పోకర్, రమ్మీ, ఫాంటసీ స్పోర్ట్స్ వంటి నిజమైన డబ్బుతో కూడిన గేమ్‌లను అందిస్తే మూడేళ్ల వరకు జైలు శిక్ష, భారీ జరిమానాలు విధిస్తారు. ఈ పరిశ్రమను నియంత్రించేందుకు 'ఆన్‌లైన్ గేమింగ్ అథారిటీ ఆఫ్ ఇండియా'ను కూడా ఏర్పాటు చేశారు. ఆన్‌లైన్ మనీ గేమింగ్ ప్లాట్‌ఫామ్‌ల వల్ల ఎన్నో కుటుంబాలు ఆర్థికంగా చితికిపోవడం, యువత వ్యసనాలకు బానిసలు కావడం, కొన్ని సందర్భాల్లో ఆత్మహత్యలకు పాల్పడటం వంటి ఘటనల నేపథ్యంలో ప్రభుత్వం ఈ కఠిన చర్యలు చేపట్టింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) కూడా 'గేమింగ్ డిజార్డర్'ను ఒక ఆరోగ్య సమస్యగా గుర్తించింది. అయితే, ఈ చట్టం అన్ని ఆన్‌లైన్ గేమ్‌లను వ్యతిరేకించడం లేదు. ఈ-స్పోర్ట్స్, సురక్షితమైన సోషల్, ఎడ్యుకేషనల్ గేమ్‌లను ప్రోత్సహిస్తోంది. లాభాల ఆశ చూపి వినియోగదారులను దోపిడీ చేసే బెట్టింగ్, గ్యాంబ్లింగ్ గేమ్‌లకు, నైపుణ్యాన్ని పెంచే గేమ్‌లకు మధ్య స్పష్టమైన తేడాను ఈ చట్టం చూపిస్తోంది.

## ఆరు గ్యారంటీలకు రూ.50,713 కోట్లు

**మొదటిపేజీ తరువాయి** – పూర్తి అంశాలపై అసెంబ్లీలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు. ఏయే పథకానికి ఎంతెంత కేటాయించారంటే.

**రైతు భరోసాకు రూ.18 వేల కోట్లు :** దేశానికి అన్నం పెడుతున్న రైతు సంక్షేమమే ప్రథమ ప్రాధాన్యతగా తమ ప్రభుత్వం భావిస్తుందని భట్టి విక్రమార్క అన్నారు. రైతులకు ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహంతో వ్యవసాయ దిగుబడులలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందని చెప్పారు. రైతులకు పెట్టుబడి సహాయం కోసం ప్రతి సీజన్‌కు ఎకరాకు రూ.6,000 చొప్పున రెండు పంటలకు కలిపి సంవత్సరానికి రూ.12,000 సహాయం అందిస్తున్నామని అన్నారు. ఈ బడ్జెట్లో వ్యవసాయం, రైతు సంక్షేమానికి రూ.23,179 కోట్లు ప్రతిపాదిస్తున్నామన్నారు.

**ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రూ.5,500 కోట్లు :** ప్రతి కుటుంబానికి సొంత ఇల్లు ఉండడం వారి ఆత్మ గౌరవానికి చిహ్నంగా ఉంటుంది. దీనిని గుర్తించిన ప్రభుత్వం "ఇందిరమ్మ ఇళ్లు" అనే బృహత్తర కార్యక్రమాన్ని ప్రారంభించిందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. పేద కుటుంబాలకు వారి సొంత స్థలాల్లో ఇళ్ల నిర్మాణం కోసం లబ్ధిదారులకు ఒక్కొక్క ఇంటికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నామని చెప్పారు. ఈ పథకం కింద ప్రభుత్వం 4.50 లక్షల ఇళ్లను మంజూరు చేసిందని తెలిపారు. బడ్జెట్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం రూ.5,500 కోట్లు కేటాయిస్తామన్నారు.

**మహాలక్ష్మి పథకానికి రూ.4,305 కోట్లు :** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు పరచిన మొదటి వాగ్దానం



ఉచిత బస్సు ప్రయాణమని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా ప్రతిరోజు రాష్ట్రంలోని 34 లక్షల 37 వేల మంది ఆడబిడ్డలు ఉచితంగా ఆర్‌టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్నారని చెప్పారు. ఇప్పటివరకు ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని మహిళలు 269 కోట్ల 68 లక్షల ఉచిత ప్రయాణాలు చేసి, దాదాపు రూ.9,222 కోట్లు ఆదా చేసుకున్నారని వెల్లడించారు. ఈ సంవత్సరం మహాలక్ష్మి పథకానికి రూ.4,305 కోట్లు కేటాయిస్తున్నట్లు వెల్లడించారు.

**గృహజ్యోతి పథకానికి రూ.2,080 కోట్లు :** గృహజ్యోతి పథకం ద్వారా సుమారు 53 లక్షల 9 వేల పేద, మధ్య తరగతి కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్ అందిస్తున్నామని భట్టి పేర్కొన్నారు. ఈ పథకం కింద ఇప్పటి వరకు 10.97 కోట్ల సున్నా బిల్లులు జారీ చేశామన్నారు. కాగా ఈ సంవత్సరానికి గృహజ్యోతి పథకానికి రూ.2,080 కోట్లు కేటాయిస్తున్నట్లు తెలిపారు.

**యువతకు విదేశీ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు :** రాష్ట్ర యువతకు సురక్షితమైన విదేశీ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు వీలుగా ఏర్పాటు చేసిందని ఆయన అన్నారు. తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ టామ్‌కామ్ ద్వారా యూఏఈ, జర్మనీ, జపాన్, యూకే, కెనడా వంటి 16 దేశాలలో సుమారు 13,930 మంది యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించిందన్నారు. ఈ కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు వీలుగా నూతనంగా "సీ.ఎం. ఓవర్సీస్ ఎంప్లాయిమెంట్ ప్రోగ్రాం" ను ప్రారంభిస్తున్నామన్నారు. ఈ బడ్జెట్‌లో కార్మిక సంక్షేమ శాఖకు రూ.998 కోట్ల రూపాయలు ప్రతిపాదిస్తున్నామని తెలిపారు.

**చేయూతలో నూతన పెన్షన్లు :** చేయూత పథకానికి అర్హులైన వారికి 2 లక్షల నూతన పెన్షన్లను మంజూరు చేస్తున్నామన్నారు. నేటి బడ్జెట్‌లో చేయూత పథకానికి రూ.14,861 కోట్లు కేటాయిస్తున్నట్లు వెల్లడించారు.

## మరోసారి అధికారమే లక్ష్యంగా మమతా బెనర్జీ మేనిఫెస్టో

**మొదటిపేజీ తరువాయి** – సొంతింటి కల: ప్రతి పేద కుటుంబానికి శాశ్వత గృహ నిర్మాణం.
తాగునీరు: ప్రతి ఇంటికీ పైపుల ద్వారా శుద్ధి చేసిన తాగునీటి సరఫరా.
వృద్ధాప్య పింఛన్: అర్హులైన వృద్ధులందరికీ నిరంతరాయంగా పెన్షన్ అందేలా చర్యలు.
పరిపాలన సౌలభ్యం: కొత్తగా 7 జిల్లాలు, మరిన్ని మున్సిపాలిటీల ఏర్పాటు.
గ్లోబల్ ట్రేడ్ సెంటర్: బెంగాల్‌ను పెట్టుబడుల హబ్‌గా మార్చేందుకు ప్రపంచ స్థాయి లాజిస్టిక్స్ అభివృద్ధి.

మేనిఫెస్టో విడుదల అనంతరం మమత కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఎన్నికల తర్వాత ఎన్‌ఆర్‌సీ, జనగణన పేరుతో పౌరసత్వాన్ని తొలగించేందుకు కేంద్రం కుట్ర చేస్తోందని ఆమె ఆరోపించారు. నియోజకవర్గాల పునర్విభజన ద్వారా బీజేపీకి లబ్ధి చేకూర్చేందుకు ఎన్నికల కమిషన్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో అనధికార రాష్ట్రపతి పాలన నడుస్తోందని... బెంగాల్ అస్తిత్వాన్ని కాపాడుకోవడానికి అందరూ ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

## ఇక టెన్త్ పరీక్షలు ఉండవు

**మొదటిపేజీ తరువాయి** – ఆగదని, ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు. జగిత్యాలకు చెందిన తమ పార్టీ సీనియర్ నాయకుడు జీవన్ రెడ్డి వ్యవహారాన్ని టీపీసీసీ అధ్యక్షుడు, పార్టీ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ చూసుకుంటారని తెలిపారు. అటు, ఫోన్ ట్యాపింగ్ కేసులో అరెస్టులు కొనసాగుతాయని తెలిపారు. చట్టప్రకారమే ఈ దర్యాప్తు కొనసాగుతోందని అన్నారు. విద్యావిధానంలో మార్పులు చేస్తున్నామని, ఇక పదో తరగతి బోర్డు పరీక్షలు ఉండబోవని అన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో అరెస్టులు ఏవని విపక్షాలు ప్రశ్నిస్తుండటంపై కూడా ముఖ్యమంత్రి స్పందించారు. విచారణ జరపకుండానే అరెస్టులు చేయలేం కదా అన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో కోర్టు క్లీన్ చిట్ ఇచ్చిందని హరీశ్ రావు అసత్య ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హరీశ్ రావుకు సిద్దిపేటకు చెందిన చక్రధర్ కేసులోనే క్లీన్ చిట్ వచ్చిందని తెలిపారు. పదేళ్లు బీఆర్‌ఎస్ చేసిన అప్పులకు వడ్డీలు చెల్లిస్తున్నామని ముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. వాళ్లు చేసిన తప్పులకు చెవిలో పువ్వులు కాదని, వీపుపై బండలు పెట్టాలని అన్నారు. ఫార్ములా ఈ-రేసు కేసులో విచారణకు ఇటీవల కేంద్రం అనుమతి ఇచ్చిందని, ఇప్పటికే అరవింద్ కుమార్‌ను సస్పెండ్ చేశామని అన్నారు.

## బడ్జెట్ అంతా బోగస్

**మొదటిపేజీ తరువాయి** – బడ్జెట్‌పై బీఆర్‌ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు స్పందించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ తీవ్రంగా నిరాశపరిచిందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆరు గ్యారెంటీలకు ఘోరీ కట్టారని విమర్శించారు. అన్ని రంగాలకు మొండిచేయి చూపారని అన్నారు. ఈ బడ్జెట్‌లో సకల జనులకు దక్కింది గుండుసున్నా అని ఎద్దేవా చేశారు. అంకెల గారడీ, మాటల గారడీ తప్ప బడ్జెట్‌లో ఏమీ లేదని అన్నారు. బడ్జెట్ ప్రసంగంలో తెలంగాణ పరిస్థితి బాగా ఉందని చెబుతున్నారని, మరోవైపు మూడేళ్లు కాకుండానే మూడున్నర లక్షల కోట్ల అప్పులు చేశారని విమర్శించారు. ఈ ప్రభుత్వంలో స్కాంలు తప్ప స్కీములు ఏమీ లేవని ఎద్దేవా చేశారు. మేడారం టెండర్లలో అవినీతి జరిగిందని స్వయంగా మంత్రి కుమార్తె ఆరోపణలు చేశారని గుర్తుచేశారు. బడ్జెట్‌ను చూస్తుంటే ఇదో బోగస్ బడ్జెట్ అని అర్థమవుతోందని హరీశ్ రావు విమర్శించారు. గతంలో నిధులు కూడా ఖర్చు చేయని పథకాలకు మళ్లీ నిధులు కేటాయించడమేమిటని ప్రశ్నించారు. పెట్టుబడులు, ఉద్యోగ కల్పనపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేసినా పట్టించుకోలేదని అన్నారు. ఈ ప్రభుత్వానికి టెండర్ల మీద ఉన్న ప్రేమ పేదల మీద లేదని అన్నారు. ఇది కాంగ్రెస్ పరిపాలనా వైఫల్యానికి నిదర్శనమని అన్నారు. వెనుక పిరాయింపు ఎమ్మెల్యేలను కూర్చోబెట్టుకుని భట్టి విక్రమార్క రాజ్యాంగ విలువల గురించి మాట్లాడటం సిగ్గుచేటు అన్నారు. రేవంత్ రెడ్డి తుగ్లక్ పాలన వల్ల రాష్ట్ర అభివృద్ధి పడిపోయిందని అన్నారు. క్యూర్, రేర్, ప్యూర్ పేరుతో హైదరాబాద్‌ను మూడు ముక్కలు చేయడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం మూడు ముక్కలాట ఆడుతోందని మండిపడ్డారు. కూల్చడాల మీద ఉన్న ప్రేమ నిర్మించడంపై లేదని హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు.

# నిర్ణీత గడువులోగా అభివృద్ధి పనులను పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**15 రోజులలో సంగీత పాఠశాల అభివృద్ధి పనులు పూర్తి చెయాలి**

**రామగిరి మండలం , మంథని పట్టణం పరిధిలో విస్తృతంగా పర్యటించిన జిల్లా కలెక్టర్**





**పెద్దపల్లి, మంథని, మార్చి 20 వార్త సంధ్య ) :** నిర్ణీత గడువులోగా చేపట్టిన అభివృద్ధి పనులను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష రామగిరి మండలం , మంథని పట్టణ పరిధిలో విస్తృతంగా పర్యటించారు. రామగిరి మండలంలోని కేజీబీవీ విద్యాలయం, నూతనంగా నిర్మించడానికి సిద్ధంగా ఉన్న తహసిల్దార్ భవన స్థలం కలెక్టర్ పరిశీలించారు. మంథని పట్టణంలోని సంగీత పాఠశాల ,మున్సిపల్ కార్యాలయ, జూనియర్ బాయ్స్ స్కూల్, సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో జరుగుతున్న నిర్మాణ పనులను పరిశీలించారు. మంథని పట్టణం లోని షెడ్యూలు కులాల బాలికల వసతి గృహం, ప్రభుత్వ ఆసుపత్రిని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష రామగిరి కేజీబీవీ లో నూతనంగా ఏర్పాటు చేసిన మాడ్యులర్ కిచెన్ ను ప్రారంభించారు. స్టీమ్ రైస్ బాయిలర్, ఆటోమేటిక్ రోటి మేకర్, ఇడ్లీ బాయిలర్, ఎల్.పీ.జి గ్యాస్ లైన్,18 డైనింగ్ టేబుల్స్ లను సీఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.

కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. రామగిరి తహసిల్దార్ కార్యాలయం నిర్మాణ పనులు త్వరగా ప్రారంభించాలని కలెక్టర్ తెలిపారు. మంథని సంగీత స్కూల్ ప్రిన్సిపాల్ సూచనల మేరకు అభివృద్ధి పనులను 15 రోజులలో పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. మంథని పట్టణంలో నూతనంగా చేపడుతున్న పురపాలక కార్యాలయ నిర్మాణ పనులు నిర్దిష్ట గడువు లోగా పూర్తయ్యే విధంగా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. మంథని లోని జూనియర్ బాయ్స్ స్కూల్ లో పెండింగ్ ఉన్న చిన్న చిన్న నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసి మంత్రి చేతుల మీదుగా ప్రారంభించేందుకు సన్నద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. గురుకుల పాఠశాలలో స్టేజి, డార్మటరీ, డైనింగ్ హాల్ వంటి అభివృద్ధి పనులు పూర్తి చేసామని, పాత స్కూలు భవనం, హస్టల్ కు అవసరమైన మరమ్మతులు చేయించి పెయింటింగ్ వేయాలని కలెక్టర్ సూచించారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్ రిన్నోవేషన్ భాగంగా పెయింటింగ్, అంతర్గత సిసి రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. నూతనంగా నిర్మిస్తున్న 50 పడకల ఆసుపత్రి పనులు స్లాబ్ దశలో ఉన్నాయని వీటిని గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట రామగిరి తహసిల్దార్ సుమన్, మంథని మున్సిపల్ కమిషనర్ మనోహర్,టిజిఎంఎస్ఐడి సి ఈఈ విక్రమ్, ఈఈ పంచాయతీ రాజ్ శంకరయ్య, ఏఈ లు అనుదీప్,వరలక్ష్మి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ హైటెక్స్ లో తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్-2025 ప్రదానోత్సవ కార్యక్రమం.








**హైదరాబాద్ సిటీ ప్రతినిధి ( వార్త సంధ్య) మార్చి 20 :** ముఖ్య అతిథిగా హాజరైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరైన ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క,మంత్రులు, ఎంపీలు, సలహాదారులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, తెలంగాణ ఫిల్మ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు, ప్రముఖ సినీ నటులు చిరంజీవి, కమల్ హాసన్, నాగార్జున, ఇతర సినీ ప్రముఖులు.

## శిల్పారామంలో ఘనంగా ఉగాది పంచాంగ శ్రవణం



**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య), మార్చి 20:** ఉగాది పండుగ సందర్భంగా హైదరాబాద్‌లోని శిల్పారామం ప్రాంగణం ఆధ్యాత్మిక, సాంస్కృతిక వాతావరణంతో కళకళలాడింది. శిల్పారామం స్పెషల్ ఆఫీసర్ జి. కిషన్ రావు ఆధ్వర్యంలో ఉగాది పంచాంగ శ్రవణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్, ప్రముఖ జ్యోతిష్యులు డా. కమలాకర్ శర్మ శ్రీ పరాభవ నామ సంవత్సర పంచాంగాన్ని శ్రోతలకు వివరించారు. నూతన సంవత్సర ఫలితాలు, గ్రహస్థితులు, ప్రజల జీవన విధానంపై ప్రభావాలను సులభంగా అర్థమయ్యేలా వివరించారు. కార్యక్రమంలో జి. కిషన్ రావు మాట్లాడుతూ, గత కొన్ని సంవత్సరాలుగా డా. కమలాకర్ శర్మ చేత పంచాంగ శ్రవణం నిర్వహించడం శిల్పారామం సంప్రదాయంగా కొనసాగుతోందని తెలిపారు. ఉగాది పండుగ భారతీయ సంస్కృతికి ప్రతీక అని, మంచి సంకల్పాలకు శ్రీకారం చుట్టే శుభముహూర్తమని పేర్కొన్నారు. ప్రజలందరికీ శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. డా. కమలాకర్ శర్మ సేవలను కొనియాడుతూ, ఆయనను ఘనంగా సత్కరించారు. పలు సందర్భాల్లో గవర్నర్ కార్యాలయంలో కూడా పంచాంగ విషయాలను వివరించే అవకాశం రావడం ఆయన ప్రతిభకు నిదర్శనమని అన్నారు. ఇలాంటి ప్రముఖ జ్యోతిష్యులకు వేదిక కల్పించడం శిల్పారామం గొప్పతనాన్ని చాటుతుందని అభిప్రాయపడ్డారు. అదేవిధంగా, కళాకారులను సన్మానించడం మన సంస్కృతిలో భాగమని పేర్కొంటూ, కార్యక్రమానికి ముందు కూచిపూడి నృత్య ప్రదర్శన చేసిన కళాకారులను అభినందించారు. ఈ కార్యక్రమం ద్వారా ఉగాది పండుగ యొక్క సాంప్రదాయ ప్రాధాన్యతను ప్రజలకు మరింత చేరువ చేయడంలో శిల్పారామం మరోసారి ప్రత్యేక స్థానాన్ని సంపాదించింది.

## తిరువూరు లో డాక్టర్స్ వాలంటరీ బ్లడ్ సెంటర్ ప్రారంభం.



**తిరువూరు, మార్చి 20(వార్త సంధ్య):-ఎన్టీఆర్ జిల్లా, తిరువూరు నియోజకవర్గం :** తిరువూరులోని జన్మభూమి రోడ్ లో గల జయకృష్ణ హాస్పిటల్ పక్కన నూతనంగా ఏర్పాటు చేసిన "డాక్టర్స్ వాలంటరీ బ్లడ్ సెంటర్ ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన రాష్ట్ర ఆర్గానిక్ ప్రోడక్ట్ సర్టిఫికేషన్ అథారిటీ చైర్మన్ శావల దేవదత్ మరియు వైసిపి తిరువూరు నియోజకవర్గ ఇన్చార్జ్ నల్లగట్ల స్వామిదాస్. ఈ కార్యక్రమంలో పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మల్లెల శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పల్లెపాటి శ్రీనివాసరావు ,శ్రీ వెంకటాచల స్వామి వారి దేవస్థానం చైర్మన్ పర్వతం శ్రీనివాసరావు ప్రముఖ న్యాయవాది కంచర్ల ప్రసాద్ ప్రముఖ వైద్యులు డా. పెనుబల్లి నాగేశ్వరరావు, లైన్స్ క్లబ్ అధ్యక్షుడు పసుమర్తి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు .

## భద్రాచల శ్రీ సీతారాముల కళ్యాణంపై సంప్రదాయాల పరిరక్షణకు డిమాండ్



**హైదరాబాద్ సిటీ ప్రతినిధి ( వార్త సంధ్య) మార్చి 20:** భద్రాచలంలో నిర్వహించే శ్రీ సీతారామచంద్రస్వామి వారి కల్యాణ మహోత్సవం సంప్రదాయ పద్ధతిలో జరగడంలేదని సనాత సింధు సత్సంగ్ ట్రస్టు భాగ్యనగర్ చైర్మన్ స్వామి స్థిత ప్రజ్ఞానంద సరస్వతి ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భక్తుల మనోభావాలకు విరుద్ధంగా కొన్ని మార్పులు జరుగుతున్నాయని ఆరోపించారు. కళ్యాణ మహోత్సవంలో శ్రీరాముడిని "రామనారాయణుడు", సీతాదేవిని "సీత మహాలక్ష్మి"గా సంబోధించడం సంప్రదాయానికి విరుద్ధమని పేర్కొన్నారు. అదేవిధంగా, శతాబ్దాలుగా కొనసాగుతున్న గోత్ర, ప్రవరాల పఠనంలో కూడా మార్పులు చేస్తున్నారని, ఇది భక్తులలో ఆందోళన కలిగిస్తున్నదని అన్నారు. సంప్రదాయ ప్రకారం శ్రీరాముడికి వశిష్ఠ గోత్రం, ఆయన ప్రవరలో భాగుడి, అజుడు, దశరథుడు పేర్లు ఉండాలని, కానీ వాటి స్థానంలో నారాయణ గోత్రం, నారాయణ ప్రవరాలను చదువుతున్నారని ఆయన పేర్కొన్నారు. అలాగే సీతాదేవికి గౌతమి గోత్రం, జనక మహారాజు వంశ పరంపర ప్రవరాలు చెప్పాల్సి ఉండగా, వాటి స్థానంలో లక్ష్మీదేవి సంబంధిత ప్రవరాలు చదువుతున్నారని భక్తులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఈ మార్పులు ఆలయ ఆచార వ్యవహారాలకు విరుద్ధమని, వెంటనే సంప్రదాయ పద్ధతులను పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు. రాబోయే శ్రీరామనవమి సందర్భంగా జరిగే కళ్యాణ మహోత్సవం సంపూర్ణంగా ఆగమ శాస్త్ర, సంప్రదాయ విధానాల ప్రకారమే నిర్వహించాలని ప్రభుత్వం, దేవాదాయ శాఖ చర్యలు తీసుకోవాలని కోరారు. దేవాలయ పరిరక్షణ సమితి కమిటీ చైర్మన్ శంకర్ రెడ్డి మాట్లాడుతూ, భద్రాచలంలో సీతారాముల కళ్యాణం సంప్రదాయబద్ధంగా జరగాలని ప్రభుత్వం ముందుగానే స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. "లక్ష్మీనారాయణ రూపంలో కాకుండా సీతారాముల కళ్యాణమే జరగాలి" అని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సుధాకర్, లతా, సంకేతనమ్మ, మూర్తి తదితరులు పాల్గొని తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

## నూతనంగా బాధ్యతలు చెపట్టిన ఆర్.డి.ఓ ను మర్యాద పూర్వకంగా కలిసిన మున్సిపల్ కమిషనర్.



**తిరువూరు, మార్చి 20 (వార్త సంధ్య):-ఎన్టీఆర్ జిల్లా,తిరువూరు నియోజకవర్గం :**

తిరువూరు రెవిన్యూ డివిజన్ అధికారి (ఆర్.డి.ఓ )గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఏ. కుమార్ ను మర్యాద పూర్వకంగా

కలిసి పూలమొక్కను అందజేసిన తిరువూరు నగర పంచాయతీ మున్సిపల్ కమిషనర్ కె .మనోజ.

## శ్రీ సీతారామ సేవా సదన్ ఆధ్వర్యంలో మంథని లో మెగా వైద్య శిబిరం

**వినియోగించుకోవాలని అధ్యక్షులు కెవిఎల్ఎన్ హరిబాబు**




**పెద్దపల్లి, మంథని, మార్చి 20 (వార్త సంధ్య ) :** ఈనెల 22వ తేదీ ఆదివారం శ్రీ సీతారామ సేవా సదన్ ఆధ్వర్యంలో కిమ్స్ హాస్పిటల్స్ వారి సహకారంతో మెగా హెల్ప్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు అధ్యక్షులు కేవీఎల్ఎన్ హరిబాబు తెలిపారు. శుక్రవారం అయన విలేకరులతో మాట్లాడుతూ శ్రీ సీతారామ సేవా సదన్ వ్యవస్థాపక అధ్యక్షులు గట్టు నారాయణ గురూజీ ఆదేశాల మేరకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు ఈ మెగా హెల్ప్ క్యాంపును ప్రారంభించనున్నారు. ఈ మెగా హెల్ప్ క్యాంపులో అని రంగాల్లో ప్రత్యేకత గాంచిన వైద్య నిపుణులు డాక్టర్ బి సాయి ఫణి చంద్ర, డాక్టర్ డిడ్డి హరి ప్రకాష్, డాక్టర్ విశాల్ కుమార్ చితికేశి, డాక్టర్ నవ వికాస్ జూకంటి అండ్ టీం, డాక్టర్ శ్రీ వర్ధన్ జాస్తి, డాక్టర్ శ్వేత పెంద్యాల, డాక్టర్ రోషన్ కుమార్ జైస్వాల్, డాక్టర్ నవ్య యనిగళ్ళ, డాక్టర్ గల్లా రఘు కిషోర్, డాక్టర్ వెలుగులేటి సాయి స్నేహిత లు పాల్గొననున్నారు. ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు స్థానికత వీధిలో గల శ్రీ సీతారామ సేవా సదన్ వద్ద నిర్వహించనున్న ఈ ఉచిత మెగా క్యాంపు ను అందరూ సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. ఈ మెగా క్యాంపులో ఉచితంగా మందులు ఇవ్వనున్నట్లు ఆయనతెలిపారు. ఈ కార్యక్రమంలో సీతారామ సేవా సదన్ నిర్వాహకులు కొల్లారము శ్రీనివాస్, శ్రీరశీభపట్ల అంబరీష్, దుద్దిళ్ళ గణపతి తదితరులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేసిన సర్పంచ్



**పెద్దపల్లి, మంథని, ఎమార్చి 20 వార్త సంధ్య ) :** రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుదిల్ల శ్రీధర్ బాబు సహకారంతో మంథని మండలం లోని ఎక్లాస్ పూర్ గ్రామం లో సీసీ రోడ్డు నిర్మాణానికి సర్పంచ్ బొడ్డు రజిత శ్రీనివాస్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. గ్రామపంచాయతీ పరిధిలోని ఒకటవ వార్డులో సిద్ధం మల్లేష్ ఇంటి నుండి సిద్ధం లక్ష్మీ ఇంటి వరకు ఎన్ఆర్ ఈజీఎస్ నిధులు ఐదు లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రజిత మాట్లాడుతూ రాష్ట్ర శాసనసభ ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో గ్రామంలో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు సర్పంచ్ తెలిపారు. రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులను మంత్రి సహకారంతో చేపడుతామని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పర్వతాలు యాదవ్, వార్డు సభ్యులు బండి లావణ్య శంకర్, గువ్వల రాజు, రాదండి దేవమ్మ రాజనర్సి, పంచిక దేవేందర్, గుడిమల్ల తిరుపతి, జంజర్ల శశికళ ప్రభు, బర్ల రజిత సురేందర్ ,గంట ప్రశాంత్,కాంగ్రెస్ సీనియర్ నాయకులు బాద్రపు శ్రీనివాస్, కార్యదర్శి ప్రేమలత తోపాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

## పెంబట్లలో మూగబోయిన మందలు.. మారుతున్న పల్లె బతుకులు!




**సారంగాపూర్ మండలం (వార్త సంధ్య) మార్చి 20 :** ఒకప్పుడు తెల్లవారుజామునే పశువుల అరుపులు, కాపరి పిలుపులు, పాలు పితికే చప్పుళ్లతో కళకళలాడే పెంబట్ల గ్రామం నేడు నిశ్శబ్దంగా కనిపిస్తోంది. గ్రామంలో పశుసంపద (బర్ల మంద) ఉన్నప్పటి వైభవానికి, అవి లేని ప్రస్తుత పరిస్థితికి మధ్య ప్రజల జీవితాల్లో పెను మార్పులు వచ్చాయి.

**అప్పట్లో... పాడిపంటల సిరి:**

గతంలో పెంబట్లలో ఇంటికో పశువుల పాక ఉండేది. బర్ల మంద గ్రామం దాటుతుంటే ఆ దృశ్యం చూడముచ్చటగా ఉండేది. దీనివల్ల గ్రామస్తులకు ఆర్థికంగా మంచి వెన్నుదన్ను లభించేది. "పాలు అమ్మగా వచ్చిన డబ్బులతోనే పిల్లల చదువులు, ఇంటి ఖర్చులు గడిచేవి. చేతిలో ఎప్పుడూ నగదు ఉండేది" అని గ్రామ పెద్దలు గుర్తు చేసుకుంటున్నారు. పశువుల పేడతో సేంద్రియ ఎరువులు లభించి, తక్కువ పెట్టుబడితోనే పంటలు పండేవి.

**ఇప్పుడు... వలసల వైపు చూపు:**

కాలక్రమేణా పశువుల మేత కొరత, నీటి ఎద్దడి కూలీల కొరత వల్ల గ్రామస్తులు పశుపోషణకు దూరమవుతున్నారు. మందలు తగ్గిపోవడంతో గ్రామంలో ఆర్థిక పరిస్థితి తలకిందులైంది. రోజువారీ ఆదాయం లేక, కేవలం వ్యవసాయంపైనే ఆధారపడలేక చాలా కుటుంబాలు పట్టణాలకు వలస వెళ్తున్నాయి. ఉదయాన్నే పశువులతో పొలానికి వెళ్లే హడావుడి తగ్గి, గ్రామం వెలవెలబోతోంది.

## ఈ బడ్జెట్లో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంను ప్రకటించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



**హైదరాబాద్ సిటీ ప్రతినిధి ( వార్త సంధ్య) మార్చి 20 :** రాష్ట్రంలోని కోటి 15 లక్షల కుటుంబాలకు ప్రతి కుటుంబానికి 5 లక్షల రూపాయల జీవిత బీమాను జూన్ 2 నుంచి అమలు చేయనున్నట్టు ప్రకటించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

## కొత్తగూడెం కార్పొరేషన్ లో ఘనంగా ఉగాది పండుగ వేడుకలు

**తెలుగు సంస్కృతి సంప్రదాయాలకు ఉగాది ప్రతీక**

**భక్తిభావంతో నిర్వహించే రథోత్సవాలు ఆధ్యాత్మిక చైతన్యాన్ని నింపుతాయి**

**విజయ విఘ్నేశ్వర స్వామి ఆశీస్సులతో నియోజకవర్గం సుభిక్షంగా ఉండాలి**

**ప్రజలందరి జీవితాల్లో కొత్త ఏడాది సరికొత్త వెలుగులు నింపాలి**

**సామూహిక వేడుకలు సమాజంలో సోదరభావాన్ని పెంపొందిస్తాయి**

**కూనంనేని సాంబశివరావు, కొత్తగూడెం ఎమ్మెల్యే**



**కొత్తగూడెం కార్పొరేషన్, మార్చి 20 (వార్త సంధ్య ) :** తెలుగు సంస్కృతి సంప్రదాయాలకు ఉగాది పండుగ ప్రతీక అని, భక్తిభావంతో నిర్వహించే ఇలాంటి రథోత్సవాలు ప్రజల్లో ఆధ్యాత్మిక చైతన్యాన్ని నింపుతాయని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ఉగాది పండుగను పురస్కరించుకుని పట్టణంలోని విజయ విఘ్నేశ్వర స్వామి ఆలయం (గణేష్ టెంపుల్) కమిటీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన రథోత్సవ ర్యాలీలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కొత్తగూడెం నియోజకవర్గ ప్రజలందరూ విజయ విఘ్నేశ్వర స్వామి ఆశీస్సులతో ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. క్రోధినామ సంవత్సరంలో ప్రజలందరి జీవితాల్లో సరికొత్త వెలుగులు నిండాలని, ప్రతి ఇంటా పాడిపంటలు సమృద్ధిగా ఉండాలని కోరారు. సామూహికంగా జరుపుకునే ఇలాంటి వేడుకలు సమాజంలో కులమతాలకు అతీతంగా సోదరభావాన్ని, ఐక్యతను పెంపొందిస్తాయని ఆయన పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధికి, ధార్మిక కార్యక్రమాలకు తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా, కొత్తగూడెం మేయర్ మూడ్ గణేష్, ఈఓ రజినీ కుమారి, కార్పొరేటర్లు బ్యాండు దుర్గా, విజయ్, మాజీ కౌన్సిలర్ యూసఫ్, పలువురు వేద పండితులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇంటి పథకంతో పేదల సొంతింటికల సాకారం

**త్వరితగతిన గృహ నిర్మాణాలు పూర్తి చేయాలి**

**కూనంనేని కృషితో వేగవంతంగా 3500 ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం**

**సాంకేతిక లోపాలు సరిదిద్ది వెంటనే బిల్లులు చెల్లించాలి**

**సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా**

**గృహప్రవేశ ఉత్సవంలో పాల్గొని శుభాకాంక్షలు తెలిపిన సాబీర్ పాషా**



**కొత్తగూడెం కార్పొరేషన్, మార్చి 20 (వార్త సంధ్య) :** పేదల సొంతింటి కల సాకారం కావడమే లక్ష్యంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం జరుగుతోందని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా అన్నారు. కొత్తగూడెం నియోజకవర్గ పరిధిలోని చాతకొండ గ్రామపంచాయతీ డ్రైవర్స్ కాలనీలోని షేక్ సాహేరా నిర్మించుకున్న ఇందిరమ్మ పథకం గృహప్రవేశ కార్యక్రమంలో సర్పంచ్ వజ్జ ఈశ్వరమ్మ, ఉప సర్పంచ్ మంద గాబ్రియేలులతో కలిసి గురువారం అయన పాల్గొని లబ్దిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సాబీర్ పాషా మాట్లాడుతూ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రత్యేక చొరవతో నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం వేగంగా సాగుతోందనిత్వరలో రెండో దఫా ఇండ్లు మంజూరుకానున్నాయని తెలిపారు. గృహ నిర్మాణాల్లో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించి, లబ్ధిదారులకు అందాల్సిన బిల్లుల చెల్లింపు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను కోరారు. పెండింగ్‌లో ఉన్న ఇండ్ల నిర్మాణాలను పూర్తి చేసేలా పేదలను ప్రోత్సహించాలని, నిరుపేదల ఆత్మగౌరవ ప్రతీక అయిన ఈ పథకం సజావుగా సాగేలా చూడాలని సూచించారు. శాసనసభ సభ్యులు కూనంనేని సూచనలు, సలహాలతో ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా యంత్రాంగం నిరంతరం కృషి చేయాలని ఆయన సూచించారు. గృహప్రవేశ మహోత్సవ కార్యక్రమంలో సర్పంచి వజ్జా ఈశ్వరమ్మ, ఉప సర్పంచ్ మందా గాబ్రియేల్, స్థానిక నాయకులు మల్లు జ్యోతిబసు, మంద నిర్మల, షబానా, సాయి, సోని, సఫీనా, రజియా తదితరులు పాల్గొన్నారు.

## కొత్తగూడెం నుండి తిరుపతికి ప్రత్యేక రైలు ఏర్పాటు చేయండి

**కొత్తగూడెం రైల్వే సమస్యల పై వినతిపత్రం అందచేసిన శ్రీనివాస్ రెడ్డి**



**భద్రాద్రి జిల్లా బ్యూరో, మార్చి 20 (వార్త సంధ్య) :** కొత్తగూడెం నుండి తిరుపతికి ప్రత్యేక రైలు ప్రవేశపెట్టాలని, కరోనా సమయంలో రద్దైన బెల్గావి ఎక్స్‌ప్రెస్ ను తక్షణమే పునరుద్ధరించాలని, అలాగే మణుగూరు కాజీపేట ప్యాసింజర్ రైలును తిరిగి ప్రారంభించాలని కోరిన సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డ్ డి.ఆర్.యు.సి.సి సభ్యుడు వై. శ్రీనివాస్ రెడ్డి. గతంలో ఇచ్చిన హామీ ప్రకారం కొత్తగూడెం తిరుపతి ప్రత్యేక రైలును నడపాలని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కొత్తగూడెం రైల్వే స్టేషన్‌లో భద్రాచలం రోడ్ డివిజనల్ ఏరియా ఆఫీసర్ రాజేంద్ర ప్రసాద్‌ను కలిసి శ్రీనివాస్ రెడ్డి మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు రైల్వే సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. కరోనా సమయంలో రద్దైన బెల్గావి ఎక్స్‌ప్రెస్‌ను పునరుద్ధరించడం, మణుగూరు కాజీపేట ప్యాసింజర్ రైలు ను తిరిగి నడపడం, కొత్తగూడెం తిరుపతి ప్రత్యేక రైలు ప్రవేశపెట్టడం అలాగే, కొత్తగూడెం పట్టణంలో రాజీవ్ పార్క్, ఎన్జీవోస్ కాలనీ, ప్రగతి మైదాన్ ప్రాంతాలకు వెళ్లే పాత నడక మార్గాన్ని తిరిగి ప్రారంభించాలని కోరారు. కొత్తగూడెం రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయని, వాటిని వేగవంతం చేసి ప్రయాణికులకు పూర్తి స్థాయి సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఆకుల సుధాకర్, సుందర్ లాల్ కోరి, బ్యాండ్ వెంకటరమణ, మహంకాళి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# భద్రాచలం దేవస్థానం అభివృద్ధికి మాస్టర్ ప్లాన్

మూడు దశల్లో అభివృద్ధి పనులు

మాస్టర్ ప్లాన్‌పై చర్చించిన మంత్రులు

పొంగులేటి, సురేఖ, తుమ్మల, వాకాటి



**హైదరాబాద్ సిటీ ప్రతినిధి ( వార్త సంధ్య) మార్చి 20 :** తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రం, దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థాన అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వరరావు, వాకాటి శ్రీహరి అన్నారు. భద్రాద్రిని ఒక అంతర్జాతీయ స్థాయి ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉందని వెల్లడించారు. భద్రాచలం ఆలయ రూపురేఖలను మార్చేలా రూపొందించిన మాస్టర్ ప్లాన్ పై శుక్రవారం నాడు సచివాలయంలోని మంత్రి కొండా సురేఖ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ రెండు వందల సంవత్సరాలను దృష్టిలో పెట్టుకొని ఆగమ శాస్త్రం ప్రకారం భక్తుల మనోభావాలకు అనుగుణంగా మూడు దశల్లో ఆలయాన్ని అభివృద్ధి చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. దీనిపై గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారితో చర్చించిన తర్వాత మాస్టర్ ప్లాన్‌కు తుదిరూపునివ్వాలని సమావేశంలో నిర్ణయించారు. వచ్చే ఏడాది గోదావరి పుష్కరాలు ప్రారంభమయ్యేనాటికి భద్రాచలంలో పుష్కర ఘాట్‌తో పాటు మొదటి దశ ఆలయ అభివృద్ధి పనులు పూర్తయ్యేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. భద్రాచలాన్ని తెలంగాణలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక హబ్‌గా మారుస్తామన్నారు. భద్రాచలం సమీపంలోని రామవరంలో ట్రైబల్ మ్యూజియం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. గోదావరి పుష్కరాలలో భాగంగా అత్యంత ప్రాధాన్యత కలిగిన కొరివి వీరభద్రస్వామి దేవాలయం, మల్లూరు లోని నరసింహాస్వామి దేవాలయాలను కూడా అభివృద్ధి చేయాలని సూచించారు. సమావేశంలో పార్లమెంట్ సభ్యులు బలరాం నాయిక్ , శాసనసభ్యులు తెల్లం వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా పంపిణీ ఆదర్శనీయం

రంజాన్ పవిత్ర మాసం క్రమశిక్షణ, త్యాగ నిరతికి ప్రతీక

తోటివారికి సాయం చేయడంలోనే నిజమైన పండుగ పరమార్థం ఉంది

సేవా దృక్పథంతో ముందుకు వస్తున్న స్వచ్ఛంద సంస్థల కృషి అభినందనీయం

మత సామరస్యానికి వేదికగా నిలుస్తున్న కొత్తగూడెం ప్రాంతం

ప్రతి ఒక్కరూ దాతృత్వ గుణాన్ని అలవర్చుకుని సమాజ సేవలో భాగస్వాములు కావాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా



**భద్రాద్రి జిల్లా బ్యూరో, మార్చి 20 (వార్తా సంధ్య) :** నిరుపేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా పంపిణీ చేయడం ఆదర్శనీయమని, పండుగ వేళ పేదల ముఖాల్లో చిరునవ్వులు నింపడం సంతోషకరమని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా అన్నారు. రంజాన్ పండుగను పురస్కరించుకుని శుక్రవారం కొత్తగూడెం పట్టణ పరిధిలోని రామవరం 2 ఇంక్లైన్ గ్రామపంచాయతీ, వన్నందాస్ గడ్డ ఏరియాల్లో నిరుపేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. శ్యామల గోపాలం ఎడ్యుకేషన్ ఫౌండేషన్ సహకారంతో సిపిఐ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై నిరుపేదలకు కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా సాబీర్ పాషా మాట్లాడుతూ..రంజాన్ మాసం క్రమశిక్షణ, దాతృత్వం, మానవతా విలువలను నేర్పుతుందని పేర్కొన్నారు. ఆకలి విలువ తెలిసేలా ఉపవాస దీక్షలు చేస్తూ, సంపాదనలో కొంత భాగాన్ని పేదలకు దానం చేయడం ఈ పండుగ విశిష్టత అని వివరించారు. సమాజంలో వెనుకబడిన వర్గాలను ఆదుకోవడానికి శ్యామల గోపాలం ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ట్రస్టు, తాండ్ర నారాయణ రావు (టిఎన్ఆర్) ట్రస్టు వంటి సంస్థలు ముందుకు రావడం శుభపరిణామమని, ప్రతి ఒక్కరూ ఇటువంటి సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మత సామరస్యాన్ని కాపాడుకుంటూ అందరూ ఐకమత్యంతో మెలిగినప్పుడే బలమైన సమాజ నిర్మాణం జరుగుతుందని ఆయన ఆకాంక్షించారు. నయీమ్ ఖురేషి, షేక్ ఫహీమ్ దాదా, గోపి కృష్ణ, తూముల శ్రీనివాస్, అరుణ, సింగిరాల రమేష్, నగేష్, అంకుష్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ కుటుంబ జీవన భీమా పథకం హర్షణీయం

సోషల్ మీడియా కోఆర్డినేటర్ గుడిచుట్టు నవీన్ యాదవ్



**మహబూబాబాద్ జిల్లా బ్యూరో మార్చి 20 (వార్త సంధ్య) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నేడు బడ్జెట్‌లో ప్రవేశపెట్టిన 'ఇందిరమ్మ కుటుంబ జీవన భీమా' పథకంపై టీపీసీసీ సోషల్ మీడియా గార్ల మండల కోఆర్డినేటర్ గుడిచుట్టు నవీన్ యాదవ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ప్రశంసనీయమని తెలిపారు. అకాల మరణం వంటి క్లిష్ట పరిస్థితుల్లో కుటుంబాలకు అండగా నిలిచే విధంగా, ఇంటి పెద్ద మరణిస్తే ఈ పథకం ద్వారా రూ.5 లక్షల భీమా రక్షణ కల్పించడం ఎంతో గొప్ప నిర్ణయం అని అన్నారు. ఈ పథకం అమలు ద్వారా సమాజంలో ఆర్థిక స్థిరత్వం పెరుగుతుందని, పేద కుటుంబాలకు ఇది ఒక భరోసా కలిగించే కార్యక్రమమని పేర్కొన్నారు. అలాగే, ఈ పథకం ద్వారా సుమారు ఒక కోటి 15 లక్షల కుటుంబాలకు ప్రయోజనం చేకూరే అవకాశం ఉందని, ఇది కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలలో మంచి పేరు తీసుకువస్తుందని తెలిపారు.

## అంతర్జాతీయ ప్రమాణాలతో రాష్ట్రంలో విపత్తుల శిక్షణా కేంద్రం


డిజాస్టర్ మేనేజిమెంట్‌పై సమీక్ష నిర్వహించిన..

రాష్ట్ర రెవెన్యూ,హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) మార్చి మార్ 20 :** అంతర్జాతీయ ప్రమాణాలతో రాష్ట్ర విపత్తుల నిర్వహణ శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటుకు అవసరమైన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని రాష్ట్ర రెవెన్యూ,హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. ఇందుకోసం సంబంధిత విభాగాల నుంచి ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసుకొని కార్యాచరణ రూపొందించాలని సూచించారు. దీనిపై గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారితో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ శాఖలకు విపత్తు నిర్వహణపై ఒకే విధమైన శిక్షణను అందించడం, శాస్త్రీయ పద్ధతుల ద్వారా ప్రాణ నష్టాన్ని, ఆర్థిక నష్టాలను కనిష్ట స్థాయికి తగ్గించడం, క్షేత్రస్థాయిలో, ముఖ్యంగా జిల్లాల్లో విపత్తులను ఎదుర్కొనే సామర్థ్యాన్ని పెంపొందించడం. విపత్తుల నివారణకు సంబంధించి ఇది ఒక అత్యున్నత పరిశోధన మరియు పాలసీ సపోర్ట్ కేంద్రంగా పని చేస్తుందని అన్నారు. శుక్రవారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో విపత్తుల నిర్వహణా విభాగం, ఫైర్ సర్వీసెస్, ఎస్‌డిఆర్ఎఫ్, హైడ్రా, ఐ సిసిసి విభాగా లతో మంత్రి గారు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ విపత్తులు సంభవించినప్పుడు కేవలం సహాయక చర్య లకే పరిమితం కాకుండా, ముందస్తు సన్నద్ధతతో నష్టాన్ని తగ్గించే లక్ష్యంతో 'స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్' ఏర్పాటు చేయాలని నిర్ణయిం చినట్లు వెల్లడించారు. విపత్తుల నిర్వహణలో తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలిపేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎటు వంటి విపత్తులనైనా ఎదుర్కొనేలా అత్యాధునిక పరికరాలను కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. వరదలు, అగ్నిప్రమాదాలు వంటి అత్యవసర పరిస్థితుల్లో త్వరి తగతిన స్పందించడానికి కచ్చితమైన సమాచార వ్యవస్థ, రియల్ టైమ్ మానిటరింగ్, సాధ్యమయ్యేలా విపత్తు ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు, డ్రోన్‌లు, హైస్పీడ్ బోట్లు వంటివాటిని కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర విపత్తుల నిర్వహణ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి దానకిశోర్ , అగ్నిమాపకశాఖ డైరెక్టర్ విక్రమాన్ సింగ్, హైడ్రా కమీషనర్ రంగనాథ్, ఐసిసిసి డైరెక్టర్ కమల్‌హాసన్‌రెడ్డి, స్పెషల్ పోలీస్ బెటాలియన్ అడిషనల్ డిజీ సంజయ్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

## ముస్లిం సోదర, సోదరీమణులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన ఎస్పీ రోహిత్ రాజు



**భద్రాద్రి జిల్లా బ్యూరో మార్చి 20 (వార్త సంధ్య) :** ముస్లిం సోదర సోదరీమణులకు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్ రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ముస్లిం సోదరులు ఈ పవిత్ర పండుగను కుటుంబ సభ్యులతో కలిసి అనందంగా జరుపుకోవాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. రంజాన్ మాసంలో ముస్లీం సోదరులు చేసిన కఠిన ఉపవాస దీక్షలను ఈద్-ఉల్-ఫితర్ పండుగతో ముగిస్తారని అన్నారు. ఈ రంజాన్ పండుగ సందర్భంగా ప్రజలందరూ సోదర భావాన్ని కలిగియుండి సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో సంతోషంగా గడపాలని కోరారు.

## కొత్తగూడెంలో ఘనంగా ఈటల రాజేందర్ జన్మదిన వేడుకలు



**భద్రాద్రి జిల్లా బ్యూరో, మార్చి 20 (వార్త సంధ్య):** కొత్తగూడెంలో మల్కాజ్గిరి ఎంపీ, బీజేపీ జాతీయ కమిటీ సభ్యుడు ఈటల రాజేందర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. భారతీయ జనతా పార్టీ యువ నాయకుడు సొప్పరి క్రాంతి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కొత్తగూడెం బస్టాండ్ వద్ద ఉన్న శ్రీ దత్త సాయి అనాధ మరియు వృద్ధుల ఆశ్రమంలో ప్రత్యేకంగా వేడుకలు నిర్వహించారు. ఆశ్రమంలోని వృద్ధులు మరియు అనాధలకు అన్నప్రసాదం పంపిణీ చేయడంతో పాటు, బస్టాండ్, రైల్వే స్టేషన్ మరియు పోస్ట్ ఆఫీస్ పరిసరాల్లో ఉన్న అవసరమైన వారికి కూడా ఆహారం అందజేశారు. ఈ సందర్భంగా సొప్పరి క్రాంతి మాట్లాడుతూ, ఈటల రాజేందర్ తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని, రాష్ట్ర అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలు మరువలేనివని అన్నారు. కేంద్ర ప్రభుత్వం నుండి వచ్చే నిధులను సమర్థంగా వినియోగిస్తూ తెలంగాణ అభివృద్ధికి తోడ్పడుతున్న నాయకుడని అభినందించారు. ఈ కార్యక్రమంలో రంజిత్ ప్రజాపతి, గొడుగు శ్రీధర్ యాదవ్, మల్లం అంజయ్య, మాచర్ల మహేష్, కృష్ణారెడ్డి, కిరణ్, వేణు తదితరులు పాల్గొన్నారు.

## విస్సన్నపేట లో మాదిగ విద్యార్థుల విద్యాభివృద్ధి సహాయ సంఘం వార్షికోత్సవం.



**విస్సన్నపేట, మార్చి 20(వార్తా సంధ్య):-** ఎన్.టి.ఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గంలోని విస్సన్నపేట గ్రామంలో నిర్వహించిన మాదిగ విద్యార్థుల విద్యాభివృద్ధి సహాయ సంఘం 11వ వార్షికోత్సవ



కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్, మాజీ మంత్రి కె.ఎస్. జవహర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు విద్యా ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. అనంతరం స్థానికులు జవహర్ ను ఘనంగా సన్మానించారు. ఇ సందర్భంగా ఆయన మీడియా తో మాట్లాడుతు సంఘం నిర్వహిస్తున్న విద్యా సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో కుమార్ కోచింగ్ సెంటర్ కరస్పాండెంట్ అప్పికట్ల కుమార్ తధితరులు పాల్గొన్నారు.

## నిధులు ఉన్నాయి .హద్దులు చూపాలన్ని తహసీల్దారు కు కలిసిన మైతాపూర్ వార్డు సభ్యులు.



**జగిత్యాల జిల్లా బ్యూరో రిపోర్టర్ మార్చి 20(వార్త సంధ్య):** భూమి సరిహద్దుల వివాదంతో రోడ్డు పనులు నిలిచిపోవడంతో రాయికల్ మండల మహితాపూర్ గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు తహసీల్దార్ నాగార్జునను ఆశ్రయించారు. సమస్యను వెంటనే పరిష్కరించి పనులు పూర్తిచేయాలని వినతిపత్రం సమర్పించారు. శ్రీగిరిగుట్ట (గన్నేగుట్ట)పై ఉన్న కనకదుర్గాదేవి ఆలయానికి మెయిన్ రోడ్డునుంచి సిమెంట్ రహదారి నిర్మాణానికి రాజ్యసభ సభ్యులు దామోదరరావు నిధుల నుంచి రూ.15 లక్షలు మంజూరయ్యాయని, పనులు ప్రారంభమైనప్పటికీ ప్రభుత్వ భూమికి పక్కనే ఉన్న పట్టాదారుల అడ్డంకులతో రోడ్డు నిర్మాణం నిలిచిపోయినట్లు వారు పేర్కొన్నారు. రెవెన్యూ, సర్వే అధికారులు సరిహద్దులు నిర్ధారిస్తే పనులు పూర్తవుతాయని, లేదంటే నిధులు వెనక్కి వెళ్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. భక్తుల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్న నేపథ్యంలో వెంటనే సమస్య పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు బత్తిని శ్రీనివాస్, తొగిటి నవీన్, అనుమల్ల రమ, బూస గంగామల్లయ్య, భూపల్లి పరమేష్, స్థానిక నాయకుడు సత్యనారాయణ పాల్గొన్నారు

## ఘనంగా స్వర్గీయ సినియర్ జర్నలిస్టు దాసరి రవీందర్ జయంతి వేడుకలు





**జగిత్యాల జిల్లా బ్యూరో రిపోర్టర్ మార్చి 20 ( వార్త సంధ్య):** జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణానికి చెందిన సీనియర్ జర్నలిస్టు స్వర్గీయ దాసరి రవీందర్ జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో దాసరి రవీందర్ తల్లిదండ్రులు దాసరి గంగాధర్, దాసరి సత్తమ్మ, రవీందర్ సతీమణి దాసరి సరిత, కుమారుడు సహర్ష్, కూతురు శృతి, మాజీ మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు, భోగ రవి ప్రసాద్, మోర డాక్టర్ సుమన్, మోర రామ్మూర్తి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గన్నె రాజిరెడ్డి, కౌన్సిలర్ పల్లికొండ గంగాధర్,మాజీ కౌన్సిలర్లు తురగ శ్రీధర్ రెడ్డి, వల్లకొండ మహేష్ , ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు చింతకుంట సాయికుమార్, కోశాధికారి జగదీశ్వర్, సీనియర్ పాత్రికేయులు నాగమల్ల శ్రీకర్, గంగాధరి సురేష్,రసూల్,తీగుళ్ల గోపి,గట్టుపెల్లి నరేష్, రాజకీయ నాయకులు, కుటుంబ సభ్యులు ఘనంగా నివాళులర్పించారు.

## గ్రేటర్ నోయిడాలోని రేణుకా ఆర్ట్ గ్యాలరీలో చిత్రకారుడు తుషార్ చిత్రకళా ప్రదర్శన ప్రారంభం



**హయత్‌నగర్ ప్రతినిధి,వార్త సంధ్య, మార్చి 20:** ప్రముఖ చిత్రకారుడు తుషార్ యొక్క ఏకవ్యక్తి చిత్రకళా ప్రదర్శన 14 మార్చి 2026న రేణుకా ఆర్ట్ గ్యాలరీలో ప్రారంభమైంది. చండీగఢ్ కాలేజ్ ఆఫ్ ఆర్ట్ మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రేమ్ సింగ్ ఈ ప్రదర్శనను లాంఛనంగా ప్రారంభించారు. చిత్రకారులు, కళాభిమానులు మరియు ప్రముఖ అతిథుల సమక్షంలో సాంప్రదాయబద్ధంగా దీపం వెలిగించడంతో ఈ కార్యక్రమం ప్రారంభమైంది. 37 సంవత్సరాలకు పైగా అనుభవం ఉన్న చిత్రకారుడు తుషార్, ప్రకృతి, సంప్రదాయాలు మరియు మానవ భావప్రకటనల ఇతివృత్తాలను ప్రతిబింబించే తన విలక్షణమైన శైలికి ప్రసిద్ధి చెందారు. ఆయన చిత్రాలు పటిష్టమైన కూర్పు, ప్రకాశవంతమైన రంగులు మరియు భావోద్వేగ లోతును ప్రదర్శిస్తూ, వీక్షకులకు గొప్ప దృశ్యానుభూతిని అందిస్తాయి. దశాబ్దాల అంకితభావంతో కూడిన సాధన ద్వారా చిత్రకారుడు పెంపొందించుకున్న విశిష్టమైన కళా భాషను మరియు సృజనాత్మక పరిపక్వతను చాటిచెప్పే ఇటీవలి చిత్రాల సమాహారం ఈ ప్రదర్శనలో ఉంది. కళాభిమానులు, సేకర్తలు మరియు ప్రజలు ఈ ప్రదర్శనను సందర్శించి, ప్రదర్శనలో ఉన్న చిత్రాలను వీక్షించవలసిందిగా ఆహ్వానిస్తున్నాము.

## ఈటల రాజేందర్ ని కలిసి శాలువాతో సత్కరించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసిన బి.యన్ రెడ్డి నగర్ తాజా కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి



**హయత్‌నగర్ ప్రతినిధి,వార్తా సంధ్య, మార్చి 20:** మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ పుట్టినరోజు సందర్భంగా బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి తాజా కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి ఈటల రాజేందర్ ని కలిసి శాలువాతో సత్కరించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ పార్టీ రాష్ట్ర చేనేత మోర్చా కన్వీనర్ రఘురాం నేత, ఎల్బీనగర్ అసెంబ్లీ కన్వీనర్ కొత్త రవీందర్ గౌడ్, బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ అధ్యక్షులు విష్ణువర్ధన్ రావు, వనస్థలిపురం డివిజన్ అధ్యక్షులు క్రాంతి గౌడ్, రంగారెడ్డి అర్బన్ జిల్లా కౌన్సిల్ మెంబర్ శ్రీధర్ రావు, ఓబీసీ మోర్చా అధ్యక్షులు మహేష్ గౌడ్,ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి, ఉపాధ్యక్షులు జైపాల్ రెడ్డి, సోషల్ మీడియా కన్వీనర్ కాంతారావు, సీనియర్ నాయకులు శంకరయ్య గౌడ్, రవిశంకర్, సుధీర్, వెంకట్ రెడ్డి, చిన్న యాదవ్, ప్రభాకర్ యాదవ్, శంకరన్న, మధుసూదన్ రెడ్డి, కిషోర్ కుమార్, బీజేవైఎం అధ్యక్షులు సురేష్ కుమార్, భార్గవ్ తేజ, ఎస్సీ మోర్చా కార్యదర్శి దుర్గాప్రసాద్, నాయకులు యాచన్ రెడ్డి, ఠాగూర్ మరియు తదితరులు పాల్గొన్నారు.

## కాకతీయ కమ్మ సేవా సమితి ఆధ్వర్యంలో చౌటుప్పల్ లో ఉగాది ఆత్మీయ సమ్మేళనం



**హయత్‌నగర్ ప్రతినిధి,వార్తా సంధ్య, మార్చి 20:** కాకతీయ కమ్మ సేవా సమితి చౌటుప్ప ల్ ఆధ్వర్యంలో ఉగాది ఆత్మీయ సమ్మేళనం లో పాల్గొన్న కమ్మవారి సేవా సంఘాల సమైక్య తెలంగాణ అధ్యక్షుడు బొడ్డు రవి శంకర్, ఉపాధ్యక్షుడు ఎస్,వి కృష్ణ ప్రసాద్ , కమ్మ రామకృష్ణ , వాసిరెడ్డి శరత్ బాబు, గుడే నరసింహారావు, వడ్లమూడి శ్రీనివాసరావు కాకతీయ కమ్మ సేవా సమితి చౌటుప్పల్ సభ్యులు అధ్యక్షులు రావి చంద్రశేఖర రావు , ఉపాధ్యక్షులు వంకటి రాజా చంద్ర , ప్రధాన కార్యదర్శి కానూరు రాంబాబు, జాయింట్ సెక్రటరీ కొడాలి రాఘవేంద్రరావు , కోశాధికారి రావి ప్రసన్న కుమార్,ఆర్గనైజర్ సెక్రెటరీ దాసరి మురళీకృష్ణ, ఎగ్జిక్యూటివ్ మెంబర్ తన్నీరు రాంబాబు, మాలంపాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొనడం జరిగింది.

## ఈటల రాజేందర్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న హయత్ నగర్ తాజా మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి



**హయత్‌నగర్ ప్రతినిధి,వార్తా సంధ్య, మార్చి 20:** తెలంగాణ ఉద్యమకారులు, మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ జన్మదిన సందర్భంగా వారి నివాసంలో నిర్వహించిన జన్మదిన వేడుకల్లో పాల్గొన్న హయత్ నగర్ తాజా మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి, వారిని శాలువాతో సత్కరించి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమం లో బీజేపీ ఎల్. బి. నగర్ అసెంబ్లీ ఇంచార్జ్ సామ రంగా రెడ్డి, హయత్ నగర్ డివిజన్ అధ్యక్షులు గంగాని శ్రీనివాస్,జిల్లా ఎస్.సి మోర్చా ప్రధాన కార్యదర్శి పారంద మహేష్,నాయకులు జంగా రెడ్డి, ఎర్ర శ్రీకాంత్, అరుణ్, బీజేవైఎం నాయకులు ఎర్ర ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

# చిల్లర రాజకీయాలు మానుకోండి అభివృద్ధి విషయంలో మాతో పోటీపడండి:ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి

**హయత్‌నగర్ ప్రతినిధి,వార్తా సంధ్య, మార్చి 20:** ఎల్.బి.నగర్ నియోజకవర్గంలో నిన్న యూత్ కాంగ్రెస్ నాయకులు 'డ్రగ్ టెస్ట్' పేరిట 'వైట్ ఛాలెంజ్' ప్రకటించి, అంబేద్కర్ విగ్రహం వద్దకు రావాలని మీడియా ద్వారా పిలుపునిచ్చిన నేపథ్యంలో, ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులతో కలిసి అక్కడికి చేరుకున్నారు. అయితే, కాంగ్రెస్ నాయకులు పోలీసులను అడ్డుపెట్టుకుని బీఆర్ఎస్ నాయకులను అంబేద్కర్ విగ్రహం వద్దకు వెళ్లనీయకుండా అడ్డుకోవడం దురదృష్టకరమని ఎమ్మెల్యే విమర్శించారు. ఇది వారి ద్వంద్వ వైఖరికి, చిల్లర రాజకీయాలకు నిదర్శనమని పేర్కొన్నారు. సవాళ్లు విసిరిన తర్వాత వాటికి సమాధానం చెప్పేందుకు వెనక్కి తగ్గడం కాంగ్రెస్ నాయకుల వైఫల్యాన్ని చూపుతోందని అన్నారు. స్వయంగా ఎమ్మెల్యే తమ అనుచరులతో కలిసి శాంతియుతంగా డ్రగ్ టెస్ట్ ఇవ్వడానికి సిద్ధంగా



ఉన్నప్పటికీ, అధికార అహంకారంతో పోలీసు బలగాలను ఉపయోగించి అడ్డుకోవడం తగదని విమర్శించారు. ఎల్.బి.నగర్‌లో ఇంతవరకు లేని విధంగా ఉద్రిక్తతలు సృష్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ప్రాంతానికి సంబంధం లేని వ్యక్తులు ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. సవాళ్లు విసిరిన తర్వాత కార్యకర్తలకు అండగా నిలవకపోవడం బాధాకరమని అన్నారు.తాము ఎప్పుడైనా, ఎక్కడైనా డ్రగ్ టెస్ట్‌కు సిద్ధంగా ఉన్నామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. తమతో ఉన్న కార్యకర్తలపై పూర్తి విశ్వాసం ఉందని, వారికి ఎలాంటి దురలవాట్లు లేవని అన్నారు. డ్రగ్స్ సంస్కృతిని తమ పార్టీ ఎప్పటికీ ప్రోత్సహించదని తెలిపారు. అలాగే తమ నాయకుడు కేటీఆర్ పై చేసిన డ్రగ్స్ ఆరోపణలు కూడా నిరాధారమని, ఆయన కూడా ఎప్పుడైనా పరీక్షలకు సిద్ధంగా ఉన్నారని గుర్తుచేశారు. అయినప్పటికీ కాంగ్రెస్ నాయకులు స్పందించకుండా మౌనం వహిస్తున్నారని విమర్శించారు. యువత డ్రగ్స్ బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు సీనియర్ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కాకినాడ జిల్లాను వీడి పోలవరం జిల్లాలోకి ప్రవేశించిన పెద్దపులి

కాకినాడ జిల్లాలో కొద్ది రోజులుగా కలకలం సృష్టిస్తున్న పెద్దపులి ఇప్పుడు పోలవరం జిల్లాలోకి ప్రవేశించింది. రాజవొమ్మంగి మండలం ఉర్లకులపాడు గ్రామ సమీప అటవీ ప్రాంతంలో పులి సంచరిస్తున్నట్టు అటవీ శాఖ అధికారులు నిన్న ధ్రువీకరించారు. దీంతో సమీప గ్రామాల ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు.కాకినాడ జిల్లా ప్రత్తిపాడు సమీపంలోని బాపన్నదొర కొండల నుంచి బయలుదేరిన పులి, బవురువాక, తడువాయి అడవుల మీదుగా పోలవరం జిల్లా సరిహద్దులోకి ప్రవేశించినట్లు అధికారులు తెలిపారు. పోలవరం డీఎఫ్‌వో శివకుమార్ నేతృత్వంలో ప్రత్యేక "హనుమాన్" బృందాలతో అధికారులు పులి కదలికలను నిశితంగా గమనిస్తున్నారు. నాగులకొండ పర్వత శ్రేణిలో సుమారు 10 కిలోమీటర్ల మేర పులి పాదముద్రలను గుర్తించారు.అయితే, పులి తాను వచ్చిన దారిలోనే వెనక్కి వెళ్తున్నట్లు అధికారులు భావిస్తున్నారు. గత రెండు రోజులుగా పశువులపై ఎలాంటి దాడి జరగకపోవడం గమనార్హం. ముందుజాగ్రత్త చర్యగా ఉర్లకులపాడు, వెంకట్ నగర్, చెరువుకొమ్ముపాలెం, గొల్లవారి వీధి, కొత్తంపాలెం సహా 15కు పైగా గ్రామాలను అటవీ శాఖ అప్రమత్తం చేసింది. పులి జనావాసాల వైపు వస్తే పట్టుకోవడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు అధికారులు వెల్లడించారు.



# అగ్నిమాపక శాఖలో న్యూ టెక్నాలజీ

**త్వరలో అందుబాటులోకి రానున్న మంటలార్పే డ్రోన్లు, రోబోలు**

**అగ్ని ప్రమాదాల నివారణకు అధునాతన డ్రోన్లు, రోబోలు**

**మే నెల నాటికి అందుబాటులోకి - మంటల్ని గుర్తించడం, అదుపు చేయడానికి వినియోగించేందుకు దోహదం**

**మనుషులు వెళ్లలేని సమయంలో రంగంలోకి దిగనున్న రోబోలు**



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అగ్నిమాపక శాఖలో త్వరలోన్ అధునాతన సాంకేతికతతో కూడినటువంటి డ్రోన్లు, రోబోలు అందుబాటులోకి రానున్నాయి. ముఖ్యంగా బహుళ అంతస్తులు, ఎత్తైన భవనాలు, రసాయన పరిశ్రమలు వంటి వాటిలో ప్రమాదాలు జరిగినప్పుడు వీటిని ఉపయోగించనున్నారు. ఇప్పటికే ప్రయోగాత్మకంగా పరీక్షలను నిర్వహించి కొన్ని యూజ్ కేసులను సిద్ధం చేశారు.ఇకపై క్షేత్రస్థాయిలో పూర్తిగా ఉపయోగించాలని నిర్ణయించారు. అదే విధంగా 15వ ఆర్థికసంఘం నిదులతో మొత్తం 6 డ్రోన్లు, ఒక రోబో కొనుగోలును చేయనున్నారు. ఈ ఏడాది మే నెల నాటికి ఇవి పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తాయి. వాటి పనితీరును ఆధారంగా చేసుకుని రెండు దశలో మరిన్ని వాటిని కొనుగోలు చేస్తున్నారు. ముఖ్యంగా మంటల వ్యాప్తిని గుర్తించి అదుపు చేసేందుకు వీటిని వినియోగిస్తారు.మనుషులు వెళ్లలేని పరిస్థితుల్లో రోబోలుఅగ్నిప్రమాద ప్రదేశం మొత్తాన్ని ముందుగా చిత్రీకరిస్తారు. మంటలు ఎక్కడి నుంచి మొదలయ్యాయి, ఎటువైపు వ్యాప్తి చెందుతున్నాయనేది అంచనా వేస్తారు.డ్రోన్‌ను పంపించేటటువంటి దృశ్యాల ఆధారంగా అగ్నిమాపక బృందాలు రియల్‌టైమ్ ప్రణాళికను రూపొందించుకుని సహాయక చర్యలు చేపడతాయి.ప్రమాదవశాత్తు పొగతో నిండిపోయిన ఎత్తైన భవనాల్లో ఒకవేళ మనుషులు చిక్కుకుపోయినా డ్రోన్లకు అమర్చిన థర్మల్ సెన్సర్ల సాయంతో వారిని గుర్తిస్తారు.బహుళ, ఎత్తైన అంతస్తుల భవనాల్లో ప్రమాదాలు జరిగినప్పుడు డ్రోన్ల సహాయంతో ఫైర్ సప్రెషన్ కెమికల్స్ చల్లి వాటిని అదుపు చేస్తారు.ఒకవేళ మనుషులు వెళ్లే అవకాశం లేని నిర్మానుష్య ప్రదేశాలకు రోబోలను రంగంలోకి దించుతారు.మంటల సమీపానికి సిబ్బంది వెళ్లేందుకు అవకాశం లేని, ప్రాణాపాయం అధికంగా ఉన్న సందర్భాల్లో రోబోలను ఉపయోగిస్తారు.ఈ రోబోలకు కెమెరాలు, థర్మల్ సెన్సర్లను అమర్చి పొగ ఎక్కువగా ఉన్న భవనాల్లోకి పంపిస్తే లోపల చిక్కుకున్న వ్యక్తులను గుర్తించి ఈ దృశ్యాలను కంట్రోల్ రూంకు పంపిస్తాయి.మే నుంచి వినియోగంలోకి: అగ్నిమాపక శాఖలో రోబోల వినియోగం అనేది మహారాష్ట్రలో అధికంగా ఉన్నదని అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ పి. వెంకటరమణ అన్నారు. మహారాష్ట్రకు వెళ్లి ఏ సందర్భాల్లో, ఏ విధంగా ఉపయుక్తంగా ఉన్నాయనేది పరిశీలించామని ఆయన ఈ సందర్భంగా వివరించారు. ఏపీలో సైతం రోబోల వినియోగాన్ని విస్తృతం చేస్తామని వెంకటరమణ స్పష్టం చేశారు. అందుకు సంబంధించి ఇప్ప టికే రోబో కొనుగోలుకు ఏపీటీఎస్ ద్వారా టెండర్లను పిలిచామని తెలిపారు.మంటలను అదుపు చేసేందుకు డ్రోన్లు ఏ విధంగా ఉపయోగించవచ్చనే దానిపై పలుమార్లు ప్రయోగాత్మక పరీక్ష లను చేశామని పేర్కొన్నారు. అవి మంచి ఫలాతాలను ఇచ్చినట్లు ప్రకటించారు. అదే విధంగా డ్రోన్ కార్పొరేషన్ ద్వారా త్వరలో వీటిని ఏర్పాటు చేసుకోనున్నట్లు వెంకటరమణ అభిప్రాయపడ్డారు. అంతేకాకుండా దశలవారీగా వాటి సంఖ్యను సైతం పెంచుతామన్నారు. మే నెల నుంచి వినియెగంలోకి వస్తాయని అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ పి. వెంకటరమణ వెల్లిబుచ్చారు.

# ట్రాఫిక్ చలాన్లపై తెలంగాణ సర్కార్ కొరడా

**ఇకపై కఠిన చర్యలు**

తెలంగాణలో వాహనదారులకు ఇది ముఖ్యమైన హెచ్చరిక. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించి, పెండింగ్ చలాన్లను చెల్లించకుండా నిర్లక్ష్యం వహిస్తే ఇకపై తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుంది. పదేపదే నిబంధనలు అతిక్రమించినా, జరిమానాలు కట్టకపోయినా వాహన రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ (ఆర్సీ), డ్రైవింగ్ లైసెన్స్ (డీఎల్) స్తంభింపజేసే (ఫ్రీజ్) కఠిన నిబంధనలను అమలు చేసేందుకు రవాణా శాఖ సిద్ధమవుతోంది. పెండింగ్ చలాన్ల వసూలు, వాటిపై వచ్చే వివాదాల పరిష్కారం కోసం ప్రభుత్వం విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది.ఆన్‌లైన్‌లోనే ఫిర్యాదుల పరిష్కారం కేంద్ర మోటార్ వాహన నిబంధనలకు అనుగుణంగా జరిమానాలపై వచ్చే అభ్యంతరాలను పారదర్శకంగా, వేగంగా పరిష్కరించేందుకు 'గ్రీవెన్స్ రెడ్రెసల్ అథారిటీ'ని ఏర్పాటు చేయనున్నారు. దీనికి సంబంధించిన ప్రాథమిక నోటిఫికేషన్ త్వరలో వెలువడనున్నట్లు సమాచారం. ఈ కొత్త విధానంలో వాహనదారులు తమ ఫిర్యాదులను కేవలం ఆన్‌లైన్ పోర్టల్ ద్వారానే నమోదు చేయాలి. సాంకేతిక లోపాలు, డేటా ఎంట్రీ పొరపాట్లు, వాహనం అమ్మిన తర్వాత వచ్చే తప్పుడు చలాన్ల వంటి సమస్యలను పోలీసు, రవాణా శాఖలకు చెందిన ఉన్నతాధికారులు నిర్దేశిత గడువులోగా పరిష్కరిస్తారు. హైదరాబాద్, సైబరాబాద్ వంటి కమిషనరేట్లలో ట్రాఫిక్ డీసీపీలు, ఇతర జిల్లాల్లో ఎస్పీలు, రవాణా శాఖలో ఆర్టీవోలు గ్రీవెన్స్ అధికారులుగా వ్యవహరిస్తారు.స్పష్టమైన కాలపరిమితులు చలాన్ల జారీ నుంచి పరిష్కారం వరకు ప్రభుత్వం స్పష్టమైన కాలపరిమితులను నిర్దేశించింది. కెమెరా ఆధారిత చలాన్‌ను 3 రోజుల్లో, మాన్యువల్ చలాన్‌ను 15 రోజుల్లోగా పంపాలి. చలాన్ అందిన 45 రోజుల్లో వాహనదారుడు జరిమానా కట్టాలి లేదా ఆన్‌లైన్‌లో అభ్యంతరం తెలపాలి. ఫిర్యాదు అందిన 30 రోజుల్లోగా అధికారులు తమ నిర్ణయం వెల్లడించాలి. అధికారుల నిర్ణయంపై అసంతృప్తిగా ఉంటే, చలాన్ మొత్తంలో 50 శాతం చెల్లించి కోర్టును ఆశ్రయించే అవకాశం కల్పించారు.5 చలాన్లు దాటితే బ్లాక్ ఈ విధానంలో అత్యంత కీలకమైన అంశం ఏమిటంటే,



ఒక వాహనంపై ఏడాదిలో 5 కంటే ఎక్కువ చలాన్లు పెండింగ్‌లో ఉంటే, ఆ సమాచారం నేరుగా రవాణా శాఖకు వెళ్తుంది. వెంటనే సంబంధిత వ్యక్తి డ్రైవింగ్ లైసెన్స్ లేదా వాహన ఆర్సీని అధికారులు బ్లాక్ చేస్తారు. ఇలా బ్లాక్ అయిన తర్వాత ఆ వాహనానికి సంబంధించిన ఫిట్‌నెస్, యాజమాన్య బదిలీ వంటి ఏ ఆర్టీఏ సేవలు పొందడం సాధ్యం కాదు. పెండింగ్‌లో ఉన్న చలాన్లన్నీ పూర్తిగా చెల్లించిన తర్వాతే ఈ సేవలను తిరిగి పునరుద్ధరిస్తారు. ఈ కఠిన నిబంధనల ద్వారా వాహనదారుల్లో బాధ్యతను పెంచడంతో పాటు, రాష్ట్రంలో రహదారి భద్రతను మెరుగుపరచాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

# హైదరాబాదులో రేపు ట్రాఫిక్ ఆంక్షలు



పవిత్ర రంజాన్ మాసంలో చివరి శుక్రవారం జరుపుకునే జమ్మాత్-ఉల్-విదా ప్రార్థనల సందర్భంగా

హైదరాబాద్ పోలీసులు నగరంలో భారీ ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. శుక్రవారం (మార్చి 20) చారిత్రాత్మక మక్కా మసీదుతో పాటు సికింద్రాబాద్‌లోని జామా మసీదు పరిసర ప్రాంతాల్లో వాహనాల రాకపోకలను నియంత్రించనున్నట్లు ప్రకటించారు.వివరాల ప్రకారం, చార్మినార్ చుట్టుపక్కల ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అన్ని రకాల వాహనాల రాకపోకలను నిలిపివేయనున్నారు. చార్మినార్ నుంచి మదీనా, ముర్గీ చౌక్, శాలిబండ వైపు వెళ్లే ప్రధాన రహదారులను పూర్తిగా మూసివేస్తున్నట్లు జాయింట్ పోలీస్ కమిషనర్ తెలిపారు.నయాపూల్ నుంచి చార్మినార్ వైపు వచ్చే ట్రాఫిక్‌ను మదీనా జంక్షన్ వద్ద సిటీ కాలేజీ వైపు మళ్లిస్తారు. శాలిబండ, నాగులచింత వైపు నుంచి వచ్చే వాహనాలను హిమ్మత్‌పురా జంక్షన్ వద్ద హరిబౌలి వైపు పంపిస్తారు. చౌక్ మైదాన్ ఖాన్ నుంచి చార్మినార్ వైపు వచ్చే ట్రాఫిక్‌ను కోట్లా అలీజా వైపు మళ్లిస్తారు. ఈ ఆంక్షల నేపథ్యంలో ఆర్టీసీ బస్సులను అఫ్జల్‌గంజ్ బస్టాప్ వద్దే నిలిపివేయనున్నారు. ప్రార్థనల కోసం వచ్చే భక్తుల సౌకర్యార్థం సౌత్ జోన్ పరిధిలో ఆరు చోట్ల ప్రత్యేక పార్కింగ్ సౌకర్యం కల్పించారు.అదేవిధంగా, సికింద్రాబాద్‌లోని జామా మసీదు వద్ద కూడా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయి. సుభాష్ రోడ్డును మూసివేసి, రాణిగంజ్, ప్యారడైజ్ వైపు ట్రాఫిక్‌ను మళ్లిస్తారు. జమ్మాత్-ఉల్-విదా సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం ఐచ్ఛిక సెలవు ప్రకటించింది. ప్రయాణికులు ఈ మార్పులను గమనించి, ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని పోలీసులు సూచించారు.

# రవీంద్రభారతిలో గ్రాండ్‌గా ఉగాదిశ్రీరామనవమి సెలబ్రేషన్స్






**హైదరాబాద్ సిటీ ప్రతినిధి ( వార్త సంధ్య) మార్చి 20 :** తెలుగు నూతన సంవత్సరమైన ఉగాది సందర్భంగా గ్లోబల్ ఈవెంట్స్ ఆర్గనైజింగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉగాదిశ్రీరామనవమి ఫెస్టివల్ వేడుకలు నగరంలోని రవీంద్రభారతిలో వెడ్డింగ్ మార్చ్ స్టైల్‌లో అద్భుతంగా, ఆకట్టుకునేలా జరిగాయి.వేదికను శోభాయమానంగా అలంకరించి, సంగీతంనృత్యాలతో వేడుకలను పెళ్లి సంబరాలను తలపించేలా తీర్చిదిద్దారు. ఈ వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా ప్రముఖ సినీ నటుడు పృథ్వీరాజ్ హాజరై, ఆయనను అవార్డు, ప్రశంసా పత్రం, శాలువా, మెమెంటోతో ఘనంగా సత్కరించారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు లయన్ కె.వి. రమణారావు మాట్లాడుతూ, ఉగాది శ్రీరామనవమి పర్వదినాలను ఒక పండుగలా కాకుండా ఓ సాంప్రదాయ వెడ్డింగ్ వేడుకలా నిర్వహించడం ప్రత్యేకతగా నిలిచిందన్నారు. భారతీయ కళలు, సంస్కృతిని ప్రోత్సహించడం తమ లక్ష్యమని తెలిపారు.ఈ కార్యక్రమంలో డాన్స్ మాస్టర్స్, సంగీత ఉపాధ్యాయులు, యోగ గురువులు వివిధ రంగాల ప్రముఖులకు అవార్డులు అందజేసి సత్కరించారు. చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు, సంగీత ప్రదర్శనలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి.ముఖ్య అతిథిగా మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్, గౌరవ అతిథిగా కోలేటి దామోదర్ గుప్తా హాజరై కార్యక్రమాన్ని శోభాయమానం చేశారు. పలు కళా సంస్థల ప్రతినిధులు, కళాకారులు పాల్గొని ఈ వేడుకలను విజయవంతం చేశారు.చివరగా కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ లయన్ కె.వి. రమణారావు కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఏపీలో పదో తరగతి ఇంగ్లీష్ పరీక్ష వాయిదా

**కొత్త తేదీ ప్రకటించిన ప్రభుత్వం**




ఆంధ్రప్రదేశ్‌లో మార్చి 21న జరగాల్సిన పదో తరగతి (ఎస్ఎస్‌సీ) ఇంగ్లీష్ పరీక్ష వాయిదా పడింది. ఈ పరీక్షను ఏప్రిల్ 2, 2026న నిర్వహించనున్నట్లు ప్రభుత్వ పరీక్షల డైరెక్టరేట్ అధికారికంగా ఒక ప్రకటనలో తెలిపింది. రంజాన్ (ఈద్-ఉల్-ఫితర్) పండుగ కారణంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.వివరాల్లోకి వెళితే.. రంజాన్ పండుగ సందర్భంగా మార్చి 21వ తేదీని (శనివారం) ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించింది. వాస్తవానికి ముందుగా మార్చి 20న సెలవుగా భావించినప్పటికీ, చంద్రుని దర్శనంపై ఏపీ వక్ఫ్ బోర్డు ఇచ్చిన నివేదిక ఆధారంగా సెలవు తేదీని మార్చి 21కి మారుస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇదే రోజున పదో తరగతి పరీక్ష షెడ్యూల్ ఉండటంతో విద్యార్థులకు ఇబ్బంది కలగకూడదనే ఉద్దేశంతో విద్యాశాఖ ఈ మార్పు చేసింది.వాయిదా పడిన మూడో లాంగ్వేజ్ ఇంగ్లీష్ పరీక్షను (పేపర్ కోడ్: 13 & 14) ఏప్రిల్ 2వ తేదీన (గురువారం) ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:45 గంటల వరకు నిర్వహించనున్నారు. అయితే, మిగతా పరీక్షల షెడ్యూల్‌లో ఎలాంటి మార్పులు లేవని అధికారులు స్పష్టం చేశారు. ఈ మార్పును విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు గమనించి కొత్త తేదీకి అనుగుణంగా సిద్ధం కావాలని అధికారులు సూచించారు.

# రంజాన్ సెలవు 21వ తేదికి మార్పు

**ఏపీ సీఎస్ సాయి ప్రసాద్**

ఆంధ్రప్రదేశ్‌లో రంజాన్ పండుగ సెలవు తేదీలో ప్రభుత్వం మార్పు చేసింది. ముందుగా ప్రకటించినట్లు శుక్రవారం (మార్చి 20) కాకుండా, శనివారం (మార్చి 21)న రంజాన్ సెలవుగా నిర్ధారించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్ నిన్న జీవో ఆర్టీ నెం: 612 ద్వారా ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో శుక్రవారం రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు యథావిధిగా పనిచేస్తాయని స్పష్టం చేశారు.గురువారం నెలవంక కనిపించని నేపథ్యంలో, పండుగను శనివారం జరుపుకోనున్నట్లు ఏపీ వక్ఫ్ బోర్డు ప్రభుత్వానికి తెలియజేసింది. వక్ఫ్ బోర్డు ముఖ్య కార్యనిర్వహణాధికారి చేసిన విజ్ఞప్తి మేరకే ఈ మార్పు చేసినట్లు సీఎస్ తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ నిర్ణయం ప్రభుత్వ కార్యాలయాలతో పాటు, నెగోషియబుల్ ఇన్స్ట్రుమెంట్ యాక్ట్-1881 కింద నమోదైన షాపులు, ఇతర సంస్థలకు కూడా వర్తిస్తుందని మరో జీవోలో తెలిపారు.

# సేఫ్ జోన్ లో భారత్ కిషన్ రెడ్డి



ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం ఆధ్యాత్మిక, అభివృద్ధితో పాటు శాంతిబాటలో నడుస్తోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. తిరుమల శ్రీవారిని ఆయన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శనం ఏర్పాట్లు చేశారు. దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ ఉగాది సందర్భంగా స్వామివారి ఆశీస్సుల కోసం వచ్చినట్లు తెలిపారు. ప్రపంచం మొత్తం యుద్ధభూమిలో ఉంటే భారతదేశం మాత్రం ప్రధాని మోదీ నాయకత్వంలో సేవ్ జోన్‌లో ఉందని అన్నారు.

# అన్నమయ్య జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

**ముగ్గురు యువకుల మృతి**




అన్నమయ్య జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ దుర్ఘటనలో ముగ్గురు యువకులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. కురుబలకోట మండల పరిధిలోని సర్కారుతోపు సమీపంలో నిన్న రాత్రి ఈ విషాద ఘటన జరిగింది. అతి వేగం, అజాగ్రత్త మూడు కుటుంబాల్లో తీరని శోకాన్ని నింపాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బి.కొత్తకోటకు చెందిన సురేంద్ర, మదనపల్లికి చెందిన మాధవ, మహేశ్ అనే ముగ్గురు యువకులు స్నేహితులు. గురువారం రాత్రి పని నిమిత్తం మదనపల్లికి వచ్చి, తిరిగి తమ ఇళ్లకు బైక్‌పై బయలుదేరారు. ఈ క్రమంలో మదనపల్లి పట్టణ శివారులోని అమ్మచెరువుమిట్ట దాటిన తర్వాత జాతీయ రహదారిపై వీరి బైక్ అదుపుతప్పింది.వేగంగా వెళ్లి రోడ్డు డివైడర్‌ను బలంగా ఢీకొట్టడంతో ముగ్గురికీ తీవ్ర గాయాలయ్యాయి. దీంతో వారు సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఒకే ప్రమాదంలో ముగ్గురు స్నేహితులు మరణించడంతో వారి కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

# సీలింగ్ ఫ్యాన్ మొరాయిస్తోందా.. జెట్ స్పీడ్ లో తిరగాలంటే ఈ టిప్స్ ట్రై చేయండి



చలికాలంలో ఒక్క నెంబర్ ఫ్యాన్ స్పీడ్ కే చలి తట్టుకోలేం. అదే ఎండాకాలం వచ్చిందంటే ఫుల్ స్పీడ్ లో పెట్టినా గాలి ఆడదు. దీంతో సమ్మర్ సీజన్ మొత్తం చెమటలతోనే గడిచిపోతుంది. అయితే, ఈ సీలింగ్ ఫ్యాన్ ను ఒక్కసారి ముందే చెక్ చేసుకుంటే ఈ బాధలు తప్పుతాయి. మీ ఫ్యాన్ స్పీడ్ ను పెంచేందుకు ఈ టిప్స్ ట్రై చేస్తే సూపర్ ఫాస్ట్ గా తిరుగుతుంది. వేసవి వేడిలో సీలింగ్ ఫ్యాన్ నెమ్మదిగా తిరిగితే చల్లని గాలి అందక ఇబ్బంది పడతాం. అయితే, కొన్ని సులభమైన చిట్కాలతో ఫ్యాన్ వేగాన్ని పెంచి, గదిని చల్లగా మార్చవచ్చు. మీ ఫ్యాన్‌ను సూపర్ స్పీడ్‌తో తిరిగేలా చేసేయొచ్చు. అందుకు ఈ 8 టిప్స్ పనిచేస్తాయి. వీటిని సరిచేస్తే ఎంత పాత ఫ్యాన్ అయినా సూపర్ స్పీడ్ తో తిరగాల్సిందే. అవేంటో చూసేద్దాం..

ఫ్యాన్ శుభ్రం చేయడం

ఫ్యాన్ రెక్కలపై దుమ్ము, ధూళి పేరుకుపోతే గాలి ప్రవాహం తగ్గుతుంది. ఫలితంగా, ఫ్యాన్ నెమ్మదిగా తిరుగుతుంది. ఈ సమస్యను పరిష్కరించడానికి, ఫ్యాన్‌ను ఆపి, రెక్కలను తడి గుడ్డతో తుడవాలి. రెక్కల రెండు వైపులా శుభ్రం చేయడం ముఖ్యం. అలాగే, ఫ్యాన్ మోటార్ దగ్గర ఉండే బేరింగ్‌లను కూడా శుభ్రపరచాలి. దీనివల్ల రాపిడి తగ్గి, ఫ్యాన్ సాఫీగా తిరుగుతుంది. ప్రతి 15 రోజులకు ఒకసారి ఫ్యాన్‌ను శుభ్రం చేస్తే మంచి ఫలితాలు కనిపిస్తాయి.

కెపాసిటర్ పరిశీలన

సీలింగ్ ఫ్యాన్ వేగాన్ని నియంత్రించే ముఖ్యమైన భాగం కెపాసిటర్. ఇది మోటార్‌కు అవసరమైన శక్తిని అందిస్తుంది. కెపాసిటర్ పాడైతే, ఫ్యాన్ నెమ్మదిగా తిరుగుతుంది లేదా పూర్తిగా ఆగిపోతుంది. కెపాసిటర్ సమస్యను గుర్తించడానికి, ఫ్యాన్ హమ్ చేస్తుందా లేదా చేతితో రెక్కలను తిప్పాల్సి వస్తుందా అని చూడాలి. అలాంటి సంకేతాలు కనిపిస్తే, ఎలక్ట్రీషియన్ సహాయంతో కెపాసిటర్‌ను మార్చాలి. కొత్త కెపాసిటర్ కొనేటప్పుడు, పాత కెపాసిటర్‌తో సమానమైన వోల్టేజ్, కెపాసిటెన్స్ ఉన్నది ఎంచుకోవాలి.

బేరింగ్‌లకు లూబ్రికేషన్

ఫ్యాన్ మోటార్‌లోని బేరింగ్‌లు సాఫీగా తిరగడానికి సహాయపడతాయి. కాలక్రమేణా, ఈ బేరింగ్‌లు దుమ్ము, ధూళితో నిండి, రాపిడి పెరుగుతుంది. ఫలితంగా, ఫ్యాన్ వేగం తగ్గుతుంది. ఈ సమస్యను పరిష్కరించడానికి, బేరింగ్‌లను శుభ్రపరిచి, లూబ్రికేటింగ్ ఆయిల్ వేయాలి. లూబ్రికేషన్ వల్ల రాపిడి తగ్గి, ఫ్యాన్ వేగవంతంగా తిరుగుతుంది. అయితే, బేరింగ్‌లు పూర్తిగా దెబ్బతిన్నట్లయితే, వాటిని మార్చడం మంచిది.

వోల్టేజ్ సరిచూసుకోవడం

ఫ్యాన్ వేగం వోల్టేజ్‌పై ఆధారపడి ఉంటుంది. ఇంట్లో వోల్టేజ్ తక్కువగా ఉంటే, ఫ్యాన్ నెమ్మదిగా తిరుగుతుంది. ఈ సమస్యను పరిష్కరించడానికి, ఇంటి వైరింగ్‌ను ఎలక్ట్రీషియన్‌తో చెక్ చేయించాలి. అవసరమైతే, వోల్టేజ్ స్టెబిలైజర్ ఉపయోగించడం మంచిది. సరైన వోల్టేజ్ అందితే, ఫ్యాన్ గరిష్ట వేగంతో తిరుగుతుంది.

రిమోట్ కంట్రోల్ సమస్యలు

రిమోట్ కంట్రోల్ ఉన్న ఫ్యాన్‌లలో, రిమోట్ సిగ్నల్ ఇబ్బందులు లేదా బ్యాటరీ సమస్యల వల్ల వేగం తగ్గవచ్చు. రిమోట్ బ్యాటరీలను మార్చి, ఫ్యాన్‌కు ఎలాంటి అడ్డంకులు లేకుండా ఉపయోగించాలి. అలాగే, రిమోట్ సరిగ్గా పనిచేస్తుందో లేదో చెక్ చేయాలి. సమస్య కొనసాగితే, రిమోట్‌ను రీసెట్ చేయడం లేదా మార్చడం అవసరం.

మోటార్ సమస్యలు

ఫ్యాన్ మోటార్‌లో దుమ్ము, ధూళి చేరడం వల్ల కూడా వేగం తగ్గవచ్చు. మోటార్‌ను శుభ్రపరిచి, లూబ్రికేషన్ చేస్తే సమస్య తొలగవచ్చు. అయితే, మోటార్ పూర్తిగా దెబ్బతిన్నట్లయితే, దానిని మార్చడం లేదా కొత్త ఫ్యాన్ కొనడం మంచిది. మోటార్ పరిమాణం ఫ్యాన్ రెక్కలకు సరిపడినది కాకపోతే కూడా వేగం తగ్గుతుంది. అందుకే, ఫ్యాన్ కొనేటప్పుడు మోటార్ సామర్థ్యాన్ని చెక్ చేయాలి.

ఫ్యాన్ రెక్కల సమతుల్యత

ఫ్యాన్ రెక్కలు సమతుల్యంగా లేకపోతే, ఫ్యాన్ నెమ్మదిగా తిరుగుతుంది. రెక్కలు వంగిపోయాయా లేదా సరిగ్గా బిగించలేదా అని చూడాలి. అవసరమైతే, రెక్కలను సరిచేయడం లేదా మార్చడం మంచిది. సరైన పరిమాణంలో, బరువులో ఉన్న రెక్కలు ఫ్యాన్ వేగాన్ని పెంచుతాయి.


కొత్త ఫ్యాన్ కొనుగోలు

పై దశలన్నీ పాటించినా ఫ్యాన్ వేగం పెరగకపోతే, కొత్త ఫ్యాన్ కొనడం మంచిది. సాధారణంగా, సీలింగ్ ఫ్యాన్ 10-20 సంవత్సరాలు పనిచేస్తుంది. దాని జీవితకాలం ముగిస్తే, కొత్త ఫ్యాన్‌తో మంచి గాలి ప్రవాహాన్ని పొందవచ్చు. కొత్త ఫ్యాన్ కొనేటప్పుడు, గది పరిమాణానికి తగిన రెక్కల పరిమాణం, మోటార్ సామర్థ్యం, శక్తి సామర్థ్యం గలది ఎంచుకోవాలి.

# మే నెలలో టూర్ ప్లాన్ చేస్తున్నారా సమ్మర్లో ఈ బెస్ట్ ప్లేసెస్ మిస్సవ్వకండి











మే నెలలో భారతదేశంలోని ఈ గమ్యస్థానాలు చల్లని వాతావరణం, సుందరమైన ప్రకృతి దృశ్యాలతో పర్యాటకులకు ఆహ్లాదకరమైన అనుభవాన్ని అందిస్తాయి. ఊటీ, కొడైకానల్, మున్నార్‌లలోని కొండల సౌందర్యం, కన్యాకుమారిలో సముద్ర సంగమం, యెలగిరిలో నిర్మానుష్య వాతావరణం ప్రతి పర్యాటకుడికీ విభిన్న అనుభవాలను పంచుతాయి. ఈ సమ్మర్ సెలవులను ఈ ప్రదేశాల్లో గడపడం ద్వారా మీరు ప్రకృతితో మమేకమై, మరపురాని జ్ఞాపకాలను సృష్టించుకోవచ్చు.

### 1.యెలగిరి, తమిళనాడు

తమిళనాడులోని వెల్లూరు జిల్లాలో ఉన్న యెలగిరి, నిర్మానుష్యమైన కొండ స్థలంగా పర్యాటకులను ఆకర్షిస్తుంది. నాలుగు కొండల మధ్య ఉన్న ఈ ప్రాంతం స్వచ్ఛమైన తేనె, సుందరమైన లోయలతో ప్రసిద్ధి చెందింది. పుంగనూర్ సరస్సులో బోటింగ్, స్వామిమలై హిల్ వద్ద ట్రెక్కింగ్, జలగంపరై జలపాతం సందర్శన ఇక్కడి ప్రధాన ఆకర్షణలు. మే నెల చివరిలో జరిగే సమ్మర్ ఫెస్టివల్ సాంస్కృతిక కార్యక్రమాలు, పుష్ప ప్రదర్శనలతో పర్యాటకులను ఆకట్టుకుంటుంది.

1.యెలగిరి, తమిళనాడు తమిళనాడులోని వెల్లూరు జిల్లాలో ఉన్న యెలగిరి, నిర్మానుష్యమైన కొండ స్థలంగా పర్యాటకులను ఆకర్షిస్తుంది. నాలుగు కొండల మధ్య ఉన్న ఈ ప్రాంతం స్వచ్ఛమైన తేనె, సుందరమైన లోయలతో ప్రసిద్ధి చెందింది. పుంగనూర్ సరస్సులో బోటింగ్, స్వామిమలై హిల్ వద్ద ట్రెక్కింగ్, జలగంపరై జలపాతం సందర్శన ఇక్కడి ప్రధాన ఆకర్షణలు. మే నెల చివరిలో జరిగే సమ్మర్ ఫెస్టివల్ సాంస్కృతిక కార్యక్రమాలు, పుష్ప ప్రదర్శనలతో పర్యాటకులను ఆకట్టుకుంటుంది.

**1 / 5**

### 2. కొడైకానల్, తమిళనాడు

తమిళనాడులోని పళని కొండల్లో ఉన్న కొడైకానల్, "కొండల యువరాణి"గా పిలవబడుతుంది. ఈ హిల్ స్టేషన్ దట్టమైన అడవులు, జలపాతాలు, పొగమంచుతో కూడిన లోయలతో ప్రకృతి ప్రేమికులకు స్వర్గధామంగా ఉంటుంది. కొడై సరస్సులో బోటింగ్, కోకర్స్ వాక్‌లో సూర్యోదయ దృశ్యాలు, పిల్లర్ రాక్స్ వద్ద ప్రకృతి సౌందర్యం ఆస్వాదించడం ఇక్కడి ప్రత్యేకతలు. మే నెలలో చల్లని వాతావరణం ఈ ప్రాంతాన్ని కుటుంబ సెలవులకు అనువైన గమ్యస్థానంగా చేస్తుంది.

2. కొడైకానల్, తమిళనాడు తమిళనాడులోని పళని కొండల్లో ఉన్న కొడైకానల్, "కొండల యువరాణి"గా పిలవబడుతుంది. ఈ హిల్ స్టేషన్ దట్టమైన అడవులు, జలపాతాలు, పొగమంచుతో కూడిన లోయలతో ప్రకృతి ప్రేమికులకు స్వర్గధామంగా ఉంటుంది. కొడై సరస్సులో బోటింగ్, కోకర్స్ వాక్‌లో సూర్యోదయ దృశ్యాలు, పిల్లర్ రాక్స్ వద్ద ప్రకృతి సౌందర్యం ఆస్వాదించడం ఇక్కడి ప్రత్యేకతలు. మే నెలలో చల్లని వాతావరణం ఈ ప్రాంతాన్ని కుటుంబ సెలవులకు అనువైన గమ్యస్థానంగా చేస్తుంది.

**2 / 5**

### కన్యాకుమారి, తమిళనాడు

భారతదేశంలోని దక్షిణాంత్య గమ్యస్థానమైన కన్యాకుమారి, మూడు సముద్రాల సంగమ స్థానంగా ప్రసిద్ధి చెందింది. ఈ ప్రాంతంలో సూర్యోదయ, సూర్యాస్తమయ దృశ్యాలు అద్భుతంగా ఉంటాయి. వివేకానంద రాక్ మెమోరియల్, తిరువళ్లువర్ విగ్రహం, కుమారి అమ్మన్ ఆలయం ఇక్కడి ప్రధాన ఆకర్షణలు. మే నెలలో వాతావరణం వేడిగా ఉన్నప్పటికీ, సముద్ర గాలులు ఆహ్లాదకరమైన అనుభవాన్ని అందిస్తాయి. ఈ ప్రదేశం ఆధ్యాత్మిక, సాంస్కృతిక పర్యాటనకు అనువైనది. కన్యాకుమారి, తమిళనాడు భారతదేశంలోని దక్షిణాంత్య గమ్యస్థానమైన కన్యాకుమారి, మూడు సముద్రాల సంగమ స్థానంగా ప్రసిద్ధి చెందింది. ఈ ప్రాంతంలో సూర్యోదయ, సూర్యాస్తమయ దృశ్యాలు అద్భుతంగా ఉంటాయి. వివేకానంద రాక్ మెమోరియల్, తిరువళ్లువర్ విగ్రహం, కుమారి అమ్మన్ ఆలయం ఇక్కడి ప్రధాన ఆకర్షణలు. మే నెలలో వాతావరణం వేడిగా ఉన్నప్పటికీ, సముద్ర గాలులు ఆహ్లాదకరమైన అనుభవాన్ని అందిస్తాయి. ఈ ప్రదేశం ఆధ్యాత్మిక, సాంస్కృతిక పర్యాటనకు అనువైనది.

**3 / 5**

### ఊటీ, తమిళనాడు

తమిళనాడులోని నీలగిరి కొండల్లో ఉన్న ఊటీ, సమ్మర్ సెలవులకు అనువైన గమ్యస్థానం. ఈ కొండ స్థలం చల్లని వాతావరణం, ఆకుపచ్చని తేయాకు తోటలు, సుందరమైన సరస్సులతో పర్యాటకులను ఆకర్షిస్తుంది. ఊటీ సరస్సులో బోటింగ్, బొటానికల్ గార్డెన్ సందర్శన, నీలగిరి మౌంటైన్ రైల్వేలో ప్రయాణం ఇక్కడి ప్రధాన ఆకర్షణలు. డోడ్డబెట్ట శిఖరం నుంచి కనిపించే పరిసర ప్రాంతాల విహంగ వీక్షణం పర్యాటకులకు మరపురాని అనుభవాన్ని అందిస్తుంది. మే నెలలో ఇక్కడ జరిగే ఫ్లవర్ షో సందర్శకులకు అద్భుతమైన అనుభూతిని పంచుతుంది. ఊటీ, తమిళనాడు తమిళనాడులోని నీలగిరి కొండల్లో ఉన్న ఊటీ, సమ్మర్ సెలవులకు అనువైన గమ్యస్థానం. ఈ కొండ స్థలం చల్లని వాతావరణం, ఆకుపచ్చని తేయాకు తోటలు, సుందరమైన సరస్సులతో పర్యాటకులను ఆకర్షిస్తుంది. ఊటీ సరస్సులో బోటింగ్, బొటానికల్ గార్డెన్ సందర్శన, నీలగిరి మౌంటైన్ రైల్వేలో ప్రయాణం ఇక్కడి ప్రధాన ఆకర్షణలు. డోడ్డబెట్ట శిఖరం నుంచి కనిపించే పరిసర ప్రాంతాల విహంగ వీక్షణం పర్యాటకులకు మరపురాని అనుభవాన్ని అందిస్తుంది. మే నెలలో ఇక్కడ జరిగే ఫ్లవర్ షో సందర్శకులకు అద్భుతమైన అనుభూతిని పంచుతుంది.

**4 / 5**

### 3. డార్జిలింగ్, పశ్చిమ బెంగాల్

డార్జిలింగ్ భారతదేశంలో మే నెలలో ప్రయాణించడానికి ఉత్తమమైన ప్రదేశాలలో ఒకటి, దాని మనోహరమైన టీ తోటలు కాంచన్‌జంగా దృశ్యాలతో. ఈ పశ్చిమ బెంగాల్ హిల్ స్టేషన్ పర్వతాలు, సూర్యోదయం స్థానిక టీని ఇష్టపడే వారికి ఆనందంగా ఉంటుంది. మీరు నగరంలో ఉండి, ఈ నిర్మాణాన్ని సందర్శించాలనుకుంటే, ఉత్కంఠభరితమైన సూర్యోదయ దృశ్యాన్ని చూడటానికి టైగర్ హిల్ మీ జాబితాలో ఉండాలి. డార్జిలింగ్, పశ్చిమ బెంగాల్ డార్జిలింగ్ భారతదేశంలో మే నెలలో ప్రయాణించడానికి ఉత్తమమైన ప్రదేశాలలో ఒకటి, దాని మనోహరమైన టీ తోటలు కాంచన్‌జంగా దృశ్యాలతో. ఈ పశ్చిమ బెంగాల్ హిల్ స్టేషన్ పర్వతాలు, సూర్యోదయం స్థానిక టీని ఇష్టపడే వారికి ఆనందంగా ఉంటుంది. మీరు నగరంలో ఉండి, ఈ నిర్మాణాన్ని సందర్శించాలనుకుంటే, ఉత్కంఠభరితమైన సూర్యోదయ దృశ్యాన్ని చూడటానికి టైగర్ హిల్ మీ జాబితాలో ఉండాలి.

# జీవితాన్ని నాశనం చేసే ఒకే ఒక్క అలవాటు

## ఈ విషయాలపై సెల్ఫ్ కంట్రోల్ మీకుందా



సెల్ఫ్ కంట్రోల్ అనేది జీవితంలో అన్ని అంశాల్లో సమతుల్యతను తెస్తుంది. ఆరోగ్యం, మానసిక శాంతి, సామాజిక సంబంధాలు, విజయం కోసం కంట్రోల్ కీలకం. చిన్న మార్పులతో ఈ అలవాటును పెంపొందించుకోవడం దీర్ఘకాల సంతోషాన్ని అందిస్తుంది. ఒక్కసారి జీవితంపై ఈ పట్టు సాధించగలిగితే మీ లైఫ్ లో ఎన్నో మార్పులు చూడగలుగుతారు. ఇదే మీకు విజయాన్ని మరింత చేరువ చేస్తుంది. జీవితంలో ఆరోగ్యం, సంతోషం, విజయం సాధించడానికి అన్ని అంశాల్లో సెల్ఫ్ కంట్రోల్ అవసరమని నిపుణులు చెప్తున్నారు. నియంత్రణ లేని అలవాట్లు మీకుంటే అవి మీకు కొత్త సమస్యలను తెచ్చిపెడతాయని, సక్సెస్ నుంచి మరింత దూరం చేస్తాయని అంటున్నారు. మరి ఆ సెల్ఫ్ కంట్రోల్ పాటించాల్సిన విషయాలేంటో మీరూ తెలుసుకోండి.

### సెల్ఫ్ కంట్రోల్ ఎందుకు అవసరం..

సెల్ఫ్ కంట్రోల్ అంటే స్వీయ నియంత్రణ జీవన శైలిని సమతుల్యంగా ఉంచుతుంది. ఆహారం, వ్యాయామం, పని, వినోదం వంటి విషయాల్లో అతిగా చేయడం శారీరక, మానసిక ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది. ఉదాహరణకు, అతిగా ఆహారం తీసుకోవడం ఊబకాయానికి, అతిగా పని చేయడం ఒత్తిడికి దారితీస్తుంది. ఏ విషయంలోనైనా కంట్రోల్‌తో ఉండటం దీర్ఘకాల శ్రేయస్సును అందిస్తుంది.

### శారీరక ఆరోగ్యంపై ప్రభావం

ఆహారంలో సెల్ఫ్ కంట్రోల్ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. కేలరీలు, చక్కెర, కొవ్వు పదార్థాలను సమతుల్యంగా తీసుకోవడం బరువు నిర్వహణకు సహాయపడుతుంది. మద్యం, ధూమపానం వంటి అలవాట్లను నియంత్రించడం గుండె ఆరోగ్యం, కాలేయ పనితీరును కాపాడుతుంది. కంట్రోల్‌తో వ్యాయామం చేయడం శరీర దృఢత్వాన్ని పెంచుతుంది.

### మానసిక శాంతికి దోహదం

సెల్ఫ్ కంట్రోల్ మానసిక ఒత్తిడిని తగ్గిస్తుంది. అతిగా ఆలోచించడం, పని ఒత్తిడి, సామాజిక మాధ్యమ వినియోగం మనసును అలసిపోయేలా చేస్తాయి. సమయాన్ని సమర్థవంతంగా నిర్వహించడం, విశ్రాంతికి ప్రాధాన్యం ఇవ్వడం మానసిక స్థిరత్వాన్ని అందిస్తుంది. ధ్యానం, యోగా వంటి అభ్యాసాలు మనసును శాంతపరుస్తాయి.

### సామాజిక సంబంధాల్లో కంట్రోల్

మాటలు, ప్రవర్తనలో కంట్రోల్‌తో ఉండటం సంబంధాలను బలపరుస్తుంది. అతిగా విమర్శించడం, ఆగ్రహం చూపడం సంబంధాలను దెబ్బతీస్తుంది. ఓపిక, సానుభూతితో సమతుల్యంగా వ్యవహరించడం గౌరవాన్ని సంపాదిస్తుంది. ఇతరులతో సమయం గడపడంలో కూడా కంట్రోల్ అవసరం.

### ఆచరణలో తీసుకోవలసిన స్టెప్స్

సెల్ఫ్ కంట్రోల్‌ను అలవాటు చేసుకోవడానికి చిన్న దశలు వేయండి. ఆహార భాగాలను నియంత్రించండి. పని, విశ్రాంతి కోసం సమయం కేటాయించండి. రోజువారీ లక్ష్యాలను వాస్తవికంగా నిర్దేశించండి. అతిగా ఖర్చు చేయడం, సమయం వృథా చేయడం తగ్గించండి. కంట్రోల్‌తో జీవన శైలిని సమతుల్యం చేయండి.

# గ్యాస్ అసిడిటీతో ఇబ్బంది పడుతున్నారా ఉపశమనం కోసం ఈ యోగాసనాలు చేయండి



గ్యాస్, అసిడిటీ, మలబద్ధకం వంటి సమస్యలు ఈ రోజుల్లో చాలా సాధారణ ఆరోగ్య సమస్యలుగా మారాయి. దీనికి కారణం అనారోగ్యకరమైన జీవనశైలి, తప్పుడు ఆహారపు అలవాట్లు. అటువంటి పరిస్థితిలో కడుపు సంబంధిత సమస్యల నుంచి నివారణకు కొన్ని యోగా ఆసనాలు కూడా చేయవచ్చు. అవి ఏంటంటే.. నేటి బిజీ జీవనశైలిలో ప్రజలకు వ్యాయామం చేయడానికి చాలా తక్కువ సమయం దొరుకుతుంది. అంతేకాదు బయటి ఆహారం ఎక్కువగా తినడం, చెడు జీవనశైలి కారణంగా చాలా మందికి కడుపులో గ్యాస్, ఆమ్లత్వం లేదా మలబద్ధకం వంటి సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. అటువంటి పరిస్థితిలో ఇటువంటి సమస్యల నుంచి బయటపడేందుకు బాధితులు రకరకాల మందులు తీసుకుంటారు. అనేక రకాల వంటింటి చిట్కాలను ట్రై చేస్తారు. అయితే ఎన్ని చేసినా కూడా ఒకొక్కసారి పెద్దగా ప్రభావం చూపించదు. మీరు కూడా ఈ కడుపు సంబంధిత సమస్యలతో బాధపడుతుంటే క్రమం తప్పకుండా యోగా సాధన చేయవచ్చు. ఇందుకు కొన్ని ఆసనాలు ఉన్నాయి.. వీటిని సాధన చేయడం వల్ల గ్యాస్, ఆమ్లత్వం, మలబద్ధకం వంటి సమస్య నుంచి ఉపశమనం లభిస్తుంది. దీని గురించి యోగా నిపుణుల సలహా తెలుసుకుందాం. వజ్రాసనం, నౌకాసనం, అర్థ మత్స్యేంద్రాసనం, పవనముక్తాసనం, భుజంగాసనం ద్వారా గ్యాస్, అసిడిటీ, మలబద్ధకం వంటి కడుపు సంబంధిత సమస్యల నుంచి ఉపశమనం పొందవచ్చని యోగా నిపుణుడు డాక్టర్ సంపూర్ణ తెలిపారు. మీరు ఈ యోగాసనాలను ప్రతిరోజూ ఉదయం ఖాళీ కడుపుతో క్రమం తప్పకుండా సాధన చేయాలి. కపాలభాతి, భస్త్రికా వంటి ప్రాణాయామం కూడా చాలా ప్రభావవంతంగా ఉంటాయి.

### పూర్వీకుల మేధస్సుకి చిహ్నం ఈ 8 శివాలయాలు.. ఒకే రేఖాంశంపై నిర్మాణం

**నౌకాసనం:** నౌకాసన చేయడానికి ముందుగా యోగా మ్యాట్ మీద మీ వీపుపై పడుకుని, మీ చేతులను మీ తొడల దగ్గర నేలపై ఉంచండి. శరీరాన్ని నిటారుగా .. వదులుగా ఉంచండి. దీని తరువాత శ్వాస తీసుకుంటూ, మీ తల, కాళ్ళు , మొత్తం శరీరాన్ని 30 నుండి 45 డిగ్రీల వరకు పైకి ఎత్తండి. శరీరాన్ని పడవ భంగిమలోకి తీసుకురావడానికి ప్రయత్నించండి. మీ పాదాల చీలమండలను మీ కళ్ళకు అనుగుణంగా తీసుకురండి. ఈ %ఎ%- ఆకారపు ఆకారంలో దాదాపు 20 నుంచి 30 సెకన్లు ఉండండి. నెమ్మదిగా గాలి వదిలి మీ సాధారణ స్థితికి తిరిగి చేరుకోండి.

**అర్ధ మత్స్యేంద్రాసనం:** అర్ధ మత్స్యేంద్రాసనము చేయడానికి ముందుగా యోగా మ్యాట్ మీద కూర్చోండి. దీని తరువాత కుడి కాలును వంచి, ఎడమ కాలు కింద ఉంచండి. దీని తరువాత ఎడమ కాలును వంచి కుడి కాలు వైపు ఉంచండి. కుడి చేతితో ఎడమ కాలు మోకాలిని పట్టుకుని, ఎడమ చేతిని వెనుకకు ఉంచాలి. మీ మెడను మీ ఎడమ భుజం వైపుకు వంచండి. ఈ స్థితిలో కొన్ని సెకన్ల పాటు ఉండి, ఆపై మరొక వైపు పునరావృతం చేయండి.

**వజ్రాసనము**: వజ్రాసనం జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. దీనిని చేయడానికి యోగా మ్యాట్ మీద మోకాళ్లపై కూర్చోండి. దీని తరువాత రెండు పాదాల బొటనవేళ్లను కలిపి, మడమలు పిరుదుల బయటి భాగాన్ని తాకే విధంగా కూర్చోవాలి. మెడ, వీపు, తలను నిటారుగా ఉంచండి. ఇప్పుడు మీ రెండు చేతులను మోకాళ్లపై ఉంచండి. సౌకర్యవంతమైన స్థితిలో కూర్చోండి. దీని తరువాత నెమ్మదిగా గాలి పీల్చుకుని, వదలండి. మొదట్లో ఈ స్థితిలో 15 నుంచి 20 నిమిషాలు కూర్చుని, క్రమంగా సమయాన్ని పెంచుకోండి.

**పవన్ముక్తాసనం:** పవనముక్తసనం జీర్ణక్రియను మెరుగుపరచడంలో కూడా సహాయపడుతుంది. గ్యాస్ సమస్య నుంచి ఉపశమనం కలిగిస్తుంది. ఈ యోగాసనం చేయడానికి యోగా మ్యాట్‌పై నేరుగా పడుకోండి. దీని తరువాత, శ్వాస తీసుకుంటూ కాళ్ళను 90 డిగ్రీల వరకు పెంచండి. ఇప్పుడు గాలి వదులుతూ మీ కాళ్ళను వంచండి. మీ మోకాళ్ళను మీ ఛాతీ వరకు తీసుకురావడానికి ప్రయత్నించండి. దీని తరువాత అరచేతితో మోకాళ్ళను పట్టుకోండి. దీని తరువాత మీ తల పైకెత్తి, మీ నుదిటిని మీ మోకాళ్లకు తాకండి. ఇప్పుడు సాధారణంగా శ్వాస తీసుకోండి. ఈ స్థితిలో కొన్ని సెకన్ల పాటు ఉన్న తర్వాత, మొదట తలను, తరువాత పాదాలను నేలపై ఉంచి తిరిగి మొదటి స్థానానికి వెళ్ళండి.

**భుజంగాసనము:** భుజంగాసనం జీర్ణక్రియకు ప్రయోజనకరంగా ఉండటమే కాదు కడుపు కొవ్వును తగ్గించడంలో కూడా సహాయపడుతుంది. ఈ ఆసనం వేయడానికి యోగా మ్యాట్ బోర్లా పడుకొని రెండు కాళ్ళు దగ్గరగా ఉంచి నేలమీద ఆనించాలి. రెండు చేతులను ఛాతీకి దగ్గరగా నేలమీద ఉంచాలి. కొద్దిగా శ్వాస పీల్చి, తలపైకి ఎత్తి నడుమును వెనుకకు వీలైనంత వరకు వంచాలి.. ఆకాశం వైపు చూస్తున్నట్లుగా మీ మెడను వెనక్కి వంచండి. ఈ స్థితిలో కొన్ని సెకన్ల పాటు ఉండి, ఆపై నెమ్మదిగా మునుపటి స్థానానికి తిరిగి రండి.


# మీకు తెలియకుండానే మీ పేరు మీద లోన్లు ఉండే ఛాన్స్

**వెంటనే చెక్ చేసుకోండి ఇలా!**

**దేశంలో పెరిగిపోతున్న ఐడెంటిటీ చోరీ కేసులు**

**దీంతో ఇబ్బంది పడుతున్న చాలా మంది ప్రజలు**

**మరి మీ ఐడెంటిటీ చోరీ అవ్వకుండా ఎలా నివారించాలో తెలుసా**




ప్రస్తుత డిజిటల్ యుగంలో బ్యాంకు ఖాతాల నిర్వహణ, నగదు చెల్లింపులు లాంటివి బ్యాంకుకు వెళ్లకుండా ఆన్‌లైన్‌లోనే జరిగిపోతున్నాయి. ఈ కార్యకలాపాలన్నీ ఎంత సులభంగా జరుగుతున్నాయో అంతే వేగంగా ఆన్‌లైన్ మోసాలు కూడా పెరుగుతున్నాయి. ఇటీవలి కాలంలో ఎప్పుడూ లోన్ కోసం దరఖాస్తు చేసుకోని వారికి కూడా రుణదాతలు, బ్యాంకుల నుంచి కాల్స్ వస్తున్నాయి. లోన్ చెల్లించమని రుణదాతలు వారిని డిమాండ్ చేస్తున్నారు. ఇందుకు ప్రధాన కారణం ఐడెంటిటీ చోరీ. ఈ తరహా కేసులు ఈ మధ్య కాలంలో ఎక్కువగా వెలుగులోకి వస్తున్నాయి.టెలికాం కంపెనీలు రీసైకిల్ చేసిన సిమ్ కార్డులు (పాత నంబర్‌ను కొత్త కస్టమర్‌కు అమ్మడం) దుర్వినియోగం అయినప్పుడు ఈ సమస్య మరింత తీవ్రంగా మారుతుంది. ఈ క్రమంలో ఐడెంటిటీ చోరీ నుంచి ఎలా బయటపడాలి? మీ పేరు, ఫోన్ నంబర్ లేదా పాన్ కార్డు ఉపయోగించి మరెవరైనా రుణం తీసుకుంటే గుర్తించడం ఎలా? కొత్త సిమ్ తీసుకునేటప్పుడు పాటించాల్సిన జాగ్రత్తలు ఏంటి? తదితర విషయాలు తెలుసుకుందాం.హిమాచల్‌ప్రదేశ్ రాజధాని సిమ్లాకు చెందిన షాలిని అనే యువతి 2024లో కొత్త సిమ్‌ను తీసుకుంది. సిమ్ యాక్టివేట్ అయిన వెంటనే ఆమెకు బ్యాంకు, లోన్ రికవరీ ఏజెంట్ల నుంచి కాల్స్ రావడం ప్రారంభమయ్యాయి. షాలిని తీసుకున్న సిమ్ నంబర్‌ను గతంలో ఇంద్రజిత్ వాడాడు. అతడు అనేక బ్యాంకుల నుంచి రుణాలు తీసుకొని వాయిదాలు చెల్లించకుండానే నంబర్‌ను డీయాక్టివేట్ చేశాడని దర్యాప్తులో తేలింది. దీంతో ఏడాదిపాటు షాలిని ఫోన్ కాల్స్ వల్ల మానసిక హింసకు గురైంది. వాస్తవానికి మాజీ కస్టమర్ తన సిమ్ నంబర్‌ను బ్యాంకుతో అప్‌డేట్ చేయకుండా డీయాక్టివేట్ చేసినప్పుడు అదే నంబరుతో సిమ్ తీసుకున్న వ్యక్తికి ఇబ్బందులు తప్పవని ఈ ఘటన తెలియజేస్తుంది.బ్యాంకు అధికారులు ఏమంటున్నారంటే ఒక వ్యక్తి తన ఫోన్ నంబర్‌ను మార్చినప్పుడు బ్యాంకులో కేవైసీని అప్డేట్ చేయకపోతే, బ్యాంకు పాత నంబర్‌కే రికవరీ కాల్స్, మెసేజ్‌లను పంపుతుంటుందని సిమ్లాలోని యాక్సెస్ బ్యాంకు మేనేజర్ వినీత్ కుమార్ తెలిపారు. అప్పుడు కొత్తగా సిమ్ తీసుకున్న వ్యక్తి బ్యాంకు బ్రాంచ్‌ను సంప్రదించాలని వెల్లడించారు. ఆ నంబర్ ఇప్పుడు తన పేరు మీద ఉందని లిఖితపూర్వకంగా బ్యాంకుకు తెలియజేయాలని సూచించారు. అదనంగా కస్టమర్లు తమ బ్యాంకింగ్ యాప్‌లోని యాక్టివ్ లోన్స్ విభాగాన్ని ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని చెప్పారు.మోసగాళ్లు తరచుగా పాత డేటాను ఉపయోగించి ఫిన్‌టెక్ యాప్‌లు (ఇన్‌స్టంట్ లోన్ యాప్‌లు) ద్వారా నకిలీ రుణాలు పొందుతారని సైబర్ నేరాలను పర్యవేక్షించే డీఎస్పీ విపిన్ కుమార్ తెలిపారు. "మీ ఐడీని ఉపయోగించి మరొకరు డబ్బును విత్‌డ్రా చేసుకోవచ్చు. ఇది మీ క్రెడిట్ స్కోర్‌ను ప్రభావితం చేస్తుంది. మీ నంబర్‌కు గుర్తు తెలియని వ్యక్తి లోన్ సంబంధిత మెసేజులు వస్తే దాన్ని తేలికగా తీసుకోకండి. మీ పేరిట ఉన్న మోసపూరిత రుణాలను గుర్తించడానికి అత్యంత విశ్వసనీయ మార్గం క్రెడిట్ నివేదిక. సిబిల్, ఎక్స్‌పీరియన్, ఈక్విఫాక్స్ వంటి క్రెడిట్ బ్యూరోలు మీ ఆర్థిక రికార్డులను నిర్వహిస్తాయి. మీరు వీటిలో ఏడాదికొకసారి ఉచితంగా మీ క్రెడిట్ నివేదికను చూసుకోవచ్చు. నివేదికను డౌన్‌లోడ్ చేసిన తర్వాత అకౌంట్స్ లేదా ఎంక్వైరీలు విభాగం ఓపెన్ చేయండి. అప్పుడు ఎవరైనా మీ పేరిట నకిలీ లోన్లు తీసుకుంటే తెలిసిపోతుంది" అని విపిన్ కుమార్ స్పష్టం చేశారు."మీ అన్ని ఆర్థిక లావాదేవీలు పాన్ కార్డ్ ఆధారంగా జరుగుతాయి. అందుకే సిబిల్ స్కోరు ద్వారా మీ మొత్తం యాక్టివ్ లోన్‌ల సంఖ్యను ట్రాక్ చేయవచ్చు. కొన్నిసార్లు, చిన్న వినియోగదారు రుణాల (మొబైల్ ఫైనాన్సింగ్ వంటివి) ముసుగులో పెద్ద మోసాలు జరుగుతాయి. ఇటువంటి మోసాలను అరికట్టడానికి ప్రతి నెలా మీ బ్యాంకు స్టేట్‌మెంట్లను జాగ్రత్తగా సమీక్షించాలి. మీ క్రెడిట్ కార్డ్ స్టేట్‌మెంట్‌లో ఏదైనా అనుమానాస్పద లావాదేవీలు ఉంటే వెంటనే ఫ్లాగ్ చేయండి. అలాగే వాడకంలో లేని క్రెడిట్ కారును ఇనాక్టివ్ లేదా లాక్ మోడ్‌లో ఉంచండి."విపిన్ కుమార్, డీఎస్పీమీ క్రెడిట్ నివేదికలో అనుమానాస్పద రుణాన్ని మీరు గమనించినట్లయితే, మీరు నాలుగు దశలను అనుసరించడం ద్వారా ఉపశమనం పొందొచ్చని విపిన్ కుమార్ తెలిపారు. ముందుగా, రుణం ఇచ్చిన బ్యాంకు లేదా ఆర్థిక సంస్థకు ఈ-మెయిల్ చేయాలని సూచించారు. లేదంటే బ్యాంకు బ్రాంచ్‌ను సంప్రదించాలని చెప్పారు. అక్కడ లోన్ పత్రాలను అడగాలని, అప్పుడు బ్యాంకు మీకు సరైన సమాధానం ఇవ్వకపోతే ఆర్బీఐ అధికారిక పోర్టల్ లో ఫిర్యాదు చేయాలని సూచించారు.'మోసపోతే ఇలా చేయాలి'"మీ ఐడెంటిటీ దుర్వినియోగం అయినప్పుడు/ఆర్థికంగా నష్టపోయినప్పుడు వెంటనే జరిగిన మోసం గురించి సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి. మీరు రుణం తీసుకోలేదని క్రెడిట్ బ్యూరోకు తెలియజేయడానికి ఫిర్యాదు కాపీని మీ వద్ద ఉంచుకోవాలి. అదనంగా సిబిల్ వెబ్‌సైట్‌లోకి వెళ్లి వివాదం (డిస్ప్యూట్) విభాగానికి వెళ్లి నిర్దిష్ట రుణ నమోదును సవాల్ చేయండి. దర్యాప్తు తర్వాత సిబిల్ మీ నివేదిక నుంచి రికార్డును తొలగిస్తుంది. దీంతో మీ క్రెడిట్ స్కోర్‌ను మెరుగుపడుతుంది" అని విపిన్ కుమార్ స్పష్టం చేశారు.జాగ్రత్తలు ఏంటంటే ఐడెంటిటీ చోరీ, సైబర్ మోసాలను అరికట్టేందుకు మీరు మీ పాత ఫోన్ నంబర్‌ను అప్డేట్ చేసుకోవాలని డీఎస్పీ విపిన్ కుమార్ తెలిపారు. కొత్త సిమ్‌ను తీసుకుంటే మీ బ్యాంక్, ఆధార్, పాన్, ఆదాయపు పన్ను పోర్టల్‌లతో కొత్త నంబర్ అప్డేట్ చేయాలని సూచించారు. ఇప్పుడు చాలా కంపెనీలు క్రెడిట్ పర్యవేక్షణను అందిస్తున్నాయని వివరించారు. మీ పేరిట కొత్త లోన్ జారీ అయిన వెంటనే ఫోన్‌కు నోటిఫికేషన్ వస్తుందన్నారు. ఆధార్, పాన్ కార్డులను ఎవరికీ ఇవ్వొద్దని సూచించారు.

# స్టాక్ మార్కెట్లపై వార్ ఎఫెక్ట్

**భారీ నష్టాల్లో సూచీలు**

**భారీ నష్టాల్లో దేశీయ మార్కెట్ సూచీలు**


**సెన్సెక్స్ 900 పాయింట్లకుపైగా డౌన్**



పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధ ప్రభావం దేశీయ సూచీలపై ఇంకా కొనసాగుతోంది. చమురు ధరల పెరుగుదలతో కారణంగా గురువారం మార్కెట్లు భారీ నష్టాల్లో ప్రారంభమయ్యాయి. ఎర్లీ ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 990 పాయింట్లకిపైగా, నిఫ్టీ 300 పాయింట్లకి పైగా కోల్పోయాయి. ప్రస్తుతం సెన్సెక్స్ 897 పాయింట్లు కోల్పోయి 75,965 వద్ద ట్రేడ్ అవుతోంది. నిఫ్టీ 266 పాయింట్ల నష్టంతో 23,600 వద్ద కదలాడుతోంది.సెన్సెక్స్, నిఫ్టీ భారీ పతనంఎర్లీ ట్రేడింగ్‌లో బొంబాయి స్టాక్ ఎక్స్ఛేంజి సూచీ సెన్సెక్స్ 992 పాయింట్లు నష్టపోయి 82,75,871 వద్ద ట్రేడ్ అయ్యింది. జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజి సూచీ నిఫ్టీ 310 పాయింట్లు క్షీణించి 23,556 వద్ద ట్రేడ్ అయ్యింది. సెన్సెక్స్ సూచీలో టెక్ మహీంద్రా, ఎన్‌టీపీసీ, రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు లాభాల్లో కొనసాగుతున్నాయి. అదే సమయంలో ఎటర్నల్, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, మహీంద్రా అండ్ మహీంద్రా, ఆదానీ పోర్ట్స్, టైటాన్ కంపెనీ, ఐసీఐసీఐ బ్యాంక్ నష్టాల్లో ట్రేడ్ అవుతున్నాయి.జీవనకాల కనిష్ఠానికి రూపాయి విలువఅంతర్జాతీయ విపణిలో దేశీయ కరెన్సీ రూపాయి విలువ జీవనకాల కనిష్ఠానికి పడిపోయింది. అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 31 పైసలు కోల్పోయి 92.32 వద్ద కొనసాగుతోంది.ఆసియా మార్కెట్లలోనూ నష్టాలుమరోవైపు ఆసియా స్టాక్ మార్కెట్లు కూడా భారీ నష్టాల్లో కొనసాగుతున్నాయి. దక్షిణ కొరియాకు చెందిన కోస్పీ, జపాన్‌కు చెందిన నిక్కీ, షాంఘైకు చెందిన ఎస్‌ఎస్‌ఈ కాంపోజిట్ ఇండెక్స్, హాంకాంగ్‌కు చెందిన హాంగ్ సెంగ్ ఇండెక్స్ సుచీలు నష్టాల్లో ట్రేడ్ అయ్యాయి. ఇక అమెరికా మార్కెట్లు కూడా నష్టాల్లోనే ముగిశాయి. నాస్‌డాక్ మినహా మిగతా అన్ని సూచీలు పడిపోయాయి.ముడి చమురు ధరలు భారీగా పెరుగుదలప్రపంచ మార్కెట్‌లో చమురు ధరలకు ప్రమాణంగా భావించే బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర 8.98 శాతం పెరిగి బ్యారెల్‌కు 100.24 డాలర్లకు చేరింది. అయితే ప్రపంచ ఇంధన సంస్థ(ఐఈఏ) 400 మిలియన్ బ్యారెళ్ల అత్యవసర చమురు నిల్వలు విడుదలకు అంగీకరించినా చమురు ధరలకు అడ్డుకట్ట పడలేదు. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర ఈ ఉదయం బ్యారెల్‌కు 100 డాలర్ల మార్కును దాటింది. అమెరికా బెంచ్ మార్క్ క్రూడ్ ధర కూడా బ్యారెల్‌కు సుమారు 94 డాలర్లకు చేరుకుంది. హర్మూజ్ జలసంధి సమీపంలో వాణిజ్య నౌకలపై ఇరాన్ దాడులు చేయడంతో చమురు ధరలు భారీగా పెరుగుతున్నాయి. పెరుగుతున్న ధరలను అరికట్టడానికి వచ్చే వారం తన వ్యూహాత్మక పెట్రోలియం రిజర్వ్ నుంచి 172 మిలియన్ బ్యారెళ్ల చమురును విడుదల చేయాలని అమెరికా యోచిస్తోంది. చమురు ధరల పెరుగుదలతో ప్రపంచవ్యాప్తంగా స్టాక్ మార్కెట్లు కూడా కుదేలయ్యాయి.విదేశీ పెట్టుబడిదారుల భారీ అమ్మకాలుస్టాక్ ఎక్స్ఛేంజ్ డేటా ప్రకారం విదేశీ పెట్టుబడిదారులు రూ. 6,267.31 కోట్ల విలువైన షేర్లను విక్రయించారు. ఇక దేశీయ సంస్థాగత పెట్టుబడిదారులు రూ. 4,965.53 కోట్ల విలువైన షేర్లను కొనుగోలు చేశారు.బంగారం, వెండి ధరలు ఇలా!ప్రపంచ వ్యాప్తంగా అనిశ్చితి మధ్య మార్కెట్లలో విలువైన లోహాలు పెరిగాయి. 24 క్యారెట్ల స్వచ్ఛమైన 10 గ్రాముల బంగారం ధర రూ.1,61,629 ట్రేడ్ అవుతుంది. కిలో వెండి ధర రూ.2,67,121కు చేరింది.గురువారం పశ్చిమాసియాలో సూచీలు పడిపోవడానికి చమురు ధరలతో పాటు టారిఫ్‌లపై అమెరికా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కూడా ప్రభావం చూపింది. అన్యాయమైన వాణిజ్య పద్ధతులను అనుసరిస్తున్నారని ఆరోపిస్తూ భారత్‌తో సహా 16 దేశాల ఆర్థిక వ్యవస్థలపై దర్యాప్తునకు ఆదేశించింది. కొత్త టారిఫ్‌లు విధించేందుకు ఇది మరో మార్గం కానుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ నిర్ణయం కూడా మదుపర్లపై ఒత్తిడి పెంచింది.

# భారత్ బ్రెజిల్ మధ్య కీలక ఒప్పందాలు
# ఇండియాకు ప్రయోజనమేంటి





**సరికొత్త శిఖరాలకు బ్రెజిల్**

**భారత్ ద్వైపాక్షిక సంబంధాలు**

**క్రిటికల్ మినరల్స్, గ్రీన్ ఫైనాన్స్ వంటి కీలక ఒప్పందాలు**

**చైనా ఆధిపత్యానికి చెక్ పెట్టేలా!**

భారత్- బ్రెజిల్ మధ్య ద్వైపాక్షిక సంబంధాల్లో మరో కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్‌ఎంఈ) అభివృద్ధికి, అలాగే పర్యావరణ అనుకూల ఆర్థిక విధానాలను (గ్రీన్ ఫైనాన్స్) ప్రోత్సహించడానికి, క్రిటికల్ మినరల్స్ అంశంలో సహకారానికి ఇరు దేశాలు శనివారం ఒక వ్యూహాత్మక అవగాహనకు వచ్చాయి. ఈ మేరకు ఒప్పందంపై సంతకాలు చేశాయి. బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డా సిల్వా ప్రస్తుతం భారత పర్యటనలో ఉన్నారు. ఈ పర్యటనలో భాగంగా ప్రధాని మోదీతో శనివారం ఆయన ద్వైపాక్షిక అంశాలపై చర్చలు జరిపారు. రెండు దేశాల మధ్య కీలక ఒప్పందాలు కుదిరాయి. రెండు దేశాల ఆర్థిక వ్యవస్థలకు వెన్నెముకగా భావిస్తున్న ఎంఎస్‌ఎంఈ రంగాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ ఒప్పందం జరిగింది.ఎంఎస్‌ఎంఈల వృద్ధికి పరస్పర సహకారంఇరు దేశాల్లోని ఎంఎస్‌ఎంఈలు సాంకేతికతను, మార్కెట్ వ్యూహాలను, ప్రభుత్వ విధానాలను పరస్పరం అర్థం చేసుకోవడానికి ఈ ఒప్పందం ఉపయోగపడుతుంది. మారుతున్న పర్యావరణ పరిస్థితులకు అనుగుణంగా చిన్న పరిశ్రమలు తమను తాము మలుచుకోవడానికి, తక్కువ కాలుష్యంతో కూడిన ఉత్పత్తి విధానాలను అవలంబించడానికి ఈ ఒప్పందం సహకరిస్తుంది. పర్యావరణానికి మేలు చేసే ప్రాజెక్టుల కోసం ఎంఎస్‌ఎంఈలకు సులభంగా పెట్టుబడులు, రుణాలు అందేలా ఇరు దేశాలు కృషి చేస్తాయి. ఈ సహకారం వల్ల భారతీయ, బ్రెజిల్ ఎంఎస్‌ఎంఈలు అంతర్జాతీయ సరఫరా గొలుసులో భాగస్వాములు కావడానికి, తద్వారా వాటి ఉత్పాదకత, పోటీతత్వాన్ని పెంచుకోవడానికి అవకాశం లభిస్తుంది.

# పశ్చిమ ఆసియా సంక్షోభం

**ఆర్థిక వ్యవస్థపై ప్రభావాన్ని ఇప్పుడే చెప్పలేం**

**కీలక కామెంట్స్ పశ్చిమ ఆసియాలో యుద్ధ వాతావరణం**

**ప్రపంచాన్ని ఆందోళనకు గురిచేస్తున్న ఉద్రిక్తతలు**

**ఆర్థిక వ్యవస్థపై కీలక వ్యాఖ్యలు**




పశ్చిమ ఆసియాలో పెరుగుతున్న యుద్ధ ఉద్రిక్తతలు ప్రపంచాన్ని ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ యద్ధ ప్రభావం ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ఎంత మేరకు పడుతుందన్న దానిపై అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) మంగళవారం కీలక కామెంట్స్ చేసింది. పశ్చిమ ఆసియాలో నెలకొన్న ఉద్రిక్తతలను అత్యంత నిశితంగా గమనిస్తున్నట్లు పేర్కొంది. అయితే, ఈ యుద్ధం వల్ల కలిగే ఆర్థిక నష్టాన్ని ఇప్పుడే అంచనా వేయడం సాధ్యం కాదని అభిప్రాయపడింది.ఉద్రిక్తతల వల్ల వాణిజ్యం, ఆర్థిక కార్యకలాపాల్లో అంతరాయాలు, ఇంధన ధరల పెరుగుదల, మార్కెట్లలో అస్థిరతను తాము గమనించినట్లు పేర్కొంది. ప్రస్తుతం పరిస్థితి అత్యంత వేగంగా మారుతోందని, ఇది ఇప్పటికే అనిశ్చితిలో ఉన్న ప్రపంచ ఆర్థిక వ్యవస్థను మరింత ఇబ్బందుల్లోకి నెట్టినట్లు ఐఎంఎఫ్ స్పష్టం చేసింది. ఈ యుద్ధం ఎంత కాలం కొనసాగుతుందనే దానిపై ఎంత నష్టం జరుగుతుందనేది ఆధారపడి ఉంటుందని పేర్కొంది.ఇప్పటికే రష్యా- ఉక్రెయిన్ యుద్ధం వల్ల ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఇబ్బందుల్లో ఉన్న విషయం తెలిసిందే. ఇప్పుడు పశ్చిమ ఆసియాలో అస్థిరత ఏర్పడటంతో అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు పెరుగుతున్నాయి. ఇది ప్రపంచవ్యాప్తంగా ద్రవ్యోల్బణానికి దారితీసే అవకాశం ఉంది. ఎర్ర సముద్రం, ఇతర కీలక జలమార్గాల ద్వారా జరిగే సరుకు రవాణాకు ఆటంకాలు కలుగుతున్నాయని ఐఎంఎఫ్ తన నివేదికలో చెప్పింది. దీనివల్ల రవాణా ఖర్చులు పెరిగి, సరఫరా దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేసింది. అంతర్జాతీయ స్టాక్ మార్కెట్లు, ఆర్థిక సంస్థలు ఈ పరిణామాల పట్ల ఆందోళన చెందుతున్నాయి. పెట్టుబడిదారులు సురక్షితమైన ఆస్తుల వైపు మళ్లుతుండటంతో ఆర్థిక మార్కెట్లలో అనిశ్చితి నెలకొంది.ఇంధన భద్రతపై భారత్ దీమా!భారతదేశం తన అవసరాల కోసం ముడి చమురు దిగుమతులపై అధికంగా ఆధారపడుతున్న నేపథ్యంలో, ఈ సంక్షోభం భారత ఆర్థిక వ్యవస్థపై ప్రభావం తీవ్ర పడనుంది. అయితే ఈ అంశంపై కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరీ స్పష్టత ఇచ్చారు. భారతదేశం వద్ద ప్రస్తుతం వ్యూహాత్మక నిల్వలతో కలిపి సుమారు 8 వారాలకు సరిపడా ముడి చమురు, ఇతర పెట్రోలియం ఉత్పత్తుల నిల్వలు ఉన్నాయని చెప్పారు. ఇందులో పెట్రోల్, డీజిల్ మాత్రమే కాకుండా విమాన ఇంధనం కూడా తగినంత మొత్తంలో ఉందని స్పష్టం చేశారు.ప్రపంచ వాణిజ్యానికి కీలకమైన హర్మూజ్ జలసంధిలో అస్థిరత ఏర్పడితే సరఫరా ఆగిపోతుందనే ఆందోళనల నడుమ భారత్ వ్యూహాత్మక అడుగులు వేస్తోంది. ప్రస్తుతం భారత చమురు దిగుమతుల్లో కేవలం 40శాతం మాత్రమే ఈ జలసంధి ద్వారా వస్తున్నాయి. మిగిలిన 60శాతం చమురు రష్యా, అమెరికా, ఇతర ఆఫ్రికన్ దేశాల నుంచి వేరే మార్గాల ద్వారా చేరుతోంది. ఈ ఉద్రిక్తతలు ఉన్నన్ని రోజులు ఇతర మార్గాల ద్వారా ఎగుమతులను పెంచుకునే ఆలోచనలో కేంద్రం ఉన్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా, పెట్రోలియం మంత్రిత్వ శాఖ ఒక ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసింది. ఇది దేశవ్యాప్తంగా ఉన్న చమురు నిల్వలను, అంతర్జాతీయంగా జరుగుతున్న పరిణామాలను నిమిష నిమిషం పర్యవేక్షిస్తుంది. ఇది ఒకే ప్రాంతంపై ఆధారపడటాన్ని తగ్గించింది. దీనివల్ల మధ్యప్రాచ్యంలో ఏవైనా తాత్కాలిక సరఫరా అంతరాయాలు ఏర్పడినా, దేశం వాటిని సమర్థవంతంగా ఎదుర్కోగలదని భారత్ నమ్ముతోంది. అయితే, భారతదేశం గత అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకొని, తన వ్యూహాత్మక నిల్వలను పెంచుకోవడం, దిగుమతులను విభిన్న దేశాల నుంచి సేకరించడం ద్వారా ఒక సురక్షితమైన స్థితిలో ఉన్నట్లు కనిపిస్తోంది.


# భారీ నష్టాల్లో స్టాక్‌మార్కెట్లు

**సెన్సెక్స్ 2500పైగా పాయింట్లు డౌన్**

**చమురు ధరలు ఏ116 డాలర్లు**

**చమురు ధరలు పెరగడంతో నష్టాల్లో స్టాక్ మార్కెట్లు**

**ఒక్కరోజులోనే 8 లక్షల కోట్లకు పైగా సంపద ఆవిరి**



పశ్చిమాసియాలో చమురు, గ్యాస్ క్షేత్రాలపై జరుగుతున్న దాడులు, గ్లోబల్ స్థాయిలో భారీగా పెరిగిన ఇంధన ధరలు, విదేశీ ఇన్వెస్టర్లు పెట్టుబడులను ఉపసంహరించుకోవడం వెరసి గురువారం భారతీయ స్టాక్ మార్కెట్లు భారీ పతనాన్ని చవిచూశాయి. వరుసగా మూడు రోజుల పాటు లాభాల్లో కొనసాగిన సూచీలు అంతర్జాతీయ ప్రతికూలత ధాటికి కుప్పకూలాయి. సెన్సెక్స్ 2,500 పాయింట్లు, నిఫ్టీ 800 పాయింట్లపైగా పడిపోయాయి. దీంతో గురువారం ఒక్కరోజే రూ.8 లక్షల కోట్లకుపైగా సంపద ఆవిరి అయ్యింది. ప్రస్తుతం బీఎస్‌ఈ సెన్సెక్స్ 2,580 పాయింట్ల నష్టపోయి 74,123 వద్ద ట్రేడ్ అవుతోంది. నిఫ్టీ 808 పాయింట్లు కోల్పోయి 22,972 వద్ద వద్ద ట్రేడ్ అవుతోంది.పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల వల్ల చమురు సరఫరాకు ఆటంకం కలుగుతుందనే ఆందోళనలతో బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర భారీగా పెరిగింది. క్రూడ్ ఆయిల్ బ్యారెల్‌కు 116 డాలర్లకు చేరుకుంది. క్రూడ్ ఆయిల్ విషయంలో భారత్ దిగుమతులపైనే ఆధారపడి ఉంది. దీంతో భారతీయ మార్కెట్‌పై ఆ సెంటిమెంట్ భారీగా పడింది. మరోవైపు దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ చైర్మన్ అకస్మాత్తుగా రాజీనామా చేశారు. దీంతో ఆ బ్యాంక్ షేర్లు 3 శాతానికి పైగా పడిపోయాయి.జీవనకాల కనిష్ఠానికి రూపాయి విలువఅంతర్జాతీయ విపణిలో దేశీయ కరెన్సీ రూపాయి విలువ జీవనకాల కనిష్ఠానికి పడిపోయింది. అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 49 పైసలు కోల్పోయి 92.89 వద్ద కొనసాగుతోంది.ఆసియా మార్కెట్లలోనూ నష్టాలుమరోవైపు అమెరికా మార్కెట్లు బుధవారం భారీ నష్టాలతో ముగిశాయి. ఆ ప్రభావం గురువారం ఉదయం ఆసియా మార్కెట్లపై పడింది. దీంతో ఆసియా మార్కెట్లు కూడా భారీగా నష్టపోయాయి. దక్షిణ కొరియాకు చెందిన కోస్పీ 1.55శాతం, జపాన్‌కు చెందిన నిక్కీ 2.18శాతం , షాంఘైకు చెందిన ఎస్‌ఎస్‌ఈ కాంపోజిట్ ఇండెక్స్, హాంకాంగ్‌కు చెందిన హాంగ్ సెంగ్ ఇండెక్స్ సూచీ 1.68 శాతం నష్టాల్లో ట్రేడ్ అయ్యాయి. ఇక అమెరికా మార్కెట్లు కూడా నష్టాల్లోనే ముగిశాయి. నాస్‌డాక్ మినహా మిగతా అన్ని సూచీలు పడిపోయాయి.విదేశీ పెట్టుబడిదారుల భారీ అమ్మకాలుఇదే సమయంలో ఇరాన్ - అమెరికా యుద్ధం మొదలైనప్పటి నుంచి విదేశీ ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులను ఉపసంహరిచుకుంటున్నారు. బుధవారం ఒక్కరోజే రూ. 2,714.35 కోట్ల విలువైన షేర్లను విక్రయించారు. మంగళవారం రూ.4,741 కోట్లు, సోమవారం రూ.9వేల కోట్లకు పైగా, శుక్రవారం అత్యధికంగా రూ.10వేల కోట్లకు పైగా విదేశీ మదుపరులు తమ పెట్టుబడులను ఉపసంహరించుకున్నారు.కారణాలివేపశ్చిమాసియా యుద్ధం వల్ల ఇంధన ధరలు పెరిగాయని అమెరికా ఫెడ్ వడ్డీ రేట్లను యథాతథంగా ఉంచింది. ఈ నిర్ణయం ప్రభావంతో అమెరికా మార్కెట్లు బుధవారం నష్టాల్లో ముగిశాయి. ఆ ప్రభావం గురువారం ఆసియా మార్కెట్లపై స్పష్టంగా కనిపించింది.ఇటీవల మూడు రోజులుగా మదుపర్లు కొనుగోళ్లు చేపట్టడంతో సూచీలు లాభాల్లో కొనసాగినప్పటికీ, గురువారం ట్రేడింగ్‌లో లాభాల స్వీకరణకు మొగ్గుచూపడం కూడా మార్కెట్ల పతనానికి కారణమైంది. దీంతో ప్రీ ట్రేడింగ్‌లోనే సెన్సెక్స్ 1900 పాయింట్లపైగా క్షీణించింది. ప్రస్తుతం 2వేల పాయింట్ల పైగానే పడిపోయాయి.ఇక ఖతార్ ఆర్థికవ్యవస్థకు పునాది అయిన రస్ లఫాన్ ఇండస్ట్రియల్ సిటీపై ఇరాన్ క్షిపణి దాడి చేసింది. భారత్ దిగుమతి చేసుకునే లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్‌లో దాదాపు 47 శాతం ఖతార్ నుంచే వస్తుంది. ఈ నేపథ్యంలో ఇంధన ధరలు మరింత పెరిగే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.



# గుండెల్లో కత్తి దించకలా ఓ అందమైన పిల్లా! ఏదైతేనేం...

చేప పిల్ల నీళ్లలోంచి ఆత్రంగా ఎగురుతూ గట్టున పడింది. ఆపై తిరిగి నీళ్లలోకి గెంతేందుకు చాలా ప్రయాసలు పడింది. వయసొచ్చిన అమ్మాయి.. గట్టున పడిన చేప పిల్ల ఒకటేనని అంటాడు ఓ ప్రముఖ కవి. ఏదైతేనేం.. ఇక్కడ ఇంచుమించు అలాంటి సన్నివేశంలోనే కనిపిస్తోంది స్టార్ డాటర్ సారా అలీఖాన్. తనదైన అందం యవ్వనంతో కట్టి పడేస్తున్న సారా అలీఖాన్ కి దేశవ్యాప్తంగా ఫాలోయింగ్ ఏర్పడింది. ఈ బ్యూటీ తాను నటించిన ప్రతి సినిమాలో ఏదో ఒక వైవిధ్యం కోసం పాకులాడుతోంది. తనలోని పరిణతిన బయటపెడుతోంది. ఇప్పుడు మర్డర్ ముబారక్ ప్రమోషన్స్ కోసం చాలా క్రియేటివిటీని ప్రదర్శిస్తోంది. సాంప్రదాయ రెడ్ కార్పెట్‌లు ఇంటర్వ్యూలను పక్కనపెట్టి సారా స్టన్నింగ్ ఫోటోషూట్లతో సినిమా థీమ్ ని ఎలివేట్ చేస్తోంది. తాజాగా బ్లాక్ ఫ్లోరల్ గౌను ధరించి స్టన్నింగ్ ఫోజ్ లతో కట్టి పడేసింది. ఖరీదైన సోఫాలో తనను చూడగానే ఆక్వేరియంలో ఈదుతున్న అందమైన చేపపిల్లలా కనిపించింది. సారా రకరకాల భంగిమల్లో కెమెరాకు ఫోజులిచ్చింది. %--% క్లబ్ యు టు డెత్%--% అనే పుస్తకాన్ని చదువుతూ కనిపించింది. ఇది సినిమా డార్క్ థీమ్‌ను ఫన్ వేలో సూచిస్తుంది. మరొక ఫోటోలో తన శరీరానికి కత్తిని గుండెలపైకి ఆన్చి కనిపించింది. సినిమా టైటిల్ కి తగ్గట్టే మర్డర్ అయిపోతావ్! అన్నట్టుగా ఉంది ఈ ఫోజ్. గుండెల్లో కత్తి దించకలా ఓ అందమైన పిల్లా! అంటూ ఇప్పుడు ఈ ఫోటోగ్రాఫ్స్ కి నెటిజనులు కామెంట్లు రువ్వుతున్నారు. మర్డర్ ముబారక్.. టైటిల్ కి తగ్గట్టే ఉత్కంఠభరితమైన హత్యల వెనక మిస్టరీ ఏమిటన్నది తెరపైనే చూడాలని మేకర్స్ చెబుతున్నారు. హోమీ అదజానీ ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. సారా పాత్ర ఇందులో హంతకురాలా కాదా? అన్నది చూడాలి. నేడు విడుదలైన ఈ చిత్రంపై మిశ్రమ సమీక్షలు వచ్చాయి.




# అందాల షో తో దిశా అదుర్స్



లోఫర్ సినిమాతో తెలుగు ప్రేక్షకుల పరిచయం అయిన ముద్దుగుమ్మ దిశా పటానీ. ఈ అమ్మడు మొదటి సినిమాతో టాలీవుడ్ లో సక్సెస్ దక్కించుకోలేక పోయింది. అదే సమయంలో హిందీలో ధోనీ సినిమాలో నటించే అవకాశం దక్కడం, ఆ సినిమా భారీ విజయాన్ని సొంతం చేసుకోవడంతో అక్కడ బిజీ అయ్యింది. బాలీవుడ్ లో ఈ అమ్మడి జోరు కంటిన్యూ అవుతోంది. బాలీవుడ్ లో ఈ అమ్మడు వరుసగా చేస్తున్న సినిమాలు బాక్సాఫీస్ వద్ద మంచి విజయాలను సొంతం చేసుకుంటూ ఉంది. సోషల్ మీడియాలో ఈ అమ్మడు షేర్ చేసిన ఫోటోలతో రెగ్యులర్ గా నెట్టింట వైరల్ అవుతూనే ఉంటుంది.తాజాగా లైఫ్ స్టైల్ ఆసియా ఇండియా మ్యాగజైన్ కోసం దిశా పటానీ అందాల ఆరబోత ఫోటో షూట్ తో కవర్ పేజీకి ఫోజ్ ఇచ్చింది. ఆకట్టుకునే అందం తో పాటు మంచి ఫిజిక్ ఈ అమ్మడి సొంతం అంటూ ఈ ఫోటోలతో మరో సారి నిరూపితం అయ్యిందని నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. చాలా కాలం తర్వాత టాలీవుడ్ లో ఈ అమ్మడు ప్రభాస్ కు జోడీగా కల్కి సినిమాలో నటిస్తోంది. మరో వైపు బాలీవుడ్ లో కూడా ఈ అమ్మడు రెండు మూడు సినిమాలు చేస్తోంది. మరో రెండు సినిమాలు చర్చల దశలో ఉన్నట్లు సమాచారం అందుతోంది. మొత్తానికి హీరోయిన్ గా బిజీగా ఉన్న ఈ అమ్మడు ఇలా కవర్ పేజీ పై అందాల ఆరబోత ఫోటోలతో నెట్టింట ప్రేక్షకులకు కన్నుల విందు చేస్తుంది.

# అందాల షామా పింక్ అందాలు



1999 లో మాన్ సినిమా తో సినిమా ఇండస్ట్రీలో అడుగు పెట్టి అక్కడ నుంచి బుల్లి తెరపై యే మేరి లైఫ్ హై టీవీ సిరీస్ ద్వారా ప్రేక్షకుల్లో గుర్తింపు దక్కించుకున్న ముద్దుగుమ్మ షామా సికిందర్. నాలుగు పదుల వయసు దాటినా కూడా అందాల విషయంలో బాలీవుడ్ స్టార్ హీరోయిన్స్ కి పోటీ అన్నట్లుగా ఈ అమ్మడు నిలుస్తూ ఉంటుంది. ఈ మధ్య కాలంలో నెట్టింట ఈ అమ్మడు రెగ్యులర్ గా అందాల ఆరబోత ఫోటోలు షేర్ చేస్తూ వస్తుంది. తాజాగా మరోసారి నెట్టింట ఈమె షేర్ చేసిన అందాల పింక్ డ్రెస్ ఫోటోలు నెట్టింట అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఇంతటి అందం ఉన్నా కూడా హీరోయిన్ గా ఆఫర్లు రావడం లేదని కొందరు అయ్యో పాపం అంటున్నారు. గత కొంత కాలంగా సినిమాలకు దూరంగా ఉంటూ కేవలం సోషల్ మీడియా ద్వారా ప్రేక్షకులకు కన్నుల విందు చేస్తున్న ముద్దుగుమ్మ షామా సికిందర్ మళ్లీ హీరోయిన్ గా ఆఫర్లు దక్కించుకోవాలని, నటిగా బిజీ అవ్వాలని ఈ ఫోటోలు చూసిన నెటిజన్స్ కోరుకుంటున్నారు. అందాల షామా సికిందర్ అందానికి తగ్గ ఆఫర్లు, గుర్తింపు రాలేదు అనేది ఈ ఫోటోలు చూస్తే మళ్లీ అనిపిస్తోందని కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈ మధ్య కాలంలో షేర్ చేసిన ఫోటోలు చూసి అయినా ఫిల్మ్ మేకర్స్ ఈమెకు ఆఫర్లు ఇస్తారేమో చూడాలి.

# రాశీఖన్నా అలాంటి ట్రయల్స్ వేస్తోందా?

రాశీఖన్నా ఇండస్ట్రీకొచ్చిన కొత్తలో ఎలా ఉండేది? మధ్యలో ఎలా మారింది? ఇప్పుడు ఎలా ఉంది? అంటే అంటే రూప లావణ్యంలో రకరకాల వ్యత్యాలు గమనించవచ్చు. అమ్మడు ఆరంభంలో కాస్త చబ్బీలుక్ లో కనిపించేది. కొన్ని సినిమాలు అదే లుక్ మెయింటెన్ చేసేసరికి ఆమె సహా అభిమానులకు బోర్ కొట్టింది. దీంతో లుక్ ఛేంజ్ అంటూ వెయిట్ లాస్ అయింది. అవసరం మేర కొంత వెయిట్ తగ్గింది తప్ప పూర్తిగా చబ్బీ లుక్ కి దూరంగా కాలేదు. అలా కొంత కాలం జర్నీ సాగించింది. సౌత్ లో అవకాశాలు రావాలంటే ఆ మాత్రం మెయింటెన్ చేయకపోతే ఎలా అని ముందుకెళ్లింది. అయితే అమ్మడు రెండు..మూడేళ్లగా తెలుగు సినిమాలకంటే బాలీవుడ్..కోలీవుడ్ చిత్రాలపైనే ఎక్కువగా దృష్టి పెడుతుంది. గత ఏడాది పూర్తిగా ఖాళీగా ఉంది. ఒక్క సినిమాతో కూడా ప్రేక్షకుల ముందుకు రాలేదు. అలాగని రాశీ కనిపించకుండా పోలేదు. అభిమానుల కోసం అప్పుడప్పుడు ఇన్‌స్టాలో చక్కెర్లు కొట్టేది. %ూశ్రీంశీ =ముం% - హిట్ లవ్ స్టోరీ సీక్వెల్ లో హీరోని తప్పించిన హీరో! కొత్త ఫోటోలతో ఖుషీ అవ్వండని వదిలేది. అయితే అమ్మడు లుక్ విషయంలో మరింత సీరియస్ గా ఉందని తెలుస్తుంది. తాజాగా రాశీఖన్నా ఓ స్లిమ్ పిక్ ని ఇన్‌స్టాలో షేర్ చేసింది. రాశీ ట్రాన్సపర్మేషన్ కి స్టన్ అవ్వాల్సిందే అనిపించింది. జీరో సైజ్ ట్రై చేస్తుందా? అన్నంతగా లుక్ లో మార్పు కనిపిస్తుంది. ఆరెంజ్ కలర్ షోల్డర్ లెస్ న్యూ ఔట్ ఫిట్ లో అలాగే కనిపిస్తుంది. అమ్మడు గతం కంటే మరింత నాజుగ్గా కనిపిస్తుంది. రాశీముస్తాబైన విధానం..కాళ్లకు హై హీల్స్ ధరించి లాంగ్ షాట్ లో క్యాప్చర్ చేసిన పిక్ కావడంతో సంథింగ్ స్పెషల్ గా ఫోకస్ అవుతుంది. ప్రస్తుతం ఈ ఫోటో నెట్టింట వైరల్ గా మారింది. రాశీ బ్యూటీని పొగిడేస్తు అభిమానులు చేస్తోన్న కామెంట్స్ అంతే ఆసక్తికరం. ఇక రాశీఖన్నా తమిళ్.. తెలుగు... హిందీ భాషలంటూ ఐదారు సినిమాలతో బిజి బిజీగా ఉంది.






# నవ్వుల రాయుళ్లు.. హీరోలయ్యారు



తెలుగు తెర 70ఎమ్ఎమ్ కన్నా విశాలమైనది. తనను అలరించిన నటుణ్ని వెండితెర బంగారంలా చూసుకుంటుంది. అనామకులను స్టార్లను చేసింది. సూపర్ విలన్‌ను మెగాస్టార్‌గా నిలబెట్టింది. వారసులకూ పట్టం కట్టింది. సెల్యులాయిడ్ స్క్రీన్‌కు కితకితలు పెట్టించిన కమెడియన్లనూ హీరోలు చేసిన ఘనత టాలీవుడ్ సొంతం. ఈ ఒరవడి పాతదే అయినా.. ఈ తరంలో మాత్రం నవ్వులు పంచుతున్న ఎందరో నటులు.. హీరోలుగా ప్రేక్షకులను అలరిస్తున్నారు. తమ అదృష్టాన్ని నవ్వులతోనే పరీక్షించుకుంటున్నారు.

కమెడియన్లు హీరోలుగా ప్రయత్నించడం తెలుగు సినిమా చరిత్రలో పాతదే! బ్లాక్ అండ్ వైట్ రోజుల్లో ఒకరిద్దరు మాత్రమే ఇలా హీరోలుగా సాహసం చేశారు. రెండో తరంలోనూ అదే ఒరవడి కొనసాగినా.. సినిమాల సంఖ్య విశేషంగా పెరిగింది. ప్రస్తుతం నలుగురైదుగురు కమెడియన్లు హీరోలుగా చేస్తూ మంచి హిట్లు తమ ఖాతాలో వేసుకుంటున్నారు. కమర్షియల్ ఫార్ములా కాకుండా.. విభిన్న కథలను ఎంచుకొని తమ కామెడీ టైమింగ్‌తో సినిమాకు హీరో టచ్ ఇస్తున్నారు.



గట్టి పొట్టివాడు

టాలీవుడ్ బ్లాక్ అండ్ వైట్ జమానాను ఏలిన కమెడియన్లలో పద్మనాభం ఒకరు. రేలంగి తర్వాత అంతటి ఘనుడన్న కీర్తి సంపాదించాడు. కమెడియన్ పాత్రలు వేసినా చాలా సినిమాల్లో పద్మనాభానికి ఒక పాట పెట్టేవారు దర్శక, నిర్మాతలు. అలా హీరోకున్నంత స్టార్‌డమ్ తెచ్చుకున్నాడు. ఆయనే స్వయంగా రేఖ అండ్ మురళి సంస్థను స్థాపించి హీరోగా అవతారం ఎత్తాడు. మొదటి ప్రయత్నంగా ‘పొట్టి ప్లీడరు’ సినిమాలో కథానాయకుడిగా కనిపించాడు. కోర్టు డ్రామా కథతో ప్రేక్షకులను అలరించాడు. మరో ప్రయత్నంగా ‘శ్రీశ్రీశ్రీ మర్యాద రామన్న’ సినిమాతో ముందుకొచ్చాడు. ఈ రెండు సినిమాలూ బాక్సాఫీస్ దగ్గర మంచి హిట్ సాధించాయి. ఈ చిత్రంలోని పాటలూ బహుళ జనాదరణ పొందాయి. పొట్టివాడే కానీ గట్టివాడు అనిపించుకున్నాడు. హీరోగా అవతారమెత్తిన మొదటి తెలుగు కమెడియన్‌గా పద్మనాభం పేరు ఎప్పటికీ నిలిచి ఉంటుంది.



హీరో బ్రహ్మి

‘అహ నా పెళ్ళంట!’తో కమెడియన్‌గా ప్రేక్షకులకు పరిచయమైన నటుడు బ్రహ్మానందం. మొదటి సినిమాలో ‘అరగుండు’గా అలరించిన ఆయన.. అనతి కాలంలోనే స్టార్‌డమ్ సొంతం చేసుకున్నాడు. హీరో ఎవరున్నా.. కమెడియన్ బ్రహ్మానందం ఓన్లీ అన్నంతగా పేరు తెచ్చుకున్నాడు. హీరోగానూ బ్రహ్మి మంచి ప్రయత్నాలే చేశాడు. ‘బాబాయి హోటల్’, ‘పెళ్లామా మజాకా!’, ‘జోకర్ మామ సూపర్ అల్లుడు’ తదితర సినిమాలు బ్రహ్మానందానికి హీరోగా మంచిపేరే తెచ్చాయి. అయితే, కొన్ని సినిమాలు కమర్షియల్‌గా అంతగా సక్సెస్ కాకపోవడంతో ఈ కామెడీ కింగ్ మళ్లీ నవ్వుల జర్నీ కంటిన్యూ చేశాడు.


అక్కుం బక్కుం

బాల నటుడిగా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన అలీ కమెడియన్‌గా మంచి ఫ్యాన్ ఫాలోయింగ్‌ను సంపాదించాడు. హీరో పాత్రలకు స్నేహితుడిగా అలీ పండించిన కామెడీ ఎప్పటికీ గుర్తుంటుంది. కమెడియన్‌గా పీక్‌లో ఉన్నప్పుడే ‘యమలీల’ సినిమాతో హీరోగా ప్రయత్నించాడు. ఆ చిత్రం మెగాహిట్ అవ్వడంతో బిజీ అయిపోయాడు. దాదాపు యాభై సినిమాల వరకు హీరోగా చేసి ప్రేక్షకులను అలరించాడు. ఘటోత్కచుడు, పిట్టలదొర, ఆలీబాబా అద్భుత దీపం, అక్కుం బక్కుం ఇలా ఏడాదికి రెండు మూడు చిత్రాల్లో హీరోగా క్రేజ్ సంపాదించుకున్నాడు.




భీమవరం బుల్లోడు

అలీ తర్వాత చాలాకాలం హీరోగా మరే కమెడియన్ ప్రయత్నించలేదు. కొరియోగ్రాఫర్ అవుదామని వచ్చి కమెడియన్‌గా స్థిరపడ్డ సునీల్ దీన్ని బ్రేక్ చేశాడు. 2006లో ‘అందాల రాముడు’ సినిమాతో హీరోగా ప్రయోగం చేశాడు. ఆ చిత్రం ఓ మోస్తరు కలెక్షన్లు రాబట్టినా.. కమెడియన్‌గానే కంటిన్యూ అయ్యాడు. 2010లో రాజమౌళి దర్శకత్వంలో ‘మర్యాదరామన్న’ సినిమాతో పూర్తిస్థాయి కథానాయకుడిగా మారాడు. తర్వాత కమెడియన్ పాత్రలు తగ్గిస్తూ వచ్చాడు. ఒకానొక దశలో కేవలం హీరో పాత్రలకే పరిమితం అయ్యాడు. పూలరంగడు, మిస్టర్ పెళ్లికొడుకు, తడాఖా, కృష్ణాష్టమి, ఈడు గోల్డ్ ఎహే%ూ% ఇలా వరుసగా సినిమాలు చేశాడు. అయితే చాలా చిత్రాలు పెద్దగా ఆడకపోవడంతో హీరోగా సునీల్ క్రేజ్ తగ్గిపోయింది. కొన్నాళ్లకు తనకు అచ్చొచ్చిన కామెడీనే ఎంచుకొని మళ్లీ ఆ దారిలోకి వచ్చాడు. ‘పుష్ప’తో విలన్‌గా సత్తా చాటాడు. ఇప్పుడు కమెడియన్‌గా, విలన్‌గా రాణిస్తూ పూర్వ వైభవాన్ని సంతరించుకున్నాడు ఈ భీమవరం బుల్లోడు.




జెట్‌స్పీడ్‌లో..

కమెడియన్లలో వేణుమాధవ్ టక్‌స్టైల్ ప్రత్యేకం. మిమిక్రీపై పట్టున్న ఈ నవ్వుల నటుడి కెరీర్ జెట్ స్పీడ్‌లో దూసుకుపోయింది. కమెడియన్‌గా పీక్‌లో ఉన్నప్పుడు హీరోగానూ ప్రయత్నం చేశాడు. హంగామా, భూకైలాస్, ప్రేమాభిషేకం సినిమాల్లో కథానాయకుడి పాత్ర పోషించాడు. హీరోగా నటిస్తూనే.. వేరే సినిమాల్లో కామెడీ రోల్స్ చేస్తూ కెరీర్ ఇబ్బందిపడకుండా జాగ్రత్తపడ్డాడు. కమర్షియల్ ఈక్వేషన్స్‌కు తాను సరిపడనని భావించి హీరోయిజం నుంచి జెట్‌స్పీడ్‌లో వెనక్కి వచ్చి బతికున్నంత కాలం కమెడియన్‌గా కంటిన్యూ చేశాడు.



ప్రత్యేక హీరో

కమెడియన్‌గా బ్రహ్మానందం, అలీ అంత క్రేజ్ లేకున్నా.. శ్రీనివాస్ రెడ్డిది డిఫరెంట్ అప్పియరెన్స్! టైమింగ్‌తో ప్రేక్షకులను ఆకట్టుకున్నాడు. యంగ్ హీరోలకు స్నేహితుడి పాత్రలో ఎన్నో సినిమాల్లో అలరించాడు. కమెడియన్‌గా అవకాశాలు ఇబ్బడిముబ్బడిగా వస్తున్న తరుణంలోనే హీరోగా అదృష్టాన్ని పరీక్షించుకున్నాడు. ‘గీతాంజలి’తో మంచి విజయాన్ని అందుకున్నాడు. తర్వాత హారర్ కామెడీ సినిమా ‘ఆనందోబ్రహ్మ’తో ద్వితీయ విఘ్నాన్నీ అధిగమించాడు. ‘జయమ్ము నిశ్చయమ్మురా’ సినిమాతో ఓ మోస్తరు సక్సెస్ సాధించాడు. కామెడీ పాత్రలు పోషిస్తూనే.. హీరోగా అవకాశం వస్తే వదలనంటున్నాడు శ్రీనివాస్ రెడ్డి.



డిఫరెంట్ సుహాస్

లుక్స్, స్టైల్‌తో కామెడీ పుట్టించగల నటుడు సుహాస్. కమెడియన్‌గా లాంగ్ జర్నీ పూర్తికాకముందే హీరోగా ప్రయత్నించి వరుస విజయాలు సొంతం చేసుకుంటున్నాడు. మొదటి ప్రయత్నంగా ఆయన హీరోగా నటించిన ‘కలర్‌ఫొటో’ సినిమా ఆహా ఓటీటీలో విడుదలై ప్రభంజనం సృష్టించింది. ‘రైటర్ పద్మభూషణ్’లో సుహాస్ పెర్ఫార్మెన్స్‌కు ఫ్యాన్స్ ఫిదా అయ్యారు. కామెడీతోపాటు ఎమోషన్స్ కూడా బాగా పండించి మంచి మార్కులు కొట్టేశాడు. తాజాగా ‘అంబాజీపేట మ్యారేజి బ్యాండు’ సినిమాలోనూ తన యాక్టింగ్ పవర్ చూపించాడు. ఈ సినిమా కూడా మంచి టాక్ తెచ్చుకోవడంతో ఇప్పుడు హీరోగా సెటిల్ కావడానికి సిద్ధమవుతున్నాడు. తాజాగా సుహాస్ హీరోగా ‘ఆనందరావు అడ్వెంచర్స్’ అనే ఫాంటసీ సినిమా తెరకెక్కుతుండటం విశేషం.

అదే దారిలో వీళ్లూ..

ఎంత సీరియస్ సినిమాలో అయినా సరే.. వెన్నెల కిషోర్ పాత్ర రాగానే, థియేటర్‌లో నవ్వులు పూస్తాయి. డిఫరెంట్ మేనరిజమ్స్, క్యారెక్టరైజేషన్స్‌తో ఈ కమెడియన్ చాలా సినిమాల సక్సెస్‌కు కారణమయ్యాడు. 2013లో ‘అతడు ఆమె ఓ స్కూటర్’ సినిమాతో హీరోగా ప్రయత్నించిన కిషోర్.. ‘ఎలుకా మజాకా’ సినిమాలో బ్రహ్మానందంతో హీరోపాత్ర పంచుకున్నాడు. తాజాగా ‘చారి 111’తో హీరోగా ప్రయత్నించాడు. ఇకపై ఈ నవ్వుల కిషోర్ ఎటుగా ప్రయాణిస్తాడో చూడాలి. ‘సత్యం’ సినిమాను ఇంటిపేరుగా మార్చుకున్న కమెడియన్ రాజేశ్. చాలాకాలం నవ్వులు పండించిన ఈ నటుడు ఇటీవల హీరోగా ప్రయత్నించాడు. ‘పొలిమేర’ సినిమాతో ఒక్కసారిగా తనలోని మరో కోణాన్ని చూపించాడు. ‘పొలిమేర’తో ఓటీటీలో షాక్ ఇచ్చిన రాజేశ్.. దీనికి సీక్వెల్‌గా వచ్చిన ‘పొలిమేర 2’తో బాక్సాఫీస్ దగ్గరా భారీ విజయాన్ని అందుకున్నాడు. జబర్దస్త్ కమెడియన్లు సుడిగాలి సుధీర్, షకలక శంకర్, ధన్‌రాజ్ సైతం హీరోలుగా ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారు.

The Publisher, Editor seggem kiran kumar 8-6-128/m,TKR collage road , Nandanavanam colony, kharmanghat,Rangareddy, Telangana - 500079.
mail : vaarthasandhya@gmail.com, www.vaarthasandhya.com epaper.vaarthasandhya.com. Cell : 73961 22101 , 99517 51662.